పోతన తెలుగు భాగవతాంతర్గత

18.శ్రీకృష్ణ లీలలు-4

ధేనుకాసుర వధ - కాళింది మర్ధన

[ప్రజాకవి బమ్మెఱ పోతనామాత్య ప్రణీతము]

సంకలనం

భాగవత గణనాధ్యాయి

సౌజన్యం

https://telugubhagavatam.org/

2024



విషయసూచిక



పూర్వ పీఠిక

పోతన తెలుగు భాగవతం ప్రసాదించిన మన పోతన్నగారు అలతిపొలతి పదాలతో మన నల్లనయ్య మెలగుటలో మెఱుపులను వర్ణిస్తూ మనలను మైమర పిస్తాడు. మన స్థాయీ బేధానుసారం సారమందేలా అనుగ్రహించారు. కనుకనే శ్రీకష్ణలీలలు ఆబాల గోపాలమూ అందరికీ బహు ఇష్టమైనవే మరి. ఆ అమృత సోనలలో కృష్ణమూర్తివారు వ్రేపల్లె వీడి బృందావనానికి జేరిన పిమ్మట ఆరంభ మగు లీలలు ఇప్పుడు భాగవత బంధువులారా! ఆశ్వాదిద్దాము రండి.

వ్రేపల్లెలో ఉండగా గోపగోపికలందరూ శ్రీకృష్ణుని శైశదశ నుండి బ్రహ్మా నందం అనుభవిస్తున్నారు.కాని, ఎన్నెన్నో అమానుష అపాయాలు రావడం, నల్లనయ్య లీలలు ఎంతలా దాటిస్తున్నా, వారికి బాలుని క్షేమంగురించి లోలోన ఆందోళన పెరిగిపో సాగింది. అందుకని, ఉపనందుడను పుణ్య గోపాలుని సూచన మేరకు బృందావనానికి స్వామిని తీసుకుని వలసవెళ్ళిపోయారు. ఎక్కడకు తీసుకెళ్తేమాత్రం తనొచ్చిన ధ్యేయానికి ఎట్టి అవరోధాలు సాధ్యం కాదు కదండి.

మరి కృష్ణభగవానుని అన్న బలరామునితో ఇతర గోపబాలుర తోకూడి ఆవు దూడ లను మేపుకు రమ్మని పంపుతున్నారు. అలా ఆనందంగా జరుగుతుంటే ఒకనాడు తాటి తోపులో విఱ్ఱవీగుతున్న ధేనుకాసురుని బలరామునిచేతను శిక్షింపజేస్తాడు. పిమ్మట, మాహాద్భుతమైన ఆఖ్యానము కాళిందీ మర్దనం.

పుణ్య యమునానది యందలి కాళిందిమడుగు మహోకోపోద్రోకుడు కాళిందుడను మహావ్యాళము జేరెను. నాటి నుండి ఆతను విడుచు విషకలిత గాలి వలన కాళిందీ జలములు సర్వం విషపూరితం ఐపోయెను. ఆ నీరు త్రాగినా, జలముల పై పక్షులు విహ రించినా అవన్నీ తక్షణమే మరణించుచుండెను. దానితో బందావన గో గోపకుమారు లాది వారందరూ బహురకముల ఇబ్బందులు పడుచుండిరి. రాక్షసులను సంహరించే గోపాలకృష్ణ కాళిందుని మాత్రమే శిక్షించి ఆపదలను తొలగించ దలచాడు. రమ్యాతి రమ్య మైన ఆ విధానం కాళిందీమర్దనం.

ఈ అద్భుత శ్రీకృష్ణలీలలు ఆస్వాదిద్దాం రండి. మిత్రులారా.

~ భాగవత గణనాధ్యాయి.

వక్రతుండ మహాకాయం

సూర్యకోటి సమప్రభం।

నిర్విఘ్నం గురుమేదేవ

సర్వకార్యేషు సర్వథా॥

శ్రీరామ

18 శ్రీకృష్ణ లీలలు-4

ధేనుకాసుర వధ కాళిందీ మర్దన

ప్రార్థన

10.1-1-క. *



లంపటము నివారింపను

సంపదఁ గృపజేయ జయము సంపాదింపం

జంపెడివారి వధింపను

సొంపారఁగ నీక చెల్లు సోమార్ధధరా!

లంపటము = ఆపదను, తగులమును; నివారింపను = తొలగించుట; సంపదన్ = సంపదలను; కృపజేయ = ప్రసాదించుట; జయము = జయమును; సంపాదింపన్ = సంపాదించుట; చంపెడివారిన్ = క్రూరులను; వధింపను = సంహరించుట; సొంపారగన్ = చక్కగా చేయుట; నీక = నీకుమాత్రమే; చెల్లున్ = తగినది; సోమార్ధధరా = శంకరుడా {సోమార్ధధరుడు - సోమ (చంద్ర) అర్ధ (ఖండమును) ధర (ధరించినవాడు), శివుడు}.

అర్ధచంద్రుని అలంకారంగా ధరించిన మహా ప్రభూ! పరమేశ్వరా! ఈ ఆపదను తొలగించడానికి, ఆనందం చేకూర్చడానికి, జయాన్ని సంపాదించడానికి, క్రూరులను హతమార్చడానికి నీవు మాత్రమే సమర్థుడవు.

ధేనుకాసుర వధ

10.1-611-వ.

అ య్యవసరంబున శ్రీదామ నామధేయుం డయిన గోపాలకుండు రామ కేశవులం జూచి యిట్లనియె.

టీక:- అ; అవసరంబునన్ = సమయమునందు; శ్రీదామ = శ్రీదాముడనెడి; నామధేయుండు = పేరు కలవాడు; అయిన = ఐన; గోపాలకుండు = గొల్లవాడు; రామ = బలరాముడు; కేశవులన్ = కృష్ణులను; చూచి = ఉద్దేశించి; ఇట్లు = ఈ విధముగ; అనియె = పలికెను.

భావము:- అలా విహారాలు చేసేటప్పుడు ఒకసారి, శ్రీదాముడు అనే పేరు గల గోపబాలుడు బలరామ కృష్ణులను చూసి ఇలా అన్నాడు.

10.1-612-క.

"దూరంబునఁ దాలతరు

స్ఫారం బగు వనము గలదు; పతితానుపత

ద్భూరిఫలసహిత మది యే

ధీరులుఁ జొర వెఱతు రందు ధేనుకుఁ డుంటన్.

టీక:- దూరంబునన్ = దురప్రాంతమున; తాలతరు = తాడిచెట్లు; స్ఫారంబు = అధికముగా కలది; అగు = ఐన; వనము = తోట; కలదు = ఉన్నది; పతితానుపతత్ = అలాపడుతూనే ఉన్న; భూరి = అనేకమైన; ఫల = పండ్లు; సహితము = కలగినది; అది = అది; ఏ = ఏ; ధీరులున్ = వీరులును; ఛొరన్ = ప్రవేశించుటకు; వెఱతురు = భయపడెదరు; అందున్ = దాని యందు; ధేనుకుడు = ధేనుకాసురుడు; ఉంటన్ = ఉండుటచేత.

భావము:- "ఇక్కడ నుంచి చాలా దూరంలో తాడిచెట్లతో నిండిన వనము ఒకటి ఉంది. అక్కడ ఎన్నో పెద్ద పెద్ద తాటిపండ్లు ఒకదాని వెంట మరొకటి పండి రాలుతూ ఉంటాయి. కానీ అందులో ధేనుకుడు అనే రాక్షసుడు ఉండడం వలన, ఎంత ధైర్యం కలవారు అయినా ఆవనంలో ప్రవేశించడానికి జంకుతుంటారు.

10.1-613-వ.

ఆ ధేనుకాసురుండు మహాశూరుండును, ఖరాకారుండును నై సమాన సత్వసమేతులైన జ్ఞాతులుం దానును మనుష్యులం బట్టి భక్షించుచుండు; నయ్యెడఁ బరిమళోపేతంబులైన నూతన ఫల వ్రాతంబు లసంఖ్యాకంబులు గలవు; వినుఁడు.

టీక:- ఆ = ఆ; ధేనుక = ధేనుకుడు అనెడి; అసురుండు = రాక్షసుడు; మహా = గొప్ప; శూరుండును = శౌర్యము కలవాడు; ఖర = గాడిద; ఆకారుండును = రూపు కలవాడు; ఐ = అయ్యి; సమాన = సమానమైన (తనతో); సత్వ = బలము; సమేతులు = కలిగినవారు; ఐన = అయినట్టి; జ్ఞాతులున్ = దాయాదులు; తానునున్ = అతను; మనుష్యులన్ = మానవులను; పట్టి = పట్టుకొని; భక్షించుచుండున్ = తినివేయుచుండును; ఆ = ఆయొక్క; ఎడన్ = ప్రదేశమునందు; పరిమళ = సువాసనలతో; ఉపేతంబులు = కూడుకొన్నవి; ఐన = అయినట్టి; నూతన = కొత్త; ఫల = ఫండ్లు; వ్రాతంబులు = సమూహములు; అసంఖ్యాకంబులు = లెక్కలేనన్ని; కలవు = ఉన్నవి; వినుడు = వినండి.

భావము:- ఆ ధేనుకుడు మహాబలవంతుడు వాడు భయంకరమైన గాడిద రూపంలో ఉంటాడు. తనతో సమానమైన బలం కలిగిన తన బంధువుల తోపాటు తాను మనుష్యులను పట్టుకుని తింటూ ఉంటాడు. అక్కడ చక్కని సువాసనలు వెదజల్లుతూ ఎన్నో కొత్త కొత్త పండ్లు లెక్కపెట్టలేనన్ని ఉన్నాయి. వింటున్నారా.

10.1-614-క.

ఫలగంధము నాసాపుట

ముల జొచ్చి కలంచి చిత్తములఁ గొనిపోయెన్

ఫలముల నమలింపుఁడు మము;

బలియురకును మీకు దైత్యభటు లడ్డంబే?"

టీక:- ఫల = పండ్ల; గంధము = వాసన; నాసా = ముక్కు; పుటముల = రంధ్రముల; వెంటన్ = ద్వారా; ఛొచ్చి = దూరి; కలంచి = కలంచి; చిత్తములన్ = మనసులను; కొనిపోయెన్ = దొంగిలించెను; ఫలములన్ = పళ్ళను; నమలింపుడు = తినిపించండి; మమున్ = మమ్ములను; బలియుర = బలవంతులు; కునున్ = కు; మీ = మీ; కున్; దైత్య = రాక్షస; భటులు = యోధులు; అడ్డంబె = అడ్డమా ఏమిటి, కాదు.

భావము:- ఆ పండ్ల సువాసనలు మా ముక్కులలో ఛొరబడి మమ్మల్ని వ్యాకుల పెడుతూ మనస్సులను అటు లాగివేస్తున్నాయి. ఎలాగైనా ఆ పండ్లను మాకు తినిపించండయ్యా. మీరు మహాబలవంతులు మీకు ఆ సామాన్య రాక్షసులు అడ్డమా ఏమిటి."

10.1-615-వ.

అని పలికిన చెలికాని పలుకు లాదరించి విని నగి వారునుం దారును నుత్తాలంబగు తాలవనంబునకుం జని; యందు.

టీక:- అని = అని; పలికినన్ = చెప్పగా; చెలికాని = స్నేహితుని; పలుకులు = మాటలను; ఆదరించి = మన్నించి; విని = విన్నవారై; నగి = నవ్వి; వారునున్ = వాళ్ళు; తారునున్ = తాము; ఉత్ = ఎత్తైన; తాలంబు = తాడిచెట్లు గలది; అగు = ఐన; తాలవనంబు = తాటితోపున; కున్ = కు; చని = వెళ్ళి; అందు = దానిలో.

భావము:- ఇలా చెప్పిన మిత్రుని మాటలు విని బలరామ కృష్ణులు చిరు నవ్వుతో అంగీకరించారు. వారి తోపాటు ఆ తాటితోపులో ప్రవేశించారు.

10.1-616-క.

తత్తఱమున బలభద్రుఁడు

తత్తాలానోకహములఁ దనభుజబలసం

పత్తిఁ గదల్చుచు గ్రక్కున

మత్తేభము భంగిఁ బండ్లు మహిపై రాల్చెన్.

టీక:- తత్తఱమునన్ = వేగిరపాటుతో; బలభద్రుడు = బలరాముడు; తత్ = ఆ; తాల = తాడి; అనోకహములన్ = చెట్లను; తన = తనయొక్క; భుజబల = బాహుబలముయొక్క; సంపత్తిన్ = అధిక్యముతో; కదల్చుచున్ = ఊపేస్తూ; క్రక్కునన్ = చటుక్కున; మత్తేభము = మదించిన ఏనుగు; భంగిన్ = వలె; పండ్లున్ = పళ్ళను; మహి = నేల; పై = మీద; రాల్చన్ = పడగొట్టగా.

భావము:- బలరాముడు తొందర తొందరగా ఆ తాటి చెట్లను పట్టుకుని తన భుజబలంతో మదించిన ఏనుగులా కదలించగానే మగ్గిన తాటిపండ్లు దబ దబ నేల మీద రాలాయి.

10.1-617-వ.

అప్పుడు పండ్లు రాల్చిన చప్పుడు చెవులకు దెప్పరంబయిన, నదరిపడి రిపుమర్దన కుతుకంబున గార్దభాసురుండు

టీక:- అప్పుడు = అప్పుడు; పండ్లు = పళ్ళు; రాల్చిన = రాలగొట్టబడిన; చప్పుడున్ = ధ్వని; చెవుల్ = చెవుల; కున్ = కు; తెప్పరంబు = సహింపరానిది; అయినన్ = కాగా; అదరిపడి = ఉలికిపడి; రిపు = శత్రువులను; మర్దన = శిక్షించెడి; కుతుకంబునన్ = కుతూహలముతో; గార్దభ = గాడిద; అసురుండు = రాక్షసుడు.

భావము:- గార్దభ రూపంలో అక్కడ ఉండే రాక్షసుడు పండ్లు రాల్చిన చప్పుడు విన్నాడు. ఆ ధ్వని చెవిలో పడగానే అదిరిపడి శత్రువులను వెంటనే చంపేయాలనే కోరికతో బయలుదేరాడు.

10.1-618-మ.

పదవిక్షేపములన్ సవృక్షధరణీభాగంబు గంపింపఁగా
రదముల్ దీటుచుఁ గత్తిరించిన చెవుల్ రాజిల్ల వాలంబు భీ
తిదమై తూలఁగఁ గావరంబున సముద్దీపించి గోపాలకుల్
బెదరన్ రామునిఱొమ్ముఁదన్నె వెనుకై బీరంబు తోరంబుగన్.

టీక:- పద = అడుగులు; విక్షేపములన్ = కదలికలచే; సవృక్ష = చెట్లతోపాటు; ధరణీ = భూ; భాగంబున్ = ప్రదేశము; కంపింపగాన్ = అదురుతుండగా; రదముల్ = దంతములు, పళ్ళు; దీటుచున్ = నూరుతు, కొరుకుచు; కత్తిరించిన = చలించెడి, చీలిన; చెవుల్ = చెవులు; రాజిల్లన్ = విరాజిల్లుతుండగా; వాలంబున్ = తోక; భీతిదము = భయంకరముగా; తూలగన్ = ఊగుతుండగా; కావరంబున్ = గర్వము తో, కొవ్వెక్కి; సమ = మిక్కిలి; ఉద్దీపించి = ప్రకాశించి; గోపాలకుల్ = యాదవులు; బెదరన్ = భయపడునట్లుగా; రాముని = బలరాముని; ఱొమ్మున్ = వక్షస్థలమున; తన్నెన్ = తన్నెను (వెనుక కాళ్ళతో); వెనుక = వెనుకు తిరిగినది; ఐ = అయ్యి; బీరంబు = శౌర్యము; తోరంబుగన్ = అతిశయించగా.

భావము:- భయంకరంగా విజృంభించి వస్తున్న ఆ రాక్షసుని కాలి తాకిడికి అక్కడ ఉన్న నేలంతా చెట్లతో సహా అదరిపోయింది. అతడు చలిస్తున్న చెవులతో, తోక భయంకరంగా ఊగుతుండగా, పళ్ళు పట పట కొరుకుతూ, కొవ్వెక్కి పరిగెత్తుకు వచ్చాడు. ఆ గోపబాలకులు అందరూ బెదరిపోయేటట్లు బలరాముని వక్షస్థలం మీద ఒక తన్ను తన్నాడు.

10.1-619-క.

మఱియును దనుజుఁడు రాముని

గఱవఁగ గమకించి తెఱపిఁ గానక యతనిం

జుఱచుఱఁ జూచుచు శౌర్యము

పఱిబోవఁగ నింత నంతఁ బదములఁ దన్నెన్

టీక:- మఱియును = ఇంకను; దనుజుడు = రాక్షసుడు; రాముని = బలరాముని; కఱవగన్ = కరచుటకు; గమకింపన్ = యత్నించి; తెఱపి = సందు; కానక = చిక్కక; అతనిన్ = అతనిని; చుఱచుఱ = కోపముగా {చుఱచుఱ - కోపముతో చుఱచుఱ మను నిప్పులాంటి చూపులు}; చూచుచున్ = చూస్తు; శౌర్యమున్ = శూరత్వము; పఱిపోవగన్ = వ్యర్థమైపోగా; ఇంతనంతన్ = ఇక్కడనక్కడ (నేలపై); పదములన్ = కాళ్ళతో; తన్నెన్ = తన్నెను.

భావము:- తన్నడంతో ఊరుకోకుండా ఆ రాక్షసుడు బలరాముడిని కరవడానికి ప్రయత్నించాడు. కానీ బలరాముడు అంద లేదు. ఇంక చేసేది లేక ఆ రాక్షసుడు చుర చుర చూస్తూ ఇటు అటు తన్నులు తన్నసాగాడు. అయితే అందులో అతని బలం క్షీణించినట్లు తెలిసిపోతూ ఉంది.

10.1-620-వ.

అంత బలభద్రుండు రౌద్రాకారంబున గర్దభాసురుపదంబులు నాలుగు నొక్క కేల నంటంబట్టి బెట్టుదట్టించి త్రిప్పి విగతజీవు నిం జేసి.

టీక:- అంత = పిమ్మట; బలభద్రుండు = బలరాముడు; రౌద్ర = మిక్కిలి భయంకరమైన; ఆకారంబునన్ = రూపముతో; గర్దభ = గాడిద రూపు; అసురున్ = రాక్షసుని; పదంబులన్ = కాళ్ళు; నాలుగున్ = నాలుగిం టిని (4); ఒక్క = ఒకటే; కేలన్ = చేతి యందు; అంటన్ = చేర్చి; పట్టి = పట్టుకొని; బెట్టు = గట్టిగా; దట్టించి =

అదల్చి; త్రిప్పి = తిప్పి; విగతజీవునిం జేసి = చంపేసి {విగతజీవుని చేయు - విగత (పోయిన) జీవుని (ప్రాణ ములు కలవానిని) అగునట్లు చేయు, సంహరించు};

భావము:- అప్పుడు బలరాముడు రౌద్రాకారం ధరించాడు. ఆ గాడిద రాక్షసుడి నాలుగు కాళ్ళు కలిపి ఒక్క చేత్తో ఒడిసి పట్టుకుని మహావేగంగా గిర గిరా త్రిప్పికొట్టి వాణ్ణి మట్టుపెట్టాడు.

10.1-621-మ.

ఒక తాలాగ్రముఁ దాఁక పైవ నది కంపోద్రిక్తమై త్రుళ్ళి వే
ఱొక తాలాగ్రము పైఁబడ న్నదియు నయ్యుగ్రాహతిన్ నిల్వ కొం
డొక తాలాగ్రము పైఁ బడన్ విఱిగి యిట్లొండొంటిపైఁ దాలవృ
క్షకముల్ గూలెఁ బ్రచండమారుతముదాఁకంగూలు చందంబునన్.

టీక:- ఒక = ఒకానొక; తాల = తాడిచెట్టు; అగ్రమున్ = తలకు, కొనను; తాకున్ = తగిలెడి; అట్లున్ = విధముగ; పైవన్ = విసరివేయగా; అది = అది; కంప = కంపనములు; ఉద్రిక్తము = ఉద్రేకించినది, విజృంభిం చినది; ఐ = అయ్యి; త్రుళ్ళి = తూలిపోయి; వేఱొక = ఇంకొక; తాల = తాడిచెట్టు; అగ్రము = గొప్పదాని; పైన్ = మీద; పడన్ = పడిపోగా; అదియున్ = అదికూడ; ఆ = ఆయొక్క; ఉగ్ర = భయంకరమైన; ఆహతిన్ = దెబ్బవలన; నిల్వక = నిలబడలేక; ఒండొక = మరొక; తాల = తాడిచెట్టు; అగ్రము = శ్రేష్ఠము; పైన్ = మీద; పడన్ = పడిపోగా; విఱిగి = ముక్కలైపోయి; ఇట్లు = ఇలా; ఒడొంటిపైన్ = ఒకదానిమీ దొకటి; తాల = తాడి; వృక్షములు = చెట్లు; కూలెన్ = కూలిపోయినవి; ప్రచండ = మిక్కిలి తీవ్రమైన; మారుతము = గాలి; తాకన్ = తాకిడికి; కూలు = కూలిపోయెడి; చందంబునన్ = ప్రకారముగా.

భావము:- అలా చచ్చిన రాకాశి గాడిదను బలరాముడు ఒక తాటిచెట్టుకేసి విసిరి కొట్టాడు. ఆ వేగానికి ఆ చెట్టు విరిగి మరొక తాటిచెట్టు పై పడింది. ఆ వేగానికి

ఆ చెట్టు మరొక చెట్టు పై పడింది ఇలా ఎన్నో చెట్లు సుడిగాలి దెబ్బకు పడిపోయినట్లు, నేలపై కూలిపడిపోయాయి.

10.1-622-ఉ.

తంతువులందుఁ జేలము విధంబున నే పరమేశు మూర్తి యం
దింతయుఁ బుట్టునట్టి జగదీశుఁ డనంతుఁడు దైత్యమాత్రు ని
ట్లంతము జేయు టెంతపని? యద్భుతమే వినుమంతలోన వాఁ
డంతముఁ బొందు టెల్లఁ గని యాతని బంధులు గార్దభంబులై.

టీక:- తంతువులు = దారముల; అందున్ = నుండి; చేలము = బట్ట, వస్త్రము; విధంబునన్ = వలె; ఏ = ఏ; పరమేశు = భగవంతుని {పరమేశుడు - పరమ (అత్యున్నతమైన) ఈశుడు (సర్వమును నియమించు వాడు), ఆదిశేషుడు}; అందున్ = నుండి; ఇంతయున్ = ఈ సృష్టి సమస్తమును; పుట్టున్ = జనించునో; అట్టి = అటువంటి; జగదీశుడు = ఆదిశేషుడు {జగదీశుడు - శ్రు. యతోవా ఇమాని భూతాని జాయంతే ఏనజాతాని జీవంతి యత్ప్రయంత్యభిసంవిశంతి తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి, లోక స్థితి లయ కారణుడు, ఆదిశేషుడు}; అనంతుడు = ఆదిశేషుడు {అనంతుడు - అంతములేని కాల స్వరూపుడు, ఆదిశేషుడు}; దైత్య = రాక్షసుడు; మాత్రునిన్ = మాత్రమే ఐనవాని; ఇట్లు = ఇలా; అంతము చేయుట = సంహరించుట; ఎంతపని = ఏపాటి దేమిటి, చిన్నది; అద్భుతమే = ఆశ్చర్యకరమైనదా, కాదు; వినుము = వినుము; అంతలోనన్ = ఆ లోపున; వాడు = అతను; అంతము బొందుట = చనిపోయిన రీతిని; ఎల్లన్ = అంతయు; కని = చూసి; ఆతని = అతనియొక్క; బంధులు = చుట్టాలు; గార్దభంబులు = గాడిదలు; ఐ = అయ్యి.

భావము:- దారపు పోగులు మూలపదార్థమై ఉండగా వాటి ఆధారంతో వస్త్రం చేయ చేయబడుతుంది. అలా దారాల యందు వస్త్రం కలదు. అదే విధంగా పరమేశ్వరుని రూపము ఈ జగత్తుకి మూలపదార్థము కాగా ఈ సృష్టి అంతా అతని

యందే కలదు. అటువంటి స్వామి ఒక సామాన్య రాక్షసుడిని చంపగలగడంలో ఆశ్చర్యం ఏముంది. ఆ రాక్షసుడు చనిపోవడం చూసి, అతడి బంధువులు అంతా గాడిద రూపాలలో కృష్ణుడి పైకి, బలరాముడి పైకి వచ్చిపడ్డారు.

10.1-623-క.

బలకృష్ణులపైఁ గవిసిన
బలియుర ఖరదైత్యభటులఁ బశ్చిమపాదం
బుల బట్టి తాల శిఖరం
బుల కెగురఁగ పైచి వారు పొరిగొని రధిపా!

టీక:- బల = బలరాముడు; కృష్ణుల = కృష్ణుల; పైన్ = మీద; కదిసినన్ = కలియబడగా; బలియుర = బలవంతులను; ఖరదైత్య = గార్దభాసురుని; భటులన్ = యోధులను; పశ్చిమ = వెనుక; పాదంబులన్ = కాళ్ళను; పట్టి = పట్టుకొని; తాల = తాడిచెట్ల; శిఖరంబులు = కొనలపైకి, తలలపైకి; ఎగురగ = ఎగురునట్లుగా; పైచి = విసిరేసి; వారు = వారలు; పొరిగొనిరి = చంపివేసిరి; అధిపా = రాజా.

భావము:- ఆ బలరామకృష్ణులు తమ పైకి వచ్చిన ఆ రాకాసి గాడిదలను వెనుక కాళ్ళు పట్టుకుని గిర గిరా త్రిప్పి తాడిచెట్ల తలలపైకి విసిరికొట్టి మట్టుపెట్టారు.

10.1-624-వ.

అప్పుడు.

టీక:- అప్పుడు = ఆ సమయంబున.

భావము:- అప్పుడు. . .

10.1-625-క.

ఆలమున నోలిఁ గూలిన

తాలద్రుమఖండ దైత్యతనుఖండములన్

కేలితమై ధర జలధర

మాలావృతమైన మింటి మాడ్కిన్ వెలిగెన్

టీక:- ఆలమునన్ = యుద్ధమున; ఓలిన్ = వరుసగా; కూలిన = కూలిపోయినట్టి; తాల = తాడి; ద్రుమ = చెట్ల; ఖండ = ముక్కలచేత; దైత్య = రాక్షస; తను = దేహ; ఖండములన్ = ముక్కలచేతను; కేలితము = కలిగినది; ఐ = అయ్యి; ధర = నేల; జలధర = మేఘముల; మాలా = వరుసలచే; ఆవృతము = కమ్ముకొన్నది; ఐన = అయిన; మింటి = ఆకాశము; మాడ్కిన్ = వలె; వెలిగెన్ = ప్రకాశించెను.

భావము:- అలా యుద్ధంలో కూలిపోయిన తాడిచెట్ల ముక్కలూ రాక్షసుల శరీరఖండాలు కలగాపులగంగా భూమిపై పడి ఉండి, ఆ నేల మేఘశకలాలతో ఆవరించబడిన ఆకాశంలా కనిపిం చింది.

10.1-626-క.

ధేనుకవనమున నమలిరి

మానవు లావేళఁ దాఁటి మ్రాకుల ఫలముల్;

ధేనువులు మెసఁగెఁ గసవులు;

ధేనుకహరభక్తకామధేనువు గలుగన్.

టీక:- ధేనుక = ధేనుకాసురునియొక్క; వనమునన్ = తోట యందు; నమలిరి = తినిరి, భుజించిరి; మానవులు = మనుష్యులు; ఆవేళన్ = అప్పటి; దాటి = నుండి; తాటిమ్రాకుల = తాడిచెట్ల; ఫలముల్ = పండ్లను; ధేనువులు = ఆవులు; మెసగెన్ =

మేసెను, తినెను; కసవులున్ = పచ్చికలను; ధేనుక = ధేనుకాసురుని; హర = సంహరించిన; భక్త = భక్తుల యెడ; కామధేనువు = కామధేనువు వంటివాడు; కలుగన్ = ఉండుటచేత.

భావము:- ఎన్నాళ్ల తరువాతో ఆనాడు దేనుకవనంలో గోపకులు ఆ తాడిపండ్లు తనివితీరా తిన్నారు. ఆవులు వనంలోని పచ్చికలు కడుపునిండా మేసాయి. దేనుకాసురుడిని చంపిన స్వామి భక్తుల పాలిట కామదేనువై ఉండగా వారి కోరికలు తీరడం అదెంతపని.

10.1-627-వ.

ఆ సమయంబున సురలు విరులవానలు గురియించి దుందుభులు మొరయించి; రంతఁ గమలలోచనుండు గోపజన జేగేయమాన వర్తనుండై, యన్నయుం దానును గోగణంబులం దోలుకొని మందకు జనియె; న య్యెడ.

టీక:- ఆ = ఆ; సమయంబునన్ = సమయ మందు; సురలు = దేవతలు; విరుల = పూల; వానలు = జల్లులు; కురియించిరి = అధికముగా జల్లిరి; దుందుభులు = భేరిలను; మొరయించిరి = మోగించిరి; అంతన్ = అటు పిమ్మట; కమలలోచనుండు = శ్రీకృష్ణుడు; గోపజన = గొల్లవారిచేత; జేగేయమాన = కీర్తింపబడుచున్న; వర్త నుండు = చరితములు కలవాడు; ఐ = అయ్యి; అన్నయున్ = సోదరుడు; తానునున్ = అతను; గో = పశువుల; గణంబులన్ = సమూహములను; తోలుకొని = మరలించుకొని; మందకున్ = గొల్లపల్లెకు; చనియెన్ = వెళ్ళెను; ఆ = ఆ; ఎడన్ = సమయము నందు.

భావము:- ఆ శుభ సమయంలో దేవతలు పుష్పవర్షం కురిపించి దుందుభులు మ్రోగించారు. అప్పుడు పద్మలోచనుడు కృష్ణుడు బలరాముడూ పశువులను తోలుకుని

గోకులానికి తిరిగి వచ్చారు. గోపకు లందరూ రామకృష్ణుల పరాక్రమాన్ని ప్రస్తుతించారు. ఆ సమయంలో.

10.1-628-ఉ.

గోపదరేణు సంకలిత కుంతలబద్ధ మయూరపింఛు ను

ద్దీపిత మందహాస శుభదృష్టి లసన్ముఖు వన్యపుష్ప మా

లా పరిపూర్ణు గోపజన లాలిత వేణురవాభిరాము నా

గోపకుమారునిం గనిరి గోపసతుల్ నయనోత్సవంబుగన్.

టీక:- గోపదరేణు = గోధూళి {గోపదరేణు - పశువుల కాళ్ళచే రేగిన దుమ్ము, గోధూళి}; సంకలిత = కూడుకొన్న; కుంతల = తలవెండ్రుకలను; బద్ధ = కట్టి ఉంచిన; మయూర = నెమలి; పింఛున్ = పింఛము కలవానిని; ఉద్దీపిత = మిక్కిల ప్రకాశించుచున్న; మందహాస = చిరునవ్వుతో కూడిన; శుభ = శుభకరమైన; దృష్టి = చూపుల చే; లసత్ = ప్రాకాశిస్తున్న; ముఖున్ = మోము కల వానిని; వన్య = అడవి; పుష్ప = పూల; మాలా = మాలలచే; పరిపూర్ణున్ = నిండుగా ఉన్నవానిని; గోప = గొల్ల; జన = వారిచే; లాలిత = కొనియాడబడినట్టి; వేణు = మురళీ; రవ = గానముచేత; అభిరామున్ = మనోజ్ఞముగా ఉన్నవాని; గోప = గొల్ల; కుమారునిన్ = పిల్లవానిని; కనిరి = చూసిరి; గోప = గోపికా; సతుల్ = స్త్రీలు; నయన = కళ్ళకు; ఉత్సవంబు = సంతోషములు; కన్ = కలుగగా.

భావము:- గోకులంలోని గోపికలు కృష్ణుడిని కన్నులపండువగా చూసారు. కృష్ణుడు గోధూళి ఆవరించిన తలవెంట్రుకల పై నెమలిపింఛం ధరించి ఉన్నాడు. వెలుగులు చిమ్ముతున్న చిరునవ్వు లతో శుభాన్ని కలిగించే చూపులతో కూడిన మోముతో ప్రకాశిస్తూ ఉన్నాడు. క్రొత్త పూలమాలికలను ధరించి ఉన్నాడు. గోపకు లందరూ బతిమిలాడితే వేణు నాదం చేస్తూ అందరి మనస్సులకూ ఆనందం కలిగించాడు.

10.1-629-ఆ.

కమలనయను వదనకమల మరందంబు
దవిలి నయన షట్పదముల వలనఁ
ద్రావి దిన వియోగతాపంబు మానిరి
గోపకాంత లెల్లఁ గోర్కు లలర.

టీక:- కమలనయను = కృష్ణుని; వదన = ముఖము అనెడి; కమల = పద్మము యొక్క; మరందంబున్ = మకరందమును; తవిలి = ఆసక్తిగొని; నయన = కళ్ళు అనెడి; షట్పదముల = తుమ్మెదల; వలనన్ = వలన; త్రావి = తాగి; దిన = పగటిపూట కలిగెడి; వియోగ = ఎడబాటు వలని; తాపంబున్ = బాధను; మానిరి = వదలిరి; గోప = గోపికా; కాంతలు = స్త్రీలు; ఎల్ల = అన్ని; కోర్కులు = కోరికలు; అలరన్ = తీరగా.

భావము:- పగలు అంతా కలిగిన వియోగ సంతాపాన్ని ఆ గోకులంలోని గోపకాంతలు శ్రీకృష్ణుని ముఖపద్మం లోని తేనెలను తమ కన్నులు అనే తుమ్మెదలతో కోరిక మీరా త్రాగుతూ, తగ్గించుకున్నారు.

10.1-630-వ.

ఇట్లు గోపికలు సాదరంబుగం జూడ వ్రీడాహాస వినయంబులం జూచుచుం గ్రీడాగరిష్ఠుండైన ప్రోడ గోష్ఠంబుప్రవేశించె; నంత రోహిణీ యశోదలు కుఱ్ఱలవలని మచ్చికలు పిచ్చలింప నిచ్చకువచ్చిన ట్లయ్యైవేళల దీవించిరి; వారును మజ్జనోన్మర్దనాదు లంగీకరించి, సురభి కుసుమ గంధంబులు గైకొని, రుచిర చేలంబులు గట్టికొని, రసోపపన్నంబు లయిన యన్నంబులు గుడిచి, తృప్తు లయి, మంజులశయ్యల సుప్తులై యుండి; రందు.

టీక:- ఇట్లు = ఇలా; గోపికలు = గోపస్త్రీలు; సాదరంబుగన్ = మన్ననతో; చూడన్ = చూచుచుండగా; వ్రీడా = సిగ్గుచేతను; హాస = నవ్వులచేతను; వినయంబులన్ = అణకువలతో; చూచుచున్ = చూస్తూ; క్రీడా = క్రీడించు టందు; గరిష్ఠుండు = గొప్పవాడు; ఐన = అయిన; ప్రోడ = బహు సమర్థుడు; గోష్ఠంబున్ = మంద యందు; ప్రవేశించెన్ = చేరెను; అంతన్ = ఆ తరువాత; రోహిణీ = రోహిణీదేవి; యశోదలు = యశోదాదేవి; కుఱ్ఱల = కుమారుల; వలని = ఎడలి; మచ్చిక = మోహములు; పిచ్చలింపన్ = అతిశయింపగా; ఇచ్చకు వచ్చినట్లు = అత్యధికముగా (ఇష్టం వచ్చినట్టు); అయ్యే = ఆయా; వేళలన్ = సమయము లందు; దీవించిరి = ఆశీర్వదించిరి; వారును = వారుకూడ; మజ్జన = స్నానములు చేయించుట; ఉన్మర్దన = గంధం పూతలు పూయుటలు; ఆదులు = మున్నగు నవి; అంగీకరించి = గ్రహించి; సురభి = మంచివాసన కలిగిన; కుసుమ = పూలు; గంధంబులున్ = గంధములు; కైకొని = స్వీకరించి; రుచిర = పరిశుద్ధమైన; చేలంబులున్ = బట్టలు; కట్టికొని = కట్టుకొని; రస = షడ్రస {షడ్రసములు - 1కషాయము (వగరు) 2మధురము (తీపి) 3లవణము (ఉప్పు) 4కటువు (కారము) 5తిక్తము (చేదు) 6ఆమ్లము (పులుపు)}; ఉపపన్నంబులు =పూర్ణములు; అయిన = ఐన; అన్నంబులు = ఆహారములు; కుడిచి = భుజించి; తృప్తులు = తృప్తిచెందినవారు; అయి = అయ్యి; మంజుల = మృదువైన; శయ్యలన్ = పక్కలమీద; సుప్తులు = నిద్రించినవారు; ఐ = అయ్యి; ఉండిరి = ఉన్నారు; అందున్ = ఆ తరువాత.

భావము:- ఇలా గోపికలు తనను ప్రేమతో చూస్తూ ఉంటే లీలాపాటవమూర్తి కృష్ణమూర్తి వారిని సిగ్గుతోనూ, చిరునవ్వుతోనూ, వినయంతోనూ చూస్తూ గొల్లపల్లె లో ప్రవేశించాడు. అప్పుడు రోహిణి యశోదలు కుమారుల యందలి ప్రేమ పొంగి పొరలగా మనసుతీరా వారిని దీవించారు. బలరామకృష్ణులు నలుగుపెట్టి తలంటు పోయించుకు న్నారు. చక్కని సువాసనలు వెదజల్లే పూవులను గంధాలను అలంకరింప జేసుకు న్నారు. అందమైన దుస్తులు తొడగికొన్నారు. ఎన్నో రుచులతో రసవంతమైన

భోజనం తిన్నారు. తృప్తిగా భుజించిన తరువాత సుఖమైన శయ్యలపై నిద్రపోయారు. అంతట.

విషకలిత కాళింది గనుగొనుట

10.1-631-సీ.

ఒకనాడు బలభద్రుఁ డొక్కఁడు రాకుండ-
గోపాలకులు దానుఁ గూడి కృష్ణుఁ
డడవికిఁ జని యెండ నా గోవులును గోప-
కులు నీరుపట్టునఁ గుంది డస్సి
కాళిందిలో విషకలిత తోయముఁ ద్రావి-
ప్రాణానిలంబులు వాసి పడిన
యోగీశ్వరేశుండు యోగివంద్యుఁడు గృష్ణుఁ-
డీక్షణామృతధార లెలమిఁ గురిసి

10.1-631.1-ఆ.

పసుల గోపకులను బ్రతికించె మరలంగ;
వారుఁ దమకుఁ గృష్ణువలన మరలఁ
బ్రతుకు గలిగెనంచు భావించి సంతుష్ట
మానసములఁ జనిరి మానవేంద్ర!

టీక:- ఒక = ఒకానొక; నాడు = దినమున; బలభద్రుడు = బలరాముడు; ఒక్కడు = మాత్రము; రాకుండన్ = రాకుండగా; గోపాలకులున్ = యాదవులు; తానున్ = అతను; కూడి = కలిసి; కృష్ణుడు = కృష్ణుడు; అడవి = అడవి; కిన్ = కి; చని = వెళ్ళి; ఎండన్ = ఎండలో; ఆ = ఆ; గోవులును = పశువులు; గోపకులున్ =

యాదవులు; నీరుపట్టునన్ = దాహముతో; కుంది = కుంగిపోయి; డస్సి = బడలిక చెంది; కాళింది = యమున; లోన్ = అందు; విష = విషముతో; కలిత = కూడిన; తోయమున్ = నీటిని; త్రావి = తాగి; ప్రాణానిలంబులున్ = ప్రాణవాయువులు; పాసి = పోయి; పడినన్ = పడిపోగా; యోగి = యోగులలో; ఈశ్వర = శ్రేష్ఠులకు; ఈశుండు = ప్రభువు; యోగి = యోగులచే; వంద్యుడు = స్తుతింపబడువాడు; కృష్ణుడు = కృష్ణుడు; ఈక్షణ = చూపులు అనెడి; అమృత = అమృతపు; ధారలు = జల్లులు; ఎలమిన్ = ప్రేమతో; కురిసి = కురిపించి;

పశులన్ = పశువులను; గోపకులనున్ = గొల్లవాండ్రను; బ్రతికించె = జీవింపజేసెను; మరలంగ = తిరిగి; వారున్ = వారుకూడ; తమ = వారల; కున్ = కు; కృష్ణ = కృష్ణుని; వలన = వలన; మరలన్ = మళ్ళీ; బ్రతుకు = జీవితము; కలిగెన్ = కలిగినది; అంచున్ = అని; భావించి = తలచుకొని; సంతుష్ట = సంతోషించిన; మానసములన్ = మనసులతో; చనిరి = వెళ్ళిరి; మానవేంద్రా = రాజా {మానవేంద్రుడు – మానవులకు ప్రభువు, రాజు}.

భావము:- శుకమహర్షి ఇంకా ఇలా చెప్పసాగేడు "ఓ పరీక్షిన్మహారాజా! ఒకరోజు కృష్ణుడు గోపాలకులు తాను కలిసి ఆవులను తోలుకొని అడవికి వెళ్ళాడు. ఆ రోజున మాత్రం బలరాముడు వారితో వెళ్ళలేదు. ఆ వేళ ఎండ తీవ్రతకి గోవులు, గోపాలకులు దాహంతో తపించిపోతు సొమ్మసిల్లి పోసాగారు. వారు కాళింది అనే యమునా నది మడుగులోని విషపూరితమైన నీళ్ళు తాగి ప్రాణవాయువులు కోల్పోయి పడిపోయారు. మహా యోగులకు ప్రభువు, యోగు లందరికి వందనీయుడు అయిన శ్రీకృష్ణుడు తన చూపులనే గొప్ప అమృతం వర్షించి ఆ గోవులను, గోపాలకులను మళ్ళీ బతికించాడు. వారంతా కృష్ణుడు తమకు పునర్జన్మ ప్రసాదించాడని సంతోషించి ఇళ్ళకు వెళ్ళిపోయారు.

10.1-632-క.

కాళియఫణిదూషిత యగు

కాళిందిఁ బవిత్రఁ జేయఁగా నుత్సుకుఁడై

కాళిందీజలవర్ణుఁడు

కాళియు పెడలంగ నడిచెఁ గౌరవముఖ్యా!"

టీక:- కాళియ = కాళియుడు అనెడి; ఫణి = సర్పముచేత; దూషిత = కలుషితము చేయబడినది; అగు = ఐన; కాళిందిన్ = యమునానది లోని కాళింది అనే మడుగును; పవిత్రంబు = పరిశుద్ధమైనదిగా; చేయన్ = చేయుటకొరకు; ఉత్సుకుడు = ఉత్సాహము కలవాడు; ఐ = అయ్యి; కాళిందీజలవర్ణుడు = కృష్ణుడు {కాళిందీ జల వర్ణుడు - కాళిందీ (యమునా నది)యొక్క జల (నీటి) వలె నల్లని వర్ణుడు (రంగు దేహము కలవాడు), కృష్ణుడు}; కాళియున్ = కాళింగుని; పెడలంగనడిచెన్ = పెడలగొట్టెను; కౌరవముఖ్య = పరీక్షి నృపరాజా {కౌరవముఖ్యుడు - కురువంశపు రాజులలో ముఖ్యమైన వాడు, పరీక్షిత్తు}.

భావము:- కురువంశంలో ముఖ్యమైన మహారాజా! పరీక్షిత్తూ! కాళియుడు అనే నాగుడి వల్ల పాడైన కాళింది మడుగును బాగు చేయాలని శ్రీకృష్ణుడు సంకల్పించుకొన్నాడు. కాళిందినదీ జలాల వలె నీల వర్ణ దేహుడైన కృష్ణుడు కాళియ సర్పాన్ని వెళ్ళగొట్టాడు."

విశేషము- గంగానది నీళ్ళు తెల్లగా ఉంటాయి. యమునానది నీళ్ళు నల్లగా ఉంటాయి. ప్రయాగ త్రివేణీసంగమం వద్ద ఆ తేడా స్పష్టంగాతెలుస్తుంది.

10.1-633-వ.

అనిన "న య్యగాధజలంబుల వలన మాధవుం డెట్టి నేర్పున సర్పంబు దర్పంబుమాపి పెడలించె. నందుఁ బెద్దకాలంబా వ్యాళం బేల యుండె? నెఱిగింపుము.

టీక:- అనినన్ = అనగా; ఆ = ఆ; అగాధ = మిక్కలి లోతుగల; జలంబుల = నీటి; వలన = నుండి; మాధవుండు = కృష్ణుడు; ఎట్టి = ఎటువంటి; నేర్పునన్ = నేర్పుచేత; సర్పంబు = ఆ పాముయొక్క; దర్పంబున్ = మదమును; మాపి = పోగొట్టి; పెడలించెన్ = పెడలగొట్టెను; అందున్ = ఆనది యందు; పెద్దకాలంబు = చాలా కాలము నుండి; వ్యాళంబు = పాము; ఏల = ఎందుచేత; ఉండెన్ = ఉన్నది; ఎఱిగింపుము = తెలియ చెప్పుము.

భావము:- అని శుకుడు చెప్పగా పరీక్షిత్తు ఇలా అడిగాడు "ఆ అతి లోతైన మడుగులోని నాగరాజు కాళియుడి గర్వం లక్ష్మీపతి అయిన శ్రీకృష్ణుడు ఎలా అణచాడో. ఎలా పెళ్ల గొట్టాడో? ఆ నేర్పు ఎలాంటిదో? అసలు అన్నాళ్ళు ఆ కాళిందిలో ఆ సర్పరాజు ఎందుకున్నాడో. నాకు తెలియజేయుము.

10.1-634-క. *

తొల్లులఁ గాచిన నందుని

కుల్లని చరితామృతంబు గొనకొని చెవులన్

జుల్లంగఁ దనివి గల్గునె;

పెల్లుల కైనను దలంప? విప్రవరేణ్యా! "

టీక:- తొల్లులన్ = ఆవులను; కాచిన = మేపెడి; నందుని = నందునియొక్క; కుల్లని = కుమారుని; చరిత = చరిత్ర అనెడి; అమృతంబున్ = అమృతమును;

కొనకొని = పూని; చెవులన్ = చెవులతో; జుఱ్ఱంగన్ = ఆసక్తితో పీల్చుకొనగా; తనివి = తృప్తి; కల్గునె = కలుగునా, కలుగదు; వెఱ్ఱుల్ = పిచ్చివాని; కిన్ = కి; ఐనను = అయినప్పటికి; తలంపన్ = తరచి చూసినచో; విప్ర = బ్రాహ్మణ; వరేణ్యా = శ్రేష్ఠుడా.

భావము:- ఓ బ్రాహ్మణోత్తమా! శుకబ్రహ్మ! గోవులను కాచిన నందుని కుమారుని కథలనే సుధారసాన్ని చెవులారా జుఱ్ఱుకుంటు ఆస్వాదిస్తున్న ఎంతటి వెఱ్ఱివాడైనా తృప్తిచెంది ఇంక చాలు అనుకోగలడా? ఊహు అనుకోలేడు."

10.1-635-వ.

అనిన శుకుం డిట్లనియె.

టీక:- అనినన్ = అనగా; శుకుండు = శుకుడు; ఇట్లు = ఇట్లు; అనియె = పలికెను.

భావము:- అని పరీక్షి న్మహారాజనగా, శుకమునీంద్రుడు ఇలా చెప్పసాగాడు.

10.1-636-సీ.

"మానవేశ్వర!యొక్క మడుఁగు కాళిందిలోఁ-
గల; దది యెప్పుడుఁ గాళియాహి
విషవహ్నిశిఖలచే వేఁచు చుండును; మీఁదఁ-
బఱతెంచినంతన పక్షులైనఁ
బడి మ్రగ్గు; నందుఁ దద్భంగశీకరయుక్త-
పవనంబు సోఁకినఁ బ్రాణు లెవ్వి
యైన నప్పుడ చచ్చు; నట్టి యా మడుఁగులో-
నుదకంబు పొంగుచు నుడుకుచుండుఁ

10.1-636.1-తే.

జూచి వెఱఁగంది కుజనుల స్రుక్కఁ జేయ
నవతరించిన బలువీరుఁ డాగ్రహించి
"భుజగవిషవహ్నిదోషంబుఁ బొలియఁ జేసి
సుజలఁ గావించి యీ నదిఁ జూతు" ననుచు.

టీక:- మానవేశ్వరా = రాజా {మానవేశ్వరుడు - మానవులకు ప్రభువు, రాజు}; ఒక్క = ఒకానొక; మడుగు = మడుగు {మడుగు - ఏటిలో లోతైన నిడుపాటి ప్రాంతము, హ్రదము}; కాళింది = యమునానది; లోన్ = అందు; కలదు = ఉన్నది; అది = ఆ మడుగు; ఎప్పుడున్ = ఎల్లప్పుడు; కాళియ = కాళియుడు అనెడి; అహి = పాము యొక్క; విష = విషపు; అగ్ని = అగ్ని; శిఖల = జ్వాలల; చేన్ = చేత; వేచుచుండును = తపించిపోతుండును; మీదన్ = పైన; పఱతెంచి = వెళ్ళిన; అంతనన్ = మాత్రము చేతనే; పక్షులు = పక్షులు; ఐనన్ = అయినను; పడి = పడిపోయి; మ్రగ్గును = చచ్చిపోవును; అందున్ = ఆ మడుగునందు; తత్ = ఆ మడుగుయొక్క; భంగ = అలల వలని; శీకర = తుంపురులతో; యుక్త = కూడినట్టి; పవనంబు = గాలి; సోకినన్ = తగులగానే; ప్రాణులు = జంతువులు; ఎవ్వి = ఏవి; ఐనన్ = అయినను; అప్పుడ = అప్పుడే; చచ్చున్ = చనిపోవును; అట్టి = అటువంటి; ఆ = ఆ; మడుగు = మడుగు; లోన్ = అందలి; ఉదకంబు = నీరు; పొంగుచున్ = ఉబుకుచు; ఉడుకుచున్ = తెర్లుతు; ఉండున్ = ఉండును; చూచి = అది చూసి.

వెఱగంది = ఆశ్చర్యపడి; కుజనులన్ = దుష్టులను; స్రుక్కజేయ = అణచివేయుటకు; అవతరించిన = పుట్టినట్టి; బలువీరుడు = బలమైన శౌర్యము కలవాడు; ఆగ్రహించి = కోపించి; భుజగ = కాళియసర్పముయొక్క; విష = విషపు; వహ్ని = అగ్ని వలని; దోషంబున్ = కల్మషమును; పొలియజేసి = పోగొట్టి; సుజలన్ = మంచినీరు కలది;

కావించి = చేసి; ఆ = ఆయొక్క; నదిన్ = నదిని; చూతున్ = కాపాడెదను; అనుచున్ = అనుచు.

భావము:- "మహారాజా! యమునానదిలో మడుగు ఒకటి ఉంది. కాళియుడనే సర్పరాజు విషజ్వాలలతో అది ఎప్పుడు తుకతుకలాడుతు ఉంటుంది. దాని పై ఎగిరే పక్షులు కూడ ఆ విషపు గాలులు సోకి చచ్చి అందులో పడిపోతాయి. ఆ కాళిందిలోని అలలకి చెలరేగిన నీటితుంపరలు కలిసిన గాలి సోకితే చాలు ఏ జంతువైనా అప్పటికప్పుడు చచ్చి పడిపోవలసిందే. ఆ మడుగులోని జలాలు ఎప్పుడు కుతకుత పొంగుతు ఉడుకుతు ఉంటాయి. ఆ మడుగును చూచి కృష్ణుడు ఆశ్చర్యపోయాడు. దుర్మార్గులను అణచేయడానికి అవతరించిన ఆ మహావీరునికి బాగా కోపం వచ్చింది. ఈ నదిలోని పాము విషాగ్ని దోషం పోగొట్టి, నిర్మల జలాలతో నిండి ఉండే నదిగా చేస్తాను. అని నిశ్చయించుకొన్నాడు.

10.1-637-వ.

కృతనిశ్చయుండై, పూర్వజన్మ భాగ్యంబునం దన చరణ సంస్పర్శనంబు నకు యోగ్యంబై, తత్సమీపంబున విశాల విటపశాఖా కదంబంబుతో నున్న కదంబ భూజంబు నెక్కి.

టీక:- కృతనిశ్చయుండు = నిర్ణయించుకొన్నవాడు; ఐ = అయ్యి; పూర్వజన్మ = పూర్వజన్మలందు చేసిన; భాగ్యంబునన్ = సుకృతములవలన; తన = తనయొక్క; చరణ = పాదముల; సంస్పర్శనంబున్ = చక్కగా సోకుటల; కున్ = కు; యోగ్యంబు = తగినది; ఐ = అయ్యి; తత్ = ఆ మడుగునకు; సమీపంబునన్ = దగ్గరలోని; విశాల = పెద్దదైన; విటప = చిగురించిన రెమ్మలు; శాఖా = పెను కొమ్మలు; కదంబంబున్ = సమూహముల; తోన్ = తోటి; ఉన్న = ఉన్నట్టి; కదంబ = కడిమి; భూజంబున్ = చెట్టును; ఎక్కి = ఎక్కినవాడై.

భావము:- ఆదగ్గరలో ఒక కడిమి చెట్టుంది. అది పూర్వజన్మ భాగ్యం చేత శ్రీకృష్ణుని పాదస్పర్శకు నోచిన చెట్టు. దానికి విశాలమైన కొమ్మలున్నాయి. ఆచెట్టుమీదకు కృతనిశ్చయుడైన కృష్ణుడు ఎక్కాడు.

కాళిందిలో దూకుట

10.1-638-మ. *

కటిచేలంబు బిగించి పింఛమునఁ జక్కం గొప్పు బంధించి దో
స్తట సంస్ఫాలన మాచరించి చరణద్వంద్వంబుఁ గీలించి త
త్కుటశాఖాగ్రము మీఁదనుండి యుఱికెన్ గోపాలసింహంబు ది
క్తటముల్ మ్రోయ హ్రదంబులో గుభగుభ ధ్వానం బనూనంబుగన్.

టీక:- కటి = మొలనున్న; చేలంబున్ = వస్త్రమును; బిగించి = గట్టిగా కట్టి; పింఛమునన్ = నెమలి పింఛముతో; చక్కన్ = చక్కగా; కొప్పున్ = జుట్టుముడిని; బంధించి = కట్టి; దోస్తట = భూజాలు రెంటి పైని; సంస్ఫాలనము = చఱచుట; ఆచరించి = చేసి; చరణ = కాళ్ళు; ద్వంద్వంబున్ = రెంటిని; కీలించి = సంఘటించి, చేర్చి; తత్ = ఆయొక్క; కుట = చెట్టు; శాఖా = కొమ్మ; అగ్రము = కొన; మీద = పై; నుండి = నుండి; ఉఱికెన్ = దుమికెను; గోపాల = గొల్లవాడైన; సింహంబు = అతి పరాక్రమవంతుడు; దిక్తటముల్ = దిగ్భాగములు; మ్రోయన్ = మారుమోగిపోవునట్లు; హ్రదంబు = మడుగు; లోన్ = లోనికి; గుబగుబ = గుబగుబ అనెడి; ధ్వానంబు = శబ్దములు; అనూనంబు = అధికముగ; కన్ = కలుగునట్లు.

భావము:- నడుముకున్న దట్టీగుడ్డని గట్టిగా బిగించి కట్టుకున్నాడు. తలపెంట్రుకల కొప్పు నెమలి పింఛంతో బిగించి కట్టుకున్నాడు. రెండు చేతులతో

భుజాలు చరచాడు. రెండుకాళ్ళు బిగించి సింహపరాక్రమశాలి గోపాలబాలుడు ఆ చెట్టు కొమ్మ మీదనుంచి కాళింది మడుగులోకి కుప్పించి దూకాడు. దూకిన వేగానికి గుభీలు మని పెద్ద శబ్దం వచ్చింది. దిక్కులన్నీ ప్రతిధ్వనించాయి.

10.1-639-ఉ.

భూరి మహాప్రతాప పరిపూర్ణ భయంకర గోపబాల కం

ఠీరవ పాత వేగ వికటీకృత దుర్విషభీషణోర్మి సం

పూరితమై వడిం గలఁగి పొంగి ధనుశ్శతమాత్ర భాగ వి

స్తారము బొందె న మ్మడుఁగు తప్తపయఃకణ బుద్బుదోగ్రమై.

టీక:- భూరి = అతి అధికమైన; మహా = గొప్ప; ప్రతాప = తేజస్సుచే; పరిపూర్ణ = నిండి యున్న; భయంకర = భీకరమైన; గోప = యాదవ; బాల = బాలు డనెడి; కంఠీరవ = సింహము {కంఠీరవము - భీకరమైన కంఠధ్వని కలది, సింహము}; పాత = పడుటయొక్క; వేగ = వడిచేత; వికటీకృత = తుళ్ళింపబడిన; దుః= చెడ్డ; విష = విషముతోటి; భీషణ = భయంకరమైన; ఊర్మి = అలలచేత; సంపూరితము = పూర్తిగా నిండినది; ఐ = అయ్యి; వడిన్ = శీఘ్రముగా; కలగి = చలించి; పొంగి = పైకి ఉబికి; ధనుః = విల్లులు; శత = నూటింటి యంత; మాత్ర = కొలదికల; భాగ = ప్రదేశము; విస్తారమున్ = విస్తరించుటను; పొందెన్ = పొందినది; ఆ = ఆయొక్క; మడుగు = హ్రదము; తప్త = కాచబడిన; పయః = నీటి; కణ = బిందువులు; బుద్బుద = బుడగలతోను; ఉగ్రము = భయంకరమైనది; ఐ = అయ్యి.

భావము:- మిక్కిలి గొప్ప ప్రతాపంతో నిండిన భీకరమైన సింహకిశోరం లాంటి ఆ గొల్లపిల్లాడు గభాలున దూకాడు. ఆ విపరీత వేగానికి ఆ సరస్సు దుర్విషంతో కూడిన భీకరమైన అలలుతో నిండి, వడితో కలచివేయబడింది. నీళ్ళు వికట నృత్యం చేస్తు పొంగిన కుత కుతలాడుతున్న నీటి బుడగలు నూరు ధనుస్సుల మేర భీకరంగా విస్తరించాయి.

10.1-640-శా.

పాఠీనాకృతిఁ దోయరాశినడుమన్ భాసిల్లి మున్నాఢ్యుఁడై
కాఠిన్యక్రియ నీదునేర్పు దనకుం గల్మిన్ భుజంగేంద్ర హృ
త్పీఠాగ్రంబున రోషవహ్ని లెగయన్ భీమంబుగా నీదె ను
ల్లోఠోత్తుంగతరంగమై మడుఁగు దుర్లోక్యంబుగా బాహులన్.

టీక:- పాఠీన = చేప (మత్స్యావతారం); ఆకృతిన్ = రూపముతో; తోయరాశిన్ = సముద్రము {తోయరాశి - తోయము (నీరు) రాశిగా కలది, కడలి}; నడుమన్ = మధ్యలో; భాసిల్లి = ప్రకాశించి; మున్ను = పూర్వము; ఆఢ్యుడు = సుసంపన్నముగా కలవాడు; ఐ = అయ్యి; కాఠిన్య = కఠినమైనట్టి; క్రియన్ = విధముగా; ఈదు = ఈదెడి; నేర్పు = ప్రావీణ్యము; తన = అతని; కున్ = కి; కల్మిన్ = ఉండుటచేత; భుజగ = పాములకు; ఇంద్ర = రాజుయొక్క; హృత్ = హృదయము; పీఠ = మూలముల; అగ్రమునన్ = చివర్లవరకు; రోష = కోపము అనెడి; వహ్నులు = అగ్నులు; ఎగయన్ = వ్యాపించగా; భీమంబుగాన్ = భయంకరముగా; ఈదెన్ = ఈదెను; ఉల్లుఠ = ఉత్+లుఠ, అల్లకల్లోలమైన, మిక్కిలి పొర్లుపెట్టు; ఉత్తుంగ = ఎత్తైన; తరంగము = అలలు కలది; ఐ = అయ్యి; మడుగు = హ్రదము; దుర్లోక్యంబు = చూడ శక్యము కానిది; కాన్ = అగునట్లు; బాహులన్ = చేతులతో.

భావము:- హరికి మత్స్యావతారం ఎత్తినప్పుడు సముద్ర మధ్యలో భీకరంగా విహరిస్తు ఈదడంలో ఇంతకు ముందే అభ్యాసం అయింది కదా. కనుక ఇప్పుడు కృష్ణావతారంలో ఆ మడుగు అల్లకల్లోలమై ఉవ్వెత్తున అలలు లేచేలా తన చేతులతో చూడశక్యంకానంత భయంకరంగా కలచివేస్తు ఈదుతున్నాడు. దానితో మడుగులో ఉన్న కాళియ నాగరాజు గుండెల్లో రోషాగ్ని జ్వాలలు ఎగయసాయి.

10.1-641-వ.

ఆ సమయంబున.

భావము:- అప్పుడు

10.1-642-శా.

"బాలుం డొక్కఁడు వీఁడు నా మడుఁగు విభ్రాంతోచ్ఛలత్కీర్ణ క

ల్లోలంబై కలఁగం జరించె నిట నే లోనుంటఁ జూడండు; మ

త్కీలాభీల విశాల దుస్సహ విషాగ్నిజ్వాలలన్ భస్మమై

కూలం జేసెద నేఁడు లోకులకు నా కోపంబు దీపింపఁగన్."

టీక:- బాలుండు = పిల్లవాడు; ఒక్కడు = ఒకానొకడు; వీడు = ఇతడు; నా = నాయొక్క; మడుగున్ = హ్రదమును; విభ్రాంత = విభ్రాంతికరమైన; ఉచ్ఛలత్ = పైకెగసి; కీర్ణ = చెదిరిన; కల్లోలంబు = గొప్ప అలలు కలది; ఐ = అయ్యి; కలగన్ = చెల్లాచెదురు అగునట్లు; చరించెన్ = మెలగెను; ఇట = ఇక్కడ; నేన్ = నేను; లోన్ = లోపల; ఉంటన్ = ఉండుటను; చూడండు = లెక్కజేయడు; మత్ = నాయొక్క; కీలా = మంటలచేత; అభీల = భయంకరమైన; విశాల = విస్తారమైన; దుస్సహ = సహింపలేని; విష = విషము అనెడి; అగ్ని = అగ్ని; జ్వాలలన్ = మంట లందు; భస్మము = బూడిద; ఐ = అయిపోయి; కూలన్ = పడిపోవునట్లు; చేసెదన్ = చేసెదను; నేడు = ఇవాళ; లోకుల్ = లోకములోని అందరి; కున్ = కి; నా = నాయొక్క; కోపంబు = రోషము; దీపింప = ప్రకాశించినది; కన్ = అగునట్లు.

భావము:- ఆ కాళియుడు ఇలా అనుకున్నాడు "వీడెవడో ఒక కుఱ్ఱాడు నా మడుగును కల్లోలం చేసి కలచివేస్తున్నాడు. ఎగిసి పడుతున్న అలలతో కళ్ళుచెదిరేలా ఈదేస్తూ ఉన్నాడు. లోపల నేను ఉన్నాననేనా చూడటంలేదు. భయంకరమైన

భరింపశక్యంకాని నా విషాగ్నిజ్వాలలతో భస్మంచేసి వీడిని కూల్చేస్తాను. లోకు లందరికి నా కోపం ఎలాంటిదో తెలిసిరావాలి."

10.1-643-వ.

అని తలంచి విజృంభించి.

టీక:- అని = అని; తలంచి = అనుకొని; విజృంభించి = రెచ్చిపోయి.

భావము:- ఇలా అనుకుని కాళియుడు విజృంభించి. . . ..

10.1-644-ఉ.

ఘోరవిషానలప్రభలు గొబ్బునఁ గ్రమ్ముఁగ సర్పసైన్య వి

స్ఫారుఁడు గాళియోరగుఁడు పాఱివడిం గఱచెన్ పయోధరా

కారుఁ బయోవిహారు భయకంప విదూరు మహాగభీరు నా

భీరకుమారు వీరు నవపీత శుభాంబరధారు ధీరునిన్.

టీక:- ఘోర = అతిభయంకరమైన; విష = విషము అనెడి; అనల = అగ్ని; ప్రభలు = కాంతులు; గొబ్బునన్ = శీఘ్రముగా; క్రమ్మగన్ = కమ్ముకొనగా; సర్ప = పాముల; సైన్య = దండు; విస్ఫారుడు = అధికముగా కలవాడు; కాళియ = కాళియుడు అనెడి; ఉరగుడు = సర్పము; పాఱి = పరుగెత్తుకు పెళ్ళి; వడిన్ = వేగముగా; కఱచెన్ = కరచెను; పయోధరాకారున్ = కృష్ణుని {పయోధరాకారుడు - పయోధరము (మేఘముల వలె) నల్లని ఆకారుడు (దేహము కలవాడు), కృష్ణుడు}; పయస్ = నీటి యందు; విహారున్ = ఈదుతున్నవానిని; భయ = భయము; కంప = బెరుకులు; విదూరున్ = లేనివానిని; మహా = గొప్ప; గభీరున్ = గంభీర మైనవానిని; ఆభీర = యాదవ; కుమారున్ = బాలుని; వీరున్ = శూరుడుని; నవ = కొత్త; పీత = పచ్చని; శుభ = మంచి; అంబర = బట్టలు; ధారున్ = ధరించినవానిని; ధీరున్ = ధైర్యశాలిని.

భావము:- తన సైన్యం అంతటితోనూ కృష్ణుడి దగ్గరకు పరుగెట్టుకుని వెళ్ళాడు సర్పరాజు; తన ఘోరమైన విషాగ్ని జ్వాలల కాంతులు గుప్పుమని కమ్ముకుంటు ఉండగా, కృష్ణుడిని పెద్దగా కాటువేసాడు; ఆ బాలుడు నీలమేఘం వలె శ్యామ వర్ణుడు; భయం, బెరుకు ఏ మాత్రం లేనివాడు; మహాగంభీరుడు; మిక్కిలి ధైర్యవంతుడు. గొప్పవీరుడు; బంగారు రంగుగల శుభకరమైన కొత్త పట్టుబట్టలు కట్టుకుని ఉన్నాడు; అటువంటి కృష్ణుడు ఆ కాళింది నీళ్ళలో ఇష్టంవచ్చి నట్లు ఈదుతుండగా కాళియుడు కరిచాడు;

10.1-645-క.

కఱచి పిఱుతివక మఱియును
వెఱవక నిజవదనజనిత విషదహనశిఖల్
మెఱయఁ దన నిడుద యొడలిని
సెఱి హరిఁ బెనగొనియె భుజగనివహపతి వడిన్.

టీక:- కఱచి = కరిచి; పిఱుతివక = వెనుదీయక, జంకక; మఱియును = పిమ్మట; వెఱవక్ = బెదరక; నిజ = తనయొక్క; వదన = ముఖముల నుండి; జనిత = పుట్టిన; విష = విషము అనెడి; దహన = అగ్ని; శిఖల్ = మంటలు; మెఱయన్ = ప్రకాశించుచుండగ; తన = తనయొక్క; నిడుద = పొడుగైన; ఒడలిని = శరీరముతో; సెఱిన్ = పూర్తిగా; హరిన్ = కృష్ణుని; పెనగొనియెన్ = పెనవేసుకొనెను; భుజగ = పాముల; నివహ = సమూహములకు; పతి = రాజు; వడిన్ = వేగముగా.

భావము:- కాటేసిన కాళియ నాగరాజు అంతటితో ఊరుకోలేదు. నదురు బెదురు లేకుండ తన పొడపైన శరీరంతో కృష్ణుడిని అతి వేగంగా పెనవేసుకొని గట్టిగా బంధించాడు. పైకి ఎత్తిపెట్టిన తన పడగల నోళ్ళనుండి విషాగ్నిజ్వాలలు మెరిపిస్తున్నాడు.

10.1-646-వ.

ఇట్లు భోగిభోగ పరివేష్టితుండై, చేష్టలు లేనివాని తెఱంగున(గానం బడుచున్న ప్రాణసఖునిం గనుంగొని తత్ప్రభావంబు లెఱుంగక, తత్సమ ర్పిత ధన దార మనోరథ మానసులు గావున.

టీక:- ఇట్లు = ఇలా; భోగి = పాము; భోగ = శరీరముచేత; పరివేష్టింతుండు = చుట్టబడినవాడు; ఐ = అయ్యి; చేష్టలు = అంగచలనములు; లేని = పోయినట్టి; వాని = వాడి; తెఱంగునన్ = విధముగా; కానంబడుచున్న = అగపడుతున్న; ప్రాణ సఖునిన్ = ప్రాణస్నేహితుని; కనుంగొని = చూసి; తత్ = అతని; ప్రభావంబులు = మహి మత్వములు; ఎఱుంగక = తెలియక; తత్ = అతని యందే; సమర్పిత = అర్పింపబడి నట్టి; ధన = సంపదలు; దార=భార్య; మనోరథ = కోరికలు కల; మానసులు = మనసుకలవారు; కావునన్ = కనుక.

భావము:- ఇలా ఆ నాగేంద్రుడి పొడవాటి శరీరంచేత చుట్టివేయబడి నిశ్చేష్టు డైనట్లు కృష్ణుడు కనబడుతున్నాడు. అలా పడి ఉన్న తమ ప్రాణస్నేహితుడిని చూసి గోపబాలకులు భయపడ్డారు. వారికి అతని ప్రభావాలు తెలియవు. కాని వారు తమ సంపదలు సంసారాలు కోరికలు మనస్సులు సమర్పించిన వారు కనుక.

10.1-647-చ.

"అదె మన కృష్ణునిం గఱచి; యంతట(బోక భుజంగమంబు దు ర్మదమున మేన(జుట్టుకొని మానక యున్నది; యింక నేమి చే యుద? మెట(జొత్త? మే పురుషు లోపుదు రీ యహి నడ్డపెట్ట నె య్యది సదుపాయ?" మంచు(బడి రార్తరవంబుల(దూలి గోపకుల్.

టీక:- అదె = అదిగో; మన = మనయొక్క; కృష్ణునిన్ = కృష్ణుని; కఱచి = కరిచి; అంతటన్ = దానితో; పోక = విడువక; భుజంగమంబు = పాము; దుర్మదమునన్ =

మహా చెడ్డ గర్వముతో; మేనన్ = శరీరమును; చుట్టుకొని = పెనవేసుకొని; మానక = విడువక; ఉన్నది = ఉన్నది; ఇంకన్ = ఇక; ఏమి = ఏమిటి; చేయుదము = చేసెదము; ఎటన్ = ఎక్కడ; ఛొత్తుము = శరణుజొత్తుము; ఏ = ఏ; పురుషులు = ధీరులు; ఓపు దురు = సమర్థులు; అహిన్ = ఈ పామును; అడ్డపెట్టన్ = అడ్డగించుటకు; ఎయ్యది = ఏది; సత్ = మంచి; ఉపాయము; అంచున్ = అనుచు; పడిరి = ఆరంభించిరి; ఆర్తారావంబులున్ = ఏడ్పుటలకు; తూలి = చలించిపోయి; గోపకుల్ = గొల్లలు.

భావము:- ఆ గోపకులు "అదిగో ఆపాము కృష్ణుడిని కాటువేసేసింది; దాంతో వదలిపెట్టకుండ చెడ్డమదంతో శరీరమంతా చుట్టేసింది; వదలిపెట్టటం లేదు; అయ్యో! ఇంకేమి చేయాలి? ఎక్కడికి పరుగులు తీయాలి? ఈ పామును అడ్డుకోనే సామర్థ్యం గల మగధీరులు ఎవరున్నారు? ఈ ఆపద దాటే ఉపాయమే లేదా?" అంటు ఆర్తానాదాలు చేస్తు సోలిపోయారు;

10.1-648-క.

గోపకుమారకశేఖరు

నేపున సర్పంబు గఱచు టీక్షించి వగన్

మేపులకుఁ దొలఁగి గోవులు

వాపోవుచు నుండె వృషభ వత్సంబులతోన్.

టీక:- గోప = గొల్ల; కుమార = పిల్లలలో; శేఖరున్ = శ్రేష్ఠుని; ఏపునన్ = గర్వముతో; సర్పంబున్ = పాము; కఱచుటన్ = కరిచివేయుటను; ఈక్షించి = చూసి; వగన్ = విచారముతో; మేపుల్ = గడ్డిమేయుటల; కున్ = కు; తొలగి = మాని; గోవులు = ఆవులు; వాపోవుచున్ = ఏడ్చుచును; ఉండెన్ = ఉండెను; వృషభ = ఎద్దులు; వత్సంబుల = దూడల; తోన్ = తోటి.

భావము:- అక్కడి ఆవులు, దూడలు, ఎద్దులు గోపబాలకులలో శ్రేష్ఠుడైన ఆ కృష్ణుని నాగరాజు బలంగా కాటువేయటం చూసాయి; అవి అన్నీ విచారంతో మేతమేయడం మానేసి దుఃఖిస్తున్నాయి;

10.1-649-క.

భూతలము వడఁకె నుల్కా

పాతంబులు మింటఁ గానబడె ఘోషములో

ప్రేతలకును గోపక సం

ఘాతములకు నదరె గీడుకన్ను లిలేశా!

టీక:- భూతలము = భూమండలము; వడకెన్ = వణికిపోయినది, కంపించె; ఉల్కా = ఉల్కలు; పాతంబులున్ = పడుటలు; మింటన్ = ఆకాశము నందు; కాన బడెన్ = అగపడెను; ఘోషము = మంద; లోన్ = అందు; ప్రేతల = గోపికల; కును = కు; గోపక = గోపకుల; సంఘాతముల = సమూహముల; కున్ = కి; అదరెన్ = అదిరినవి; కీడు = చెడుసూచించు {కీడుకన్ను - మగవారికి ఎడమకన్ను స్త్రీలకు కుడికన్ను}; కన్నులు = కళ్ళు; ఇలేశా = రాజా {ఇలేశుడు - ఇల (భూమి)కి ఈశుడు, రాజు}.

భావము:- మహారాజా! ఆ సమయంలో, భూమి కంపించింది. ఆకాశంలో ఉల్కలు కనబడ్డాయి. గోకులంలోని గొల్లలకు ఎడం కన్ను, గోపికలకు కుడికన్ను అశుభ సూచకంగా అదిరాయి.

10.1-650-వ.

అంత నా దుర్నిమిత్తంబులు బొడగని బెగడు గదిరిన చిత్తంబుల నుత్తల పడుచు మందనున్న నంద యశోదాదులైన గోపగోపికా జనంబులు హరి దళసరి యెఱుంగక గోపాల గోగణ పరివృతుం డైన కృష్ణుం డెక్కడనైనం జిక్కనోపునని పొక్కుచుం బెక్కువలైన మక్కువలు

చెక్కులొత్త నొక్కపెట్ట బాలవృద్ధసమేతులై మహాఘోషంబున నా ఘోషంబు వెలువడి.

టీక:- అంతన్ = అంతట; ఆ = ఆయొక్క; దుర్నిమిత్తంబులున్ = అపశకునంబులను; పొడగని = కనుగొని, చూసి; బెగడు = భయము; కదిరిన = విజృంభించిన; చిత్తంబులన్ = మనసులతో; ఉత్తలపడుచున్ = కలతపడుతు; మందన్ = వ్రేపల్లెలో; ఉన్న = ఉన్నట్టి; నంద = నందుడు; యశోద = యశోదాదేవి; ఆదులు = మొదలైన వారు; ఐన = అయిన; గోప = గోపకులు; గోపికా = గోపికల; జనంబులు = జన సమూహములు; హరి = కృష్ణుని; దళసరి = ఘనత, సామర్థ్యము; ఎఱుంగక = తెలియక; గోపాల = గొల్లల; గో = ఆవుల; గణ = సమూహములతో; పరివృతుండు = చుట్ట బడినవాడు; ఐన = అయినట్టి; కృష్ణుండు = కృష్ణుడు; ఎక్కడన్ = ఎక్కడను; ఐనన్ = అయినను; చిక్కనోపున్ = చిక్కుబడియుండవచ్చు; అని = అని; పొక్కుచున్ = దుఃఖించుచు; పెక్కువలు = అధికమైనవి, అతిశయించినవి; ఐన = అయిన; మక్కువలు = ప్రేమలు; చెక్కులొత్తన్ = మొలకెత్తగా; ఒక్కపెట్టన్ = ఒక్క గుంపుగా; బాల = బాలురతోను; వృద్ధ = వృద్ధులతోను; సమేతులు = కూడినవారు; ఐ = అయ్యి; మహా = అధికమైన; ఘోషంబునన్ = గోలపెడుతు; ఆ = ఆయొక్క; ఘోషంబున్ = పల్లెనుండి; వెలువడి = బయలుదేరి.

భావము:- యశోద నందుడు మొదలైన గోపికా గోపక జనాలు ఆ దుశ్శకునాలు చూసి బెదిరిన మనసులలో ఆందోళన పడ్డారు. శ్రీకృష్ణుడి మహిమ, శక్తి తెలియక, అతడు ఎక్కడ ఆపదలోపడ్డాడో? అని గోవులు గోపాలకులతో పాటు వారందరు దుఃఖించారు. ప్రేమలు పొంగిపోతుండగా ఒక్కసారి గా వారందరు పిల్లలు ముసలివారితో సహా కేకలు వేసుకుంటు గోకులంనుండి బయల్దేరారు.

10.1-651-క.

వా రిబ్భంగి నెఱుంగని

వారై హరిఁ జూడఁబోవ వడిగొని నగుచున్

వారింపఁ డయ్యె రాముఁడు

వారిని హరి లా వెఱుంగువాఁ డయ్యు నృపా!

టీక:- వారు = ఆ గోపకులు; ఈ = ఈ; భంగిన్ = ప్రకారముగా; ఎఱుంగని = తెలియని; వారు = వారు; ఐ = అయ్యి; హరిన్ = కృష్ణుని; చూడబోవన్ = వెతకుటకు పోవుచుండగ; వడిగొని = మిక్కిలిగా; నగుచున్ = నవ్వుతు; వారింపడు = అడ్డగింపని వాడు; అయ్యెన్ = అయ్యెను; రాముడు = బలరాముడు; వారిని = వారిని; హరి = కృష్ణుని; లావు = శక్తి; ఎఱుంగువాడు = తెలిసినవాడు; అయ్యున్ = అయినప్పటికి; నృపా = రాజా.

భావము:- బలరాముడు కృష్ణుడి శక్తి తెలిసిన వాడు అయినప్పటికి, గోకులంలోని వారందరు అజ్ఞానంతో కృష్ణుడి జాడ కోసం అలా వేగంగా పోతుంటే చూసి కూడా వారిని ఆపలేదు. పైగా నవ్వుతూ చూస్తున్నాడు.

10.1-652-వ.

అంతలోన వారునుం దానును గాంతారమార్గంబు పట్టిపోవుచు నెడ నెడ గోప గోష్పదంబుల సందుల నింతనంత నక్కడక్కడ యవాంకుశ హలకమలకులిశ చక్ర చాప కేతనాది రేఖాలంకృతంబులై మార్గాభర ణంబులయిన హరిచరణం బుల జాడఁ గని ఛొప్పుదప్పక చని దుర్ఘటంబైన యమునా తటంబుఁ జేరి వారి మధ్యంబున నితరుల కసాధ్యం బయిన సర్పంబుచేతఁ గాటుపడి దర్పంబుఁ జూపక భోగి

భోగపరివృతుం డయిన శ్రీకృష్ణునిం గని "కృష్ణ కృష్ణేతి" విలాపం బులఁ దాపంబులం బొందుచు తత్కాలంబునఁ బ్రతికూలం బయ్యె ననుచు దైవంబుఁదిట్టు గోపికలును గోపకులం గలసి మేతలుడిగి తెప్పలిడక కృష్ణునిం దప్పక చూచుచు నొఅలుచున్న గోవులం గని; రందు గోపి కలు యశోదం బట్టుకొని విలపించుచుఁ గృష్ణు నుద్దేశించి యిట్లనిరి.

టీక:- అంతలోన = ఆలోపున; వారునున్ = ఆ గోపకులు; తానును = అతను; కాంతార = అడవి; మార్గంబున్ = దారి; పట్టి = అమ్మట, వెంట; పోవుచున్ = వెళ్తూ; ఎడనెడ = అక్కడక్కడ; గోప = గోపాలుర; గో = ఆవుల; పాదంబులన్ = అడుగు జాడలను, పాదముద్రలను; సందులన్ = మధ్యలో; ఇంతనంతన్ = ఇంతింత; అక్కడక్కడ = అక్కడక్కడ; యవ = గోధుమగింజ; అంకుశ = అంకుశపు; హల = నాగలి; కమల = పద్మము; కులిశ = వజ్రము; చక్ర = చక్రము; చాప = విల్లు; కేతన = ధ్వజము; ఆది = మొదలైన; రేఖా = గుర్తులు గల రేఖలచే; అలంకృతంబులు = అలంకరింపబడినవి; ఐ = అయ్యి; మార్గ = మార్గమునకు; ఆభరణంబులు = భూషణములు; అయిన = ఐనట్టి; హరి = కృష్ణుని; చరణంబుల = పాదముద్రల; జాడన్ = పోబడి గుర్తులు; కని = కనుగొని; ఛొప్పు = జాడ; తప్పక = విడువక; చని = వెళ్ళి; దుర్ఘటంబు = చేరరానిది; ఐన = అయిన; యమునా = యమునానదీ; తటంబున్ = గట్టును; చేరి = చేరి; వారి = నీటి; మధ్యన = నడుమ; ఇతరుల = మామూలువారి; కిన్ = కి; అసాధ్యంబు = సాధింప శక్యము కానిది; అయిన = ఐనట్టి; సర్పంబున్ = పాము; చేతన్ = చేత; కాటుపడి = కాటువేయబడి; దర్పంబున్ = పరాక్రమము; చూపక = చూపించకుండ; భోగి = పాము; భోగ = శరీరముచేత; పరివృతుండు = పెనవేసుకోబడిన వాడు; అయిన = ఐనట్టి; శ్రీకృష్ణుని = శ్రీకృష్ణుని; కని = చూసి; కృష్ణా = కృష్ణా; కృష్ణా = కృష్ణా; ఇతి = అని; విలాపంబులన్ = ఏడ్పుటలను; తాపంబులన్ = తపించుటలను; పొందుచు = పొందుతు; తత్ = ఆ; కాలంబునన్ =

సమయము; ప్రతికూలంబు = వ్యతిరేకము చేయువాడు; అయ్యెను = అయ్యెను; అనుచున్ = అనుచు; దైవంబున్ = భగవంతుడిని; తిట్టు = తిడుతున్నట్టి; గోపికలను = గొల్లస్త్రీలు; గోపకులన్ = గొల్లలు; కలిసి = తోపాటు; మేతలు = గడ్డితినుటలు; ఉడిగి = మానివేసి; ఱెప్పలిడక = కనురెప్పలువాల్చకుండ; కృష్ణునిన్ = కృష్ణుని; తప్పక = దృష్టితప్పక; చూచుచున్ = చూస్తు; ఒఱలుచున్న = విలపించుచున్న; గోవులన్ = ఆవులను; కనిరి = చూసిరి; అందు = అప్పుడు; గోపికలు = గొల్లస్త్రీలు; యశోదన్ = యశోదను; పట్టుకొని = కౌగలించుకొని; విలపించుచున్ = ఏడ్చుచు; కృష్ణున్ = కృష్ణుని; ఉద్దేశించి = గూర్చి; ఇట్లు = ఇలా; అనిరి = పలికిరి.

భావము:- బలరాముడు కూడ వారితో పాటు అడవిలో ప్రవేశించి కృష్ణుడి జాడ వెదుక సాగాడు. గోపబాలుర, గోవుల అడుగు జాడలు మధ్యలో అక్కడక్కడ కృష్ణుని అడుగుజాడలు కనబడసాగాయి. కృష్ణుడి అడుగు జాడలలో యవరేఖ, అంకుశరేఖ, హలరేఖ, వజ్ర రేఖ, చక్రరేఖ, చాపరేఖ, ధ్వజరేఖ మున్నగు శుభలక్షణాల రేఖలన్నీ కనిపిస్తు ఆ దారికే ఆభరణాలై ప్రకాశించసాగాయి. వారంతా చివరికి, చేరటానికి దుష్కరమైన యమునానది మడుగు వద్దకు చేరారు. నీటి మధ్యలో ఎవరికి జయించ సాధ్యంకాని మహాసర్పంచేత కాటువేయబడి దాని శరీరంచేత చుట్టివేయ బడిన కృష్ణుడిని చూసారు. అతడు శక్తి కోల్పోయిన వాడిలా సొమ్మసిలి పడి ఉన్నాడు. అది చూసి “కృష్ణా! కృష్ణా!” అంటు విలపిస్తు వారంతా దుఃఖంతో తపించసాగారు. "ఇన్నాళ్ళు దయ చూపిన దైవం ఈరోజు ప్రతికూలమైందా ఏమిటి?"అని గోపకులు దుర్విధిని తిట్టసాగారు. వారితో పాటు గోవులు లేగలుతో సహా మేతలు మేయడం మానేసి రెప్పలార్పకుండ కృష్ణుణ్ణే చూస్తూ కన్నీళ్ళు కారుస్తున్నాయి. వారిలో కొందరు గోపికలు యశోదాదేవితో ఇలా అన్నారు.

గోపికలు విలపించుట

10.1-653-సీ.

"ఎదురువచ్చినఁ జాల సెదురుగాఁ జనుదెంతు-
    పెదురు వచ్చిన నే డదేల రావు?
చూచినఁ గృపతోడఁ జూచు చుందువు నీవు-
    చూచినఁ గనువిచ్చి చూడ వేల?
డాసిన నఱలేక డాయంగ వత్తువు-
    డాసిన నేటికి డాయ విచటఁ?
జీరిన "నో!"యని చెలరేగి పలుకుదు-
    విది యేమి చీరిన నెలుఁగకుంట?

10.1-653.1-ఆ.

తలఁపుఁ జేయునంతఁ దలపోయుచుందువు
తలఁపుఁ జేయ నేడు దలఁప వకట;"
యనుచు భక్తివివశు లాడెడి కైవడి
ప్రేత లెల్ల నాడి వివశ లైరి.

టీక:- ఎదురువచ్చినన్ = ఎదురైతే; చాలన్ = మిక్కిలిగా; ఎదురుగా = ముందుకు; చనుదెంతు = వచ్చెదవు; ఎదురు = ఎదురుగా; వచ్చినన్ = వచ్చినప్పటికి; నేడు = ఇవాళ; అది = అదే; ఏల = ఎందుకు; రావు = రావటం లేదు; చూచినన్ = నిన్ను చూసినచో; కృప = దయాదృష్టి; తోడన్ = తోటి; చూచుచుందువు = చూసెదవు; నీవు = నీవు; చూచినన్ = ఎంతచూసినను; కను = కళ్ళు; విచ్చి = విప్పి; చూడవు = నీవు చూచుటలేదు; ఏల = ఎందుకు; డాసినన్ = నిన్నుచేరినచో; అఱలేక = అరమరిక

లేకుండ; డాయంగన్ = చేరుటకు; వత్తువు = వచ్చెదవు; డాసినన్ = మేమువచ్చిచేరినను; ఏటికిన్ = ఎందుకు; డాయవు = దగ్గరకురావు; ఇచటన్ = ఇక్కడ; చీరినన్ = పిలిచినచో; ఓ = ఓహో; అని = అని; చెలరేగి = విజృంభించి; పలుకుదువు = సమాధానమిచ్చెదవు; ఇది = ఇది; ఏమి = ఏమిటి; చీరినన్ = పిలిచినను; ఎఱుగకుంటన్ = తెలియకుండుట.

తలపుచేయున్ = తలచిన; అంత = అంతమాత్రముచేతనే; తలపోయుచున్ = పట్టించుకొనుచు; ఉందువు = ఉండెదవు; తలపుచేయన్ = తలచుకొంటున్నను; నేడు = ఇవాళ; తలపవు = పట్టించుకొనవు; అకట = అయ్యో; అనుచున్ = అనుచు; భక్తి = భక్తిచేత; వివశులు = పరవశులైనవారు; ఆడెడి = పలికెడి; కైవడిన్ = ప్రకారముగా; వ్రేతలు = గోపికలు; ఎల్లన్ = అందరు; ఆడి = పలికి; వివశలు = పరవశత్వం పొందిన వారు; ఐరి = అయితిరి.

భావము:- "కృష్ణా! మేము ఎదురుగా వస్తే, ఎప్పుడు నీవు మాకు ఎదురుగా వచ్చేవాడివి. ఇవేళ మేము వచ్చినా నీవు రావేమి? మేము చూస్తే దయతో నీవు మమ్మల్ని చూసేవాడివి. ఇవేళ మేం చూసినా నీవు కళ్ళువిప్పి చూడవేమి? మేము నీ దగ్గరకు వస్తే నీవు మా దగ్గరకు వచ్చేవాడివి. మేం దగ్గరకి వచ్చినా నీవు ఇక్కడకి రావటంలేదేమి మేము "కృష్ణా!" అని పిలిస్తే "ఓ!" అని ఉత్సాహంగా పలికేవాడివి. ఇవేళ గొంతెత్తి పిలిచిన తెలియకుండా ఉన్నావేమి? మేము నిన్ను స్మరిస్తే చాలు మమ్మల్ని స్మరించే వాడివి. ఇవేళ మేము స్మరిస్తున్నా మమ్మల్ని తలవట్లేదేమి?" అంటు భక్తితో పరవశులైనవారి వలె పలుకుతు గోపికలు అందరు వివశులు అయ్యారు.

10.1-654-వ.

ఆ సమయంబున నంద యశోదాదులు హరిం జూచి యధికం బైన శోకంబున నిట్లనిరి.

టీక:- ఆ = ఆ; సమయంబునన్ = సమయమునందు; నంద = నందుడు; యశోద = యశోద; ఆదులు = మొదలగువారు; హరిన్ = కృష్ణుని; చూచి = చూసి; అధికంబు = పెరిగిపోయినది; ఐన = అయినట్టి; శోకంబునన్ = దుఃఖముతో; ఇట్లు = ఇలా; అనిరి = పలికిరి.

భావము:- అప్పుడు నందుడు యశోద మొదలైనవారు కృష్ణుడిని చూసి చాలా ఎక్కువ దుఃఖంతో ఇలా అన్నారు.

10.1-655-క. *

"విషకుచయుగ యగు రక్కసి

విషకుచదుగ్ధంబుఁ ద్రావి విషవిజయుఁడ వై

విషరుహలోచన! యద్భుత

విషయుండగు నీకు సర్వవిష మెక్కెఁ గదా!

టీక:- విష = విషము గల, దుష్టమైన; కుచ = చన్నుల; యుగ = జంట గలామె; అగు = ఐనట్టి; రక్కసి = రాక్షసి; విష = విషపూరిత; కుచ = చను; దుగ్ధంబున్ = పాలను; త్రావి = తాగి; విష = విషప్రభావముపై; విజయుడవు = జయించినవాడవు; ఐ = అయ్యి; విషరుహలోచన = కృష్ణా {విషరుహలోచనుడు - విషరుహ (నీటపుట్టు పద్మము)ల వంటి కన్నులు కలవాడు, కృష్ణుడు}; అద్భుత = ఆశ్చర్యకరమైన; విషయుండు = వృత్తాంతము కలవాడవు; అగు = ఐన; నీ = నీ; కున్ = కు; సర్వ = పాముయొక్క; విషము = విషము; ఎక్కెను = వంటికి పట్టినది; కదా = కదా.

భావము:- "ఓ కన్నయ్యా! విషపూరితమైన, దుష్టమైన స్తనాలతో వచ్చిన ఆ రాక్షసి పూతన విషపు స్తన్యం తాగి ఆ విషాన్ని జయించిన వాడవు నువ్వు; విషము (నీటి) యందు పుట్టు పద్మాలలాంటి కన్నులు కలవాడవు, అద్భుతమైన మూర్తిమంతు

డవు. కమలాక్షా! అట్టి నీకు పాము విషం ఎక్కిందా? ఇదేంటయ్యా ఇంతకన్నా ఆశ్చర్యం ఏముంటుంది?

విషము అంటే దుష్టము అని అర్థం (సూర్యారాయాంధ్ర) కూడా ఉన్నది. అలా పూతన, కాళీయుల దుష్టత్వాన్ని స్ఫురింపజేస్తూ, యమకానుప్రాసతో అలంకారిస్తూ, “ష”కార దుర్గమప్రాసతో చెప్పిన పోతన పాటించిన సందర్భ శుద్ధితో సహా బహు రమ్యంగా ఉంది.

10.1-656-క.

కట్టా! క్రూర భుజంగము

గట్టలుకన్ నిన్నుఁ గఱవఁ గంపించితివో?

తిట్టితివో పాపపు విధిఁ?

బట్టీ! మముఁ దలఁచి కాఁక పలవించితివో?

టీక:- కట్టా = అయ్యో; క్రూర = క్రూరమైన; భుజంగము = పాము; కట్ట = గట్టి; అలుకన్ = కోపముతో; నిన్నున్ = నిన్ను; కఱవన్ = కరచుటచేత; కంపించితివో = వణికిపోతివేమో; తిట్టితివో = తిట్టనావేమో; పాపపు = పాపిష్టి; విధిన్ = దైవమును; పట్టీ = అబ్బాయీ; మమున్ = మమ్ము; తలచి = తలచుకొని; కాకన్ = పరితాపముతో; పలవించితివో = విలపించితివో.

భావము:- అయ్యయ్యో! క్రూరమైన ఆ పాము కోపంతో నిన్ను కాటువేస్తుంటే భయంతో ఎంత వణికిపోయావో? ఆ పాపిష్ఠి విధిని ఎంతగా తిట్టుకొన్నావో? మమ్ముల్ని తలచుకొని బాధతో ఎంతగా పలవరించావో కదా!

10.1-657-క.

పన్నగము మమ్ముఁ గఱవక
నిన్నేటికిఁ గఱచెఁ గుఱ్ఱ! సేమ్మి గలిగి నీ
వున్నను మము రక్షింతువు;
నిన్నున్ రక్షింప నేము నేరము తండ్రీ!

టీక:- పన్నగము = పాము; మమ్మున్ = మమ్ములను; కఱవక = కరవకుండ; నిన్నున్ = నిన్ను; ఏటికిన్ = ఎందుకు; కఱచెన్ = కరిచినది; కుఱ్ఱ = పిల్లవాడ; సెమ్మి = క్షేమము; కలిగి = ఉన్నవాడవు; నీవు = నీవు; ఉన్నను = ఉంటే చాలు; మమున్ = మమ్ములను; రక్షింతువు = కాపాడెదవు; నిన్నున్ = నిన్ను; రక్షింపన్ = కాపాడుటకు; ఏము = మేము; నేరము = శక్తులము కాము; తండ్రీ = అయ్యా.

భావము:- ఓ కన్నతండ్రీ! ఈ పాపిష్ఠి పాము మమ్మల్ని కరవకుండ నిన్నెందుకు కరచిందయ్యా? నువ్వు క్షేమంగా ఉంటే మమ్మల్ని రక్షిస్తావు. కాని నువ్వు ఆపదలో ఉంటే మేము నిన్ను రక్షించగల వారము కాదు కదయ్యా!

10.1-658-ఉ.

చూడ వదేమి గౌరవపుఁజూపుల మమ్ము; సఖాలితోడ మా
టాడ వదేమి? మర్మముగ నందెలు పాదములందు మ్రోయ నే
డాడ వదేమి నర్తనము? లవ్వల మ్రోలను గోపికావళిం
గూడ వదేమి నవ్వులను? గోపకుమారవరేణ్య! చెప్పుమా;

టీక:- చూడవు = చూడవు; ఏమి = ఎందుకు; గౌరవపు = గౌరవముతో కూడిన; చూపులన్ = చూపులతో; మమ్మున్ = మమ్ములను; సఖ = స్నేహితుల; ఆలి = సమూహము; తోడన్ = తోటి; మాటాడవు = మాట్లాడుటలేదు; ఏమి = ఎందుకు; మర్మముగన్ = కొంటెగా; అందెలు = కాలిగజ్జెలు; పాదముల = కాళ్ళ; అందున్ =

అందు; మ్రోయన్ = మోగుతుండగ; నేడు = ఇవాళ; ఆడవు = ఆడుట లేదు; ఏమి = ఎందులకు; నర్తనముల్ = నాట్యములు; అవ్వల = తల్లుల; మ్రోలను = ఎదురుగా; గోపికా = గోపికా స్త్రీల; అవళిన్ = సమూహములను; కూడవు = కలియవు; అది = అదే; ఏమి = ఎందుకు; నవ్వులను = నవ్వులతో; గోప = గొల్ల; కుమార = పిల్లలలో; వరేణ్య = శ్రేష్ఠుడా; చెప్పుమా = చెప్పుము.

భావము:- మన గోకులంలోని బాలలందరిలోకి నీవే శ్రేష్ఠుడవు కదా. ఈరోజు తల్లిదండ్రులను మమ్మల్ని గౌరవంతో కూడిన చూపులతో చూడవేంటయ్యా? మిత్రులతో మాట్లాడవేంటయ్యా? అందగా కాళ్ళ గజ్జలు మోగేలా నాట్యాలు చేయవేమయ్యా? తల్లుల ఎదుట గోపికలతో హాస్యాలాడ వేమయ్యా? చెప్పవయ్యా!

10.1-659-సీ.

శ్రవణరంధ్రంబులు సఫలతఁ బొందంగ-
  నెలమి భాషించు వా రెవ్వ రింకఁ?
గరచరణాదుల కలిమి ధన్యత నొంద-
  నెగిరి పైఁ బ్రాఁకు వా రెవ్వ రింక?
నయనయుగ్మంబు లున్నతిఁ గృతార్థములుగా-
  నవ్వులు చూపు వా రెవ్వ రింక?
జిహ్వలు గౌరవశ్రీఁ జేరఁ బాటల-
  యెడఁ బలికించు వా రెవ్వ రింక

10.1-659.1-ఆ.

తండ్రి! నీవు సర్పదష్టుండవై యున్న
నిచట మాకుఁ బ్రభువు లెవ్వ రింక?
మరిగి పాయ లేము; మాకు నీ తోడిద
లోక మీవు లేని లోక మేల?"

టీక:- శ్రవణ = చెవి; రంధ్రంబులున్ = కన్నములు; సఫలతన్ = ధన్యము; పొందంగన్ = పొందునట్లు; ఎలమిన్ = ప్రీతితో; భాషించు = మాట్లాడెడి; వారు = వాళ్ళు; ఎవ్వరు = ఎవరు; ఇకన్ = ఇకపైన; కర = చేతులు; చరణ = కాళ్ళు; ఆదులన్ = మొదలగునవి; కలిమిన్ = కలుగుటచేత; ధన్యతన్ = కృతార్థత్వము; ఒందన్ = పొందగా; ఎగిరి = మీదికి దూకి; పైన్ = మామీదకు; ప్రాకు = పాకెడి; వారు = వారు; ఎవ్వరు = ఎవరు; ఇంక = ఇకమీద; నయన = కళ్ళ; యుగ్మంబులు = జంటలు; ఉన్నతిన్ = అతిశయముతో; కృతార్థములుగా = ధన్యమగునట్లు; నవ్వులు = నవ్వులను; చూపు = కనపరచువారు; వారు = వారు; ఎవ్వరు = ఎవరు; ఇంక = ఇకమీద; జిహ్వలు = నాలుకలు; గౌరవ = మన్నల; శ్రీన్ = సంపదలను; చేరన్ = చేరునట్లుగా; పాటల = పాటల; ఎడల = అందు; పఠికించు = చూపెడివారు; వారు = వారలు; ఎవ్వరు = ఎవరు; ఇంకన్ = ఇకపైన.

తండ్రి = నాయనా; నీవు = నీవు; సర్ప = పాముచే; దష్టుండవు = కాటువేయబడిన వాడవు; ఐ = అయ్యి; ఉన్నన్ = ఉండగా; ఇచటన్ = ఇక్కడ; మా = మా; కున్ = కు; ప్రభువులు = విభులు; ఎవ్వరు = ఎవరు; ఇంకన్ = ఇకపైన; మఠిగి = మాలిమిగలవార మై; పాయలేము = ఎడబాయలేము; మా = మా; కున్ = కు; నీ = నీ; తోడిద = తో మాత్రమే; లోకము = లోకము; ఈవు = నీవు; లేని = లేనట్టి; లోకము = ప్రపంచము; ఏల = ఎందుకు.

భావము:- చిన్ని నా తండ్రీ! మా చెవులున్నందుకు సార్థకమయ్యేలా ఉత్సాహంగా ఇంక మాతో ఎవరు మాట్లాడతారు? కాళ్ళు చేతులు ఉన్నందుకు సార్థక మయ్యేలా మా మీదకి దూకి ఇంకెవరు ఎగబాకుతారు? మా కళ్ళు సార్థక మయ్యేలా ఇంక ఎవరు చిరునవ్వులు చిలుకుతారు? మా నాలుకలు కృతార్థత పొందేలా ఇంక మాచేత పాటలు ఎవరు పాడిస్తారు? నాయనా! నువ్విలా పాముకాటు పాల పడిపోతే, ఇక్కడ మమ్మల్ని కాపాడేవారు ఎవరు ఉన్నారు? నీ ప్రేమ రుచి మరిగిన వాళ్ళం. నిన్ను విడిచి వెళ్ళి పోలేము. మాకు నీతోడిదే లోకం. నువ్వు లేని ఈ లోకం మా కెందుకు?"

10.1-660-వ.

అని యొండొరులం బట్టుకొని విలపించుచుఁ "గృష్ణునితోడన మడుఁగుఁ జొత్తము చత్త" మనుచుఁ గృష్ణవిరహ వేదనానల భార తప్తులై మడుఁగు ఛొరఁబాఱుచున్న వారలం గనుంగొని భగవంతుం డైన బలభద్రుండు "మీరు మీఁ దెఱుఁగరు; ధైర్యంబు విడుచుట కార్యంబు గాదు సహించి చూడుం" డనుచు వారిని వారించె.

టీక:- అని = అని; ఒండొరులన్ = ఒకరినొకరు; పట్టుకొని = పట్టుకొని; విలపించుచున్ = దుఃఖించుచు; కృష్ణుని = కృష్ణుని; తోడన = తోబాటే; మడుగున్ = మడుగు నందు; ఛొత్తము = పడెదము; చత్తము = చనిపోయెదము; అనుచున్ = అనుచు; కృష్ణ = కృష్ణుని; విరహ = ఎడబాటు వలని; వేదన = బాధ అనెడి; అనల = అగ్నిచే; భార = బరువెక్కిన మనసులతో; తప్తులు = తపించెడి వారు; ఐ = అయ్యి; మడుగున్ = మడుగు నందు; ఛొరన్ = పడుటకు; పాఱుచున్న = పరుగెడుతున్న; వారలన్ = వారిని; కనుంగొని = చూసి; భగవంతుండు = భగవత్స్వరూపుడు; ఐన = అయినట్టి; బలభద్రుండు = బలరాముడు; మీరు = మీరు; మీదన్ = భవిష్యత్తులో జరుగ నున్నది; ఎఱుగరు = తెలియరు; ధైర్యంబున్ = స్థైర్యమును; విడుచుట = వదలుట; కార్యంబు = తగినపని; కాదు = కాదు; సహించి = ఓర్పువహించి; చూడుండు = జరుగబోవునది చూడండి; అనుచున్ = అనుచు; వారిని = గోపజనులను; వారించెన్ = ఆపెను.

భావము:- ఇలా విలపిస్తు ఒకళ్ళనొకళ్ళు పట్టుకొని ఏడుస్తున్నారు; "కృష్ణుడి తోపాటు మనం కూడ ఈ మడుగులో పడి చచ్చిపోదాం" అంటు కృష్ణ విరహాగ్ని భరించలేక తపించిపోతూ మడుగులో పడబోతున్నారు; వారిని చూసి మహిమాన్వితు డైన బలరాముడు "మీరు ముందు జరగబోయేది తెలుసుకోలేకుండా ఉన్నారు; ధైర్యం

వదలి పెట్టడం సరైన పని కాదు; ఓర్పుపట్టి ఏం జరుగు తుందో చూస్తు ఉండండి;” అని చెప్పి వారిని ఆపాడు.

10.1-661-క.

తనుఁ గూర్చి యివ్విధంబున

వనితలు బిడ్డలును దారు వాపోయెడి ఘో

షనివాసులఁ గని కృష్ణుఁడు

మనుజుని క్రియ నొక ముహూర్తమాత్రము జరపెన్.

టీక:- తన్నున్ = అతనిని; కూర్చి = గురించి; ఈ = ఈ; విధంబునన్ = రీతిని; వనితలు = స్త్రీలు; బిడ్డలును = పిల్లలు; తారు = వారు; వాపోయెడి = ఏడ్చుచున్న; ఘోష = పల్లె; నివాసులన్ = ప్రజలను; కని = చూసి; కృష్ణుడు = కృష్ణుడు; మనుజుని = మానవుని; క్రియన్ = వలె; ఒక = ఒకేఒక్క; ముహూర్త = ముహూర్తము కాలము; మాత్రము = మాత్రమే; జరపెన్ = గడిపెను.

భావము:- ఇలా తన గురించి పెళ్ళాం పిల్లలుతో పాటు తాము కూడా విలపిస్తున్న గోకులంలో నివసించే వాళ్ళందరిని చూసాడు. సామాన్య మానవుడు లాగ కొంచెంసేపు మౌనం వహించి ఊరకున్నాడు.

కాళియ మర్దనము

10.1-662-శా.

అంతం గృష్ణుఁడు మేను పెంప భుజగుం **డా**వృత్తులం బాసి తా
సంతప్తాయతభోగుఁ డై కలఁచుటల్ **చా**లించి నిట్టూర్పుతో
శ్రాంతుండై తల లెత్తి దుర్విషము నా**సా**వీథులం గ్రమ్మ దు
శ్చింతన్ దిక్కులు చూచుచుం దలఁగి ని**ల్చెన్** ధూమకాష్ఠాకృతిన్.

టీక:- అంతన్ = ఆ తరువాత; కృష్ణుండు = కృష్ణుడు; మేను = శరీరమును; పెంపన్ = పెంచగా; భుజగుండు = ఆ కాళియ సర్పము; ఆవృత్తులను = తన చుట్లను; పాసి = విడిచి; తాన్ = తను; సంతప్త = సంతాపము పొందిన; ఆయత = నిడుపాటి; భోగుడు = దేహము కలవాడు; ఐ = అయ్యి; కలచుటలు = కరచుట; చాలించి = ఆపి; నిట్టూర్పు = దీర్ఘశ్వాసల; తో = తో; శ్రాంతుడు = బడలినవాడు; ఐ = అయ్యి; తలలు = పడగలను; ఎత్తి = పైకెత్తి; దుర్ = చెడ్డ; విషమున్ = విషమును; నాసా = ముక్కురంధ్రముల; వీథులన్ = దారిని; క్రమ్మన్ = కమ్ముకొనగ; దుశ్చింతన్ = చెడు ఆలోచనలతో; దిక్కులున్ = ఇటునటు; చూచుచున్ = చూస్తు; తలగి = తొలగి; నిల్చెన్ = నిలబడెను; ధూమ = పొగతోటి; కాష్ఠ = కొఱవికట్టె; ఆకృతిన్ = లాగ.

భావము:- అప్పుడు కృష్ణుడు చటుక్కున తన శరీరాన్ని బాగా పెంచాడు. కాళీయుడి చుట్టలు జారిపోయాయి. అతని పడగలు వేడెక్కిపోయాయి దేహం కమిలిపోయింది. కరవడం మానేసాడు. పొగచూరిన కట్టెలా తేజస్సుకోల్పోయిన నాగరాజు నిట్టూర్పులు వదుల్తూ బాగా కష్టపడి పడగలు పైకెత్తాడు. విషాన్ని విరజిమ్మే చెడ్డ ఉద్దేశంతో అటునిటు చూస్తు పక్కకి తొలగి నిల్చున్నాడు.

10.1-663-చ.

పెఱ మఱలేని మేటి బలువీరుఁడు కృష్ణకుమారుఁ డొక్క చేఁ

జఱచి ఖగేంద్రుచందమునఁ జక్కన దౌడలు పట్టి కన్నులం

జొాఱజొాఱ దుర్విషానలము జొాబ్బిలు చుండఁగ నెత్తి లీలతోఁ

జిఱజిఱఁ ద్రిప్పి పైచెఁ బరిశేషిత దర్పముఁ గ్రూరసర్పమున్.

టీక:- పెఱ = బెదురు; మఱ = మఱపు, విస్మయము; లేని = లేనట్టి; మేటి = గొప్పవాడు; బలువీరుడు = మహాశూరుడు; కృష్ణకుమారుడు = బాలకృష్ణుడు; ఒక్క = ఒకేఒక్క; చేన్ = చేతితో; చఱచి = కొట్టి; ఖగేంద్రు = గరుత్మంతుని; చందమునన్ = వలె; చక్కన = చక్కగా; దౌడలు = రెండుదౌడలను; పట్టి = పట్టికొని; కన్నులన్ = కళ్ళమ్మట; జొాఱజొాఱ = జొాఱజొాఱ మిణుగురులు రాలటంలో ధ్వన్యనుకరణ, అను ధ్వనితో; దుః= చెడ్డ; విష = విషము అనెడి; అనలము = అగ్ని; జొాబ్బిలుచుండగన్ = స్రవించుచుండగా; ఎత్తి = పైకెత్తి; లీల = విలాసము; తోన్ = తోటి; జిఱజిఱ = జిఱజఱ త్రిప్పుట యందలి ధ్వన్యనుకరణ, అని ధ్వనితో; త్రిప్పి = తిప్పి; పైచెన్ = విసిరివేసెను; పరిశేషిత = కొద్దిగమిగిలిన; దర్పము = మదము కలది; క్రూర = క్రూరమైన; సర్పమున్ = పామును.

భావము:- నదురు బెదురు లేని గొప్ప మహావీరుడైన బాలకృష్ణుడు ఒక అరచేత్తో కాళియుడి పడగల మీద ఒక చరుపు చరిచాడు. గరుత్మంతుడిలా దౌడలు రెండు పట్టుకొని పైకెత్తి గిరగిర తిప్పి విలాసంగా విసిరికొట్టాడు. కాళీయుని కళ్ళలోంచి దుష్ట విషాగ్నులు బుసబుస పొంగి జరజర కారాయి. ఆ క్రూర మైన కాళియుడి గర్వమంతా అణగిపోయింది.

10.1-664-వ.

ఇట్లు వేగంబుగ నాగంబు వీచిపైచి జగజ్జెట్టియైన నందునిపట్టి రెట్టించిన సంభ్రమంబున.

టీక:- ఇట్లు = ఇలా; వేగంబుగన్ = వడిగా; నాగంబున్ = పామును; వీచిపైచి = విసిరేసి; జగత్ = లోకమునకే; జెట్టి = శూరుడు; ఐన = అయిన; నందుని = నందునియొక్క; పట్టి = కుమారుడు; రెట్టించిన = ద్విగుణీకృతమైన; సంభ్రమంబునన్ = వేగిరపాటుతో.

భావము:- ఈ విధంగా లోకానికే మేటి వీరుడైన శ్రీకృష్ణుడు పామును గిరగిర తిప్పి విసిరికొట్టి రెట్టించిన ఉత్సాహంతో విజృంభించాడు.

10.1-665-సీ. *

ఘన యమునానదీ కల్లోల ఘోషంబు-

సరసమృదంగ ఘోషంబు గాఁగ

సాధు బృందావనచర చంచరీక గా-

నంబు గాయక సుగానంబు గాఁగఁ

గలహంస సారస కమనీయమంజు శ-

బ్దంబులు దాళశబ్దములు గాఁగ

దివినుండి వీక్షించు దివిజ గంధర్వాది-

జనులు సభాసీనజనులు గాఁగ

10.1-665.1-తే.

పద్మరాగాది రత్నప్రభాసమాన

మహితకాళియ ఫణిఫణామండపమున

నళినలోచన విఖ్యాత నర్తకుండు

నిత్యనైపుణమునఁ బేర్చి నృత్య మాడె.

టీక:- ఘన = గొప్ప; యమునా = యమున అనెడి; నదీ = నదియొక్క; కల్లోల = పెద్ద అలల; ఘోషంబు = పెద్ద ధ్వని; సరస = రస యుక్తమైన; మృదంగ = మద్దెల; ఘోషంబు = ధ్వని; కాగన = అగుతుండగ; సాధు = చక్కని; బృందావన = బృందావనము నందు; చర = మెలగెడి; చంచరీక = తుమ్మెదల; గానంబు = పాట; గాయక = గాయకుల; సు = మంచి; గానంబున్ = పాటలు; కాగన్ = అగుచుండగ; కలహంస = కలహంసల; సారస = బెగ్గురుపక్షుల; కమనీయ = మనోజ్ఞమైన; మంజు = ఇంపైన; శబ్దంబులు = ధ్వనులు; తాళ = పక్క తాళము వేయువారి; శబ్దములు = ధ్వనులు; కాగన్ = అగుచుండగ; దివి = ఆకాశము; నుండి = నుండి; వీక్షించు = చూచెడి; దివిజ = దేవతలు; గంధర్వ = గంధర్వులు; ఆది = మొదలైన; జనులు = ప్రజలు; సభ = సభ యందు; ఆసీన = కూర్చున్న; జనులు = వారు; కాగన్ = అగుచుండగ.

పద్మరాగ = కెంపులు; ఆది = మొదలైన; రత్న = రత్నములచేత; ప్రభాసమాన = మిక్కిలి వెలుగు చున్న; మహిత = గొప్ప; కాళియ = కాళియుడు అనెడి; ఫణి = పాము; ఫణా = పడగ లనెడి; మండపమునన్ = వేదికపైన; నళినలోచన = పద్మాక్షుడు, కృష్ణుడు (అను); విఖ్యాత = ప్రసిద్ధుడైన; నర్తకుండు = నృత్యము చేయువాడు; నిత్య = శాశ్వతమైన; నైపుణమునన్ = నేర్పుచేత; పేర్చి = అతిశయించి; నృత్యము = నాట్యములు; ఆడెన్ = చేసెను.

భావము:- ఆ కాళీయుని పడగలు అనే విశాల మండపంమీద బాలకృష్ణుడు అనే ప్రఖ్యాత నర్తకుడు ఎక్కి నిలబడి, బహు నైపుణ్యంతో నృత్యం చేసాడు. ఆ పాముపడగల మండపం పద్మరాగాలు మొదలైన రత్నాలు చేత ప్రకాశిస్తున్నది. ఆ నృత్యానికి సహకారం అందిస్తున్నట్లు యమునానదిలో కదిలే తరంగాల ధ్వనులు చక్కని మృదంగ ధ్వనులుగా ఉన్నాయి. ఆ బృందావనంలో తిరుగుతున్న తుమ్మెదల మధుర సంగీతం, గాయకుల గానంలా వినబడుతున్నది. కలహంసలు, సారసపక్షులు చేస్తున్న శ్రావ్యమైన శబ్దాలు చక్కని తాళధ్వనులను సంతరించుకున్నాయి.

ఆకాశంలోనుండి చూస్తూ ఉన్న దేవతలు, గంధర్వులు మొదలైనవారు సభలో ఆసీనులై ఉన్న ప్రేక్షకుల వలె ఉన్నారు. మొత్తం మీద అదొక గొప్ప నాట్య కచేరీలా ఉంది.

10.1-666-శా.

కుక్షి న్ లోకములున్న గౌరవముతో గోపాకృతి న్నున్న యా
రక్షోహంత వడిన్ మహాఫణిఫణారంగప్రదేశంబుపై
నక్షీణోద్ధత నాడుఁ; బాడుఁ; జెలఁగున్; హాసంబుతోడం బద
ప్రక్షేపంబులు జేయుఁ గేళిగతులం బ్రాణైకశేషంబుగన్.

టీక:- కుక్షి న్ = కడుపులో; లోకములు = చతుర్దశ భువనములు; ఉన్న = ఉన్నట్టి; గౌరవము = భారము; తోన్ = తోటి; గోప = గొల్లవాని; ఆకృతిన్ = ఆకారముతో; ఉన్న = ఉన్న; ఆ = ఆ ప్రసిద్ధుడైన; రక్షోహంత = కృష్ణుడు {రక్షోహంత - రాక్షసులను సంహరించువాడు, విష్ణువు}; వడిన్ = వేగముగా; మహా = గొప్ప; ఫణి = పాము; ఫణా = పడగ లనెడి; రంగ = వేదికా; ప్రదేశంబు = స్థలము; పైన్ = మీద; అక్షీణ = అధికమైన; ఉద్ధతన్ = అతిశయముతో; ఆడున్ = నాట్యమాడును; పాడున్ = పాటలు పాడును; చెలగున్ = విజృంభించును; హాసంబు = నవ్వుల; తోడన్ = తోటి; పద = అడుగులు; ప్రక్షేపంబులు = వేయుట; చేయున్ = చేయును; కేళీ = లీలా; గతులన్ = రీతులతో; ప్రాణ = ప్రాణము; ఏక = ఒకటిమాత్రమే; శేషంబు = మిగిలినది; కన్ = అగునట్లు.

భావము:- గోపబాలకుని రూపంలో ఉన్న రాక్షస సంహారకుడైన శ్రీకృష్ణుడి కడుపులో లోకాలన్నీ ఉన్నాయి. ఆ బరువుతో సహా కాళియుడి పడగలనే మండపంమీద మిక్కిలి ఉల్లాసంగా వేగంగా నృత్యం చేసాడు. పాటలు పాడాడు. చెలరేగి నవ్వుతు గంతులు వేసాడు. పాదాలతో బలంగా తొక్కుతు ఆటలాడాడు. కాళియుడి తల ప్రాణాలు తోక్కొచ్చాయి.

10.1-667-క.

ఘనతర సుషిరానంద

స్వనములతోన్ సిద్ధ సాధ్య చారణ గంధ

ర్వ నిలింప మునిసతులు చ

య్యన గురిసిరి విరులవాన లాడెడు హరిపై.

టీక:- ఘనతర = మిక్కిలి గొప్పదైన {ఘనము - ఘనతరము - ఘనతమము}; సుషిర = ఒక రకమైన మురళియొక్క; ఆనంద = సంతోషకరమైన; స్వనముల = శబ్దముల; తోన్ = తోటి; సిద్ధ = సిద్ధుల; సాధ్య = సాధ్యుల; చారణ = చారణుల; గంధర్వ = గంధర్వుల; నిలింప = దేవతల; ముని = మునుల; సతులు = భార్యలు; చయ్యన = శీఘ్రముగా; కురిసిరి = కురిపించిరి; విరుల = పూల; వానలు = వానలను; ఆడెడి = నాట్యము చేయుచున్న; హరి = కృష్ణుని; పై = మీద.

భావము:- ఆ కాళియమర్దనునిపై ఆకాశంమీద నుండి సిద్ధులు, సాధ్యులు, చారణులు, గంధర్వులు, దేవతలు, దేవర్షులు వారి భార్యలు పూలవానలు కురిసారు. అమృతం తాగిన అధికతర ఆనందం వెల్లివిరిసే కంఠాలతో జయజయ ధ్వానాలు చేసారు.

10.1-668-వ.

ఇట్లు దుష్టజనదండధరావతారుండైన హరి వడి గలిగిన పడగల మీఁదఁ దాండవంబు సలుప, బెండుపడి యొండొండ ముఖంబుల రక్తమాంసంబు లుమియుచుఁ గన్నుల విషంబు గ్రక్కుచు నుక్కచెడి చిక్కి దిక్కులుచూచుచుఁ గంఠగతప్రాణుండై ఫణీంద్రుండు తన మనంబున.

టీక:- ఇట్లు = ఇలాగున; దుష్ట = చెడ్డ; జన = వారి యెడల; దండధర = యముని; అవతారుండు = రూపుదాల్చినవాడు; ఐన = అయిన; హరి = కృష్ణుడు; వడి = బిగువు; కలిగిన = ఉన్న; పడగల = పాముపడగల; మీదన్ = పైన; తాండవంబు = ఉద్ధృతమైన నాట్యమును; సలుపన్ = చేయుచుండగా; బెండుపడి = నిస్సారుడై; ఒండొండ = క్రమముగా; ముఖంబులన్ = ముఖములనుండి; రక్త = రక్తము; మాంసంబులు = మాంసములు; ఉమియుచున్ = కక్కుతు; కన్నులన్ = కన్నులనుండి; విషంబున్ = విషమును; క్రక్కుచున్ = కక్కుతు; ఉక్కుచెడి = బలహీనపడి; చిక్కి = కృశించి; దిక్కులు = ఇటునటు; చూచుచున్ = చూస్తు; కంఠ = కుత్తుక యందు; గత = ఉన్న; ప్రాణుండు = ప్రాణములు కలవాడు; ఐ = అయ్యి; ఫణీంద్రుడు = సర్పరాజు; తన = తనయొక్క; మనంబున = మనసులో.

భావము:- ఈ విధంగా దుర్మార్గుల పాలిటి కాలయముడైన కృష్ణుడు కాళియుడి బిగుపైన పడగలపై ప్రచండ తాండవం చేసాడు; దానితో కాళియుడు బలహీనుడైపోయాడు. ఒక్కొక్క నోటి నుండి రక్తమాంసాలు కక్కుతున్నాడు. కళ్ళల్లోంచి విషం ఉబుకుతోంది. పౌరుషం చెడిపోయింది. బాగా నీరసించిపోయాడు. ప్రాణాలు గొంతులోకి వెళ్ళుకొచ్చేశాయి. దిక్కులు చూస్తు కాళియుడు తనలో తాను ఇలా అనుకొన్నాడు.

10.1-669-ఉ.

"వేలుపులైన లావుచెడి వేదనఁ బొందుచు నా విషానల
జ్వాలలు సోఁకినంతటన చత్తురు; నేడిది యేమి చోద్య? మా
భీలవిషాగ్ని హేతిచయపీడకు నోర్చియుఁ గ్రమ్మఱంగ నీ
బాలుఁడు మత్ఫణాశతము భగ్నముగా వెసఁ ద్రొక్కి యాడెడున్.

టీక:- వేలుపులు = దేవతలు; ఐనన్ = అయినను; లావు = శక్తి; చెడి = నశించి; వేదనన్ = సంకటమును; పొందుచున్ = పొందుచు; నా = నాయొక్క; విష = విషము

అనెడి; అనల = అగని; జ్వాలలు = మంటలు; సోకినన్ = తాకిన; అంతటనన్ = మాత్రముచేతనే; చత్తురు = చనిపోయెదరు; నేడు = ఇవాళ; ఇది = ఇది; ఏమి = ఏమిటి; చోద్యము = విచిత్రము; ఆభీల = భయంకరమైన; విష = విషమనెడి; అగ్ని = అగ్నిచేత; హేతి = దెబ్బల; చయ = అనేకముయొక్క; పీడ = బాధ; కున్ = కు; ఓర్చియున్ = తట్టుకొనుటేకాక; క్రమ్మఅంగ = మరల; ఈ = ఈయొక్క; బాలుడు = చిన్నపిల్లవాడు; మత్ = నాయొక్క; ఫణా = పడగల; శతమున్ = నూటిని, సమూహమును; భగ్నము = నలిగిపోయినవి; కాన్ = అగునట్లు; పెసన్ = వేగముగా; త్రొక్కి = తొక్కి; ఆడెడున్ = నృత్యము చేస్తున్నాడు.

భావము:- “నా విషాగ్ని జ్వాలలు సోకితే చాలు, దేవతలైనా సరే శక్తి నశించిపోయి గిలగిలకొట్టుకొని చచ్చిపోతారు. అలాంటిది ఇవేళ ఈ బాలుడు క్రూరమైన నావిషాగ్ని జ్వాలల తాకిడి ధాటికి తట్టుకొన్నాడు. పైగా నా నూరు పడగలను చితకతొక్కేస్తూ నాట్యం చేసేస్తున్నాడు కూడ. ఇదేమి విచిత్రమో?

10.1-670-క.

ఈతఁడు సర్వచరాచర

భూతేశుండైన పరమపురుషుఁడు సేవా

ప్రీతుఁడు శ్రీహరి యగు"నని

భీతిన్ శరణంబు నొందె బిట్టలసి నృపా!

టీక:- ఈతడు = ఇతను; సర్వ = సమస్తమైన; చర = చరించ గల; అచర = చరించ లేని; భూత = జీవులకు; ఈశుండు = ప్రభువు; ఐన = అగు; పరమపురుషుడు = పరమాత్మ; సేవా = భక్తుల యందు; ప్రీతుడు = ప్రీతి గలవాడు; శ్రీహరి = విష్ణుమూర్తి {హరి - సుషుప్తి మరియు ప్రళయ కాలములందు సర్వమును తన యందు లయము

చేసుకొని సుఖరూపమున నుండువాడు, విష్ణువు}; అగును = అగును; అని = అని; భీతిన్ = భయముతో; శరణంబు = శరణు; ఒందెన్ = ఛొచ్చెను; బిట్టు = మిక్కిలి; అలసి = అలసిపోయి; నృపా = రాజా.

భావము:- రాజా! విష్ణుమూర్తి సమస్త చరాచర జీవులకు ప్రభువు, పరమ పురుషుడు, భక్తితో సేవిస్తే సంతోషించేవాడు. ఈ పిల్లవాడు ఆ శ్రీహరే అయ్యి ఉంటాడు.” అనుకున్నాడు కాళియుడు. మిక్కిలి భయంతో, అలసటతో అతడు కృష్ణుని శరణు కోరాడు.

10.1-671-వ.

ఇట్లు క్రూరంబులయిన హరిచరణ ప్రహరంబులం బడగ లెడసి నొచ్చి చచ్చినక్రియం బడియున్న పతిం జూచి నాగకాంతలు దురంతంబయిన చింతాభరంబున నివ్వటిల్లెడు సెవ్వగల నొల్లొంబోయి పల్లటిల్లిన యుల్లంబుల.

టీక:- ఇట్లు = ఈ విధముగా; క్రూరంబులు = కఠినమైనవి; అయిన = ఐన; హరి = కృష్ణుని; చరణ = పాదముల; ప్రహరంబులన్ = తాకిడిచే; పడగలు = పడగలు; ఎడసి = భగ్నమై; నొచ్చి = నొప్పిని పొందినవాడై; చచ్చిన = చనిపోయినవాని; క్రియన్ = వలె; పడియున్న = పడి ఉన్నట్టి; పతిన్ = భర్తను; చూచి = చూసి; నాగకాంతలు = ఆ కాళియుని భార్యలు; దురంతంబు = అంతులేనిది; అయిన = ఐనట్టి; చింత = విచారముయొక్క; భరంబునన్ = అతిశయముచేత; నివ్వటిల్లెడు = కలిగిన; సెఅ = మిక్కిలి; వగలన్ = దుఃఖముతో; ఒల్లంబోయి = తపించి; పల్లటిల్లిన = తడబడిన, కలవరపడిన; ఉల్లంబుల = మనసులతో.

భావము:- ఈ విధంగా తాండవకృష్ణుడి దారుణమైన పాదాలతాకిడికి పడగలన్ని చితికిపోయి, చచ్చిపోయినవాడిలా పడి ఉన్న తమ భర్త కాళియుని చూసి,

అతని భార్యలు ఎంతో శోకించారు. భరించలేని ఆ శోకభారంతో వారి మనస్సులు కలవరపడ్డాయి.

10.1-672-మ.

కచబంధంబులు వీడ భూషణము లాకంపింపఁ గౌఁదీవియల్
కుచయుగ్మంబుల ప్రేగునం గదలఁ బైకొంగుల్ వడిన్ జాఱఁగాఁ
బ్రచురభ్రాంతిఁ గలంగి ముందట రుదద్బాలావళిం గొంచు స్రు
క్కుచు, భక్తిం జని కాంచి రా గుణమణిన్ గోపాలచూడామణిన్.

టీక:- కచబంధంబలు = జుట్టుముళ్ళు; వీడన్ = విడిపోతుండగ; భూషణములు = ఆభరణములు; ఆకంపింపన్ = అంతటను చలించగా; కౌన్ = నడుములు అనెడి; తీవియల్ = లతలు; కుచ = స్తనములు; యుగ్మంబులు = జంటల; ప్రేగునన్ = బరువునకు; కదలన్ = చలింపగా; పైకొంగులు = పైటకొంగులు; వడిన్ = వేగముచేత; జార = తొలగుచుండగా; ప్రచుర = అధికమైన; భ్రాంతిన్ = విభ్రమముచే, నివ్వెరపాటుచేత; కలంగి = కలత నొంది; ముందట = ఎదురుగా; రుదత్ = ఏడ్చుచున్న; బాల = పిల్లల; ఆవళిన్ = సమూహమును; కొంచున్ = తీసుకొనుచు; స్రుక్కుచు = నొచ్చు కొనుచు; భక్తిన్ = భక్తితో; చని = వెళ్ళి; కాంచిరి = దర్శనము చేసికొనిరి; గుణమణిన్ = మంచి గుణములు కలవానిని; గోపాల = యాదవులలో; చూడామణిన్ = శిరోమణివంటి వానిని.

భావము:- వారు వస్తున్న వేగానికి కాళీయుని భార్యల కొప్పుముడులు జారిపోతున్నాయి. వారి ఆభరణాలు చెదిరిపోతున్నాయి. స్తనాల బరువుకు తీగలాంటి నడుములు అల్లాడిపోతున్నాయి. పైటకొంగులు జారి పోతున్నాయి. దిక్కు తోచని భ్రాంతితో కలవర పడిపోతున్నారు. గొల్లున ఏడుస్తున్న పిల్లలను ముందు పెట్టుకొని సుగుణాలశ్రేష్ఠుడు గోపాలశేఖరుడు అయిన కృష్ణుని చేరి వారు భక్తిపూర్వకంగా దర్శనం చేసుకొన్నారు.

నాగకాంతలు స్తుతించుట

10.1-673-వ.

కని దండప్రణామంబు లాచరించి నిటలతటఘటిత కరకమలలై యిట్లనిరి.

టీక:- కని = దర్శించి; దండప్రణామంబులు = సాష్టాంగనమస్కారములు; ఆచరించి = చేసి; నిటల = నొసటి; తట = ప్రదేశమున; ఘటిత = కూర్చబడిన; కర = చేతులు అనెడి; కమలలు = పద్మములు కలవారు; ఐ = అయ్యి; ఇట్లు = ఇలా; అనిరి = పలికిరి.

భావము:- ఆ నాగకాంతలు కృష్ణుని దర్శించి సాష్టాంగనమస్కారాలు చేసి, నుదుట చేతులు జోడించి ఇలా అన్నారు:

10.1-674-క.

"క్రూరాత్ముల దండింపఁగ
ధారుణిపై నవతరించి తనరెడి నీ కీ
క్రూరాత్ముని దండించుట
క్రూరత్వము గాదు సాధుగుణము గుణాఢ్యా!

టీక:- క్రూర = కఠినమైన; ఆత్ములన్ = మనసులు కలవారిని; దండింపగ = శిక్షించుటకు; ధారుణి = భూమి; పైన్ = మీద; అవతరించి = పుట్టి; తనరెడి = ఒప్పునట్టి; నీ = నీ; కున్ = కు; ఈ = ఈయొక్క; క్రూరాత్ముని = కఠినాత్ముని; దండించుట = శిక్షించుట; క్రూరత్వము = కఠినత్వము; కాదు = కాదు; సాధుగుణము = మృదుత్వము; గుణాఢ్యా = త్రిగుణసంపన్నుడా, కృష్ణా.

భావము:- "సర్వగుణ సంపన్నుడవైన కృష్ణా! క్రూరులను దండించడానికి అవతరించిన వాడవు నీవు. క్రూరుడైన కాళియుని శిక్షించుట నీ వీరత్వమే గాని క్రూరత్వం కాదు.

10.1-675-క.

పగవారి సుతుల యందును

బగ యించుక లేక సమతఁ బరగెడి నీకుం

బగగలదె? ఖలుల నడఁచుట

జగదవనముకొఱకుఁ గాక జగదాధారా!

టీక:- పగవారి = శత్రులుయొక్క; సుతుల = బిడ్డల; అందునున్ = ఎడల; పగ = శత్రుత్వము; ఇంచుక = కొద్దిగా కూడ; లేక = లేకుండగ; సమతన్ = సమభావమున; పరగెడి = మెలగెడి; నీ = నీ; కున్ = కు; పగ = శత్రుభావము; కలదె = ఉన్నదా, లేదు; ఖలులన్ = దుష్టులను; అణచుట = శిక్షించుట; జగత్ = లోకమునకు; అవనము = రక్షించుట; కొఱకున్ = కోసము; కాక = తప్ప; జగదాధరా = కృష్ణా {జగదాధారుడు - జగత్తునకు ఆధారభూతమైనవాడు, విష్ణువు}.

భావము:- సమస్త లోకాలకు ఆధారభూతమైనవాడా! శ్రీకృష్ణా! శత్రువుల కొడుకు లందు సైతము కొంచెం కూడ శత్రుత్వం చూపకుండ నీవు సమానత్వం చూపుతావు. నీకు పగ అన్నది లేదు కదా. నీవు దుష్టులను శిక్షించుట లోకాలను రక్షంచడానికే కదా.

10.1-676-క.

నిగ్రహమె మము విషాస్యుల

నుగ్రుల శిక్షించు టెల్ల? నూహింప మహా

నుగ్రహము గాక మాకీ

నిగ్రహము విషాస్యభావనిర్గతిఁ జేసెన్.

టీక:- నిగ్రహమె = అడ్డగించుటె, కాదు; మమున్ = మమ్ములను; విష = విషము గల; ఆస్యులన్ = మోము గలవారలను; ఉగ్రులన్ = భయంకరులను; శిక్షించుట = దండించుటలు; ఎల్లన్ = సమస్తము; ఊహింప = ఆలోచించగా; మహా = గొప్ప; అనుగ్రహము = అనుగ్రహము; కాక = కాకుండగ; మా = మా; కున్ = కు; ఈ = ఈయొక్క; నిగ్రహము = దండన; విష = విషపు; అస్య = ముఖముల; భావ = తత్వమునుండి; నిర్గతి = విడుదలౌటను; చేసెన్ = కలిగించెను.

భావము:- మేము నోట్లో విషం కలిగి ఉండేవాళ్లం. తీవ్రమైన కోపం కలవాళ్ళం. అలాంటి మమ్మల్నిశిక్షించడం నిజానికి దండనే కాదు. అది మమ్మల్ని గొప్పగా అనుగ్రహించుటయే. ఈ శిక్ష, మా కున్న విషం కలవాళ్ళ మనే పొగరు దిగిపోయేలా చేసింది.

10.1-677-ఉ.

ఎట్టి తపంబు జేసెనొకొ? యెట్టి సుకర్మము లాచరించెనో?
యెట్టి నిజంబు బల్కెనొకొ? యీ ఫణి పూర్వభవంబు నందు ము
న్నెట్టి మహానుభావులకు నెన్నఁడుఁ జేరువగాని నీవు నేఁ
డిట్టి వినోదలీలఁ దల లెక్కి నటించెద వీ ఫణీంద్రుపై.

టీక:- ఎట్టి = ఎలాంటి; తపంబున్ = తపస్సును; చేసెన్ = చేసెనో; ఒకో = ఏమో; ఎట్టి = ఎలాంటి; సుకర్మములు = మంచిపనులు; ఆచరించెనో = చేసెనో; ఎట్టి = ఎలాంటి; నిజంబున్ = సత్యమును; పల్కెన్ = పలికెనో; ఒకో = ఏమో; ఈ = ఈయొక్క; ఫణి = సర్పము; పూర్వ = ముందు; భవంబున్ = జన్మము; అందున్ = లో; మున్ను = ఇంతకు పూర్వము; ఎట్టి = ఎలాంటి; మహానుభావుల = గొప్పవారల; కున్ = కు; ఎన్నడున్ = ఎప్పుడు; చేరువ = సన్నిహితుడు; కాని = కాని; నీవు = నీవు; నేడు = ఇవాళ; ఇట్టి = ఇటువంటి; వినోద = వినోద; లీన = విలాసములను; నటించెదవు = నాట్యము చేసెదవు; ఈ = ఈయొక్క; ఫణి = పాము; ఇంద్రు = శ్రేష్ఠుని; పైన్ = మీద.

భావము:- పూర్వ జన్మలలో ఈ కాళియుడు ఎంతటి గొప్ప తపస్సు చేసాడో? ఏ గొప్ప మంచిపనులు చేసాడో? ఏ సత్యాలు పలికాడో? ఎప్పుడు ఎంతటి మహానుభావుల దగ్గరకువెళ్ళని నువ్వు ఇవేళ ఇలా వినోదంగా ఈ నాగరాజు పడగలమీదెక్కి నాట్యం చేసావు. (అహా! విష్ణుపాద స్పర్శ లభించింది ఎంత అదృష్టవంతుడో కదా ఇతడు?)

10.1-678-మ.

బహు కాలంబు తపంబు చేసి వ్రతముల్ బాటించి కామించి నీ
మహనీయోజ్వల పాదరేణుకణ సంస్పర్శాధికారంబు శ్రీ
మహిళారత్నము తొల్లి కాంచె నిదె నేమం బేమియున్ లేక నీ
యహి నీ పాదయుగాహతిం బడసె నే డత్యద్భుతం బీశ్వరా!

టీక:- బహు = చాల; కాలంబు = కాలము; తపంబున్ = తపస్సు; చేసి = చేసి; వ్రతముల్ = వ్రతములు; పాటించి = ఆచరించి; కామించి = కోరి; నీ = నీ; మహనీయ = గొప్ప; ఉజ్వల = ప్రకాశవంతమైన; పాద = పాదముల; రేణు = ధూళి; కణ = లేశము; సంస్పర్శ = సోకునట్టి; అధికారంబు = అర్హతను; శ్రీమహిళారత్నము = లక్ష్మీదేవి; తొల్లి = పూర్వము; కాంచెన్ = పొందెను; ఇదె = ఇదిగో; నేమంబు = నియమములు; ఏమియున్ = ఏమికూడ; లేకన్ = లేకుండగనే; ఈ = ఈయొక్క; అహి = సర్పము; నీ = నీయొక్క; పాద = పాదముల; యుగ = జంటయొక్క; హతిన్ = దెబ్బలను; పడసె = పొందెను; నేడు; అతి = మిక్కిలి; అద్భుతంబు = ఆశ్చర్యకరము; ఈశ్వరా = కృష్ణా.

భావము:- దేవా? కృష్ణా? పూర్వం లక్ష్మీదేవి ఎంతోకాలం తపస్సు చేసి, పట్టుదలగా వ్రతా లనేకం చేసి, గొప్ప తేజస్సుతో ప్రకాశించే నీ పాదరేణువుల లోని కణాన్ని తాకేటట్టి అర్హత సంపాదించు కొంది. ఆహా! అలాంటిది ఈ సర్పరాజు ఏ తపస్సు చేయకుండానే నీ రెండు పాదాల పవిత్ర స్పర్శకు నోచుకున్నాడు.

10.1-69-ఉ.

ఒల్లరు నిర్జరేంద్రపద మొల్లరు బ్రహ్మపదంబు నొందఁగా

నొల్లరు చక్రవర్తిపద మొల్లరు సర్వరసాధిపత్యము

న్నొల్లరు యోగసిద్ధి మఱియొండు భవంబుల నొందనీని నీ

సల్లలితాంఘ్రి రేణువుల సంగతి నొందిన ధన్యు లెప్పుడున్.

టీక:- ఒల్లరు = అంగీకరించరు; నిర్జరేంద్ర పదము = దేవేంద్ర పదవిని; ఒల్లరు = అంగీకరింపరు; బ్రహ్మ = బ్రహ్మదేవుని; పదంబున = పదవు; ఒందగా = పొందుటకు; ఒల్లరు = అంగీకరించరు; చక్రవర్తి = సార్వభౌమ; పదమున్ = స్థానమును; ఒల్లరు = అంగీకరింపరు; సర్వ = సమస్తమైన; రస = భూమండలమును; అధిపత్యమున్ = ఏలెడి అధికారమును; ఒల్లరు = అంగీకరించరు; యోగ = యోగసాధనలో; సిద్ధిన్ = సాఫల్యమును; మఱి = మరి; ఒండు = ఇంకొక; భవంబులన్ = జన్మలను; ఒందనీని = పొందనీయని; నీ = నీయొక్క; సత్ = ప్రశస్తమైన; లలిత = మనోజ్ఞమైన; అంఘ్రి = పాద; రేణువుల = ధూళితోడి; సంగతిన్ = కూడికను; ఒందిన = పొందినట్టి; ధన్యులు = కృతార్థులు; ఎప్పుడున్ = ఎప్పుడైనను.

భావము:- అతి మనోజ్ఞము లైన నీ పాదరేణువుల స్పర్శ పొందిన ధన్యులు ఎప్పటికి మరొక పునర్జన్మను పొందరు. అట్టి ధన్యులు, ఆ భాగ్యాన్ని తప్పించి, ఎప్పుడూ దేవేంద్ర పదవికి కూడా ఇష్టపడరు. బ్రహ్మపదానికి కూడా ఇష్టపడరు. చక్రవర్తి, వరుణ పదవులకి కూడా ఒప్పుకోరు. యోగసిద్ధికి అయినా సరే ఒప్పుకోరు.

10.1-680-క.

ఘన సంసారాహతులగు

జను లాకాంక్షింపఁ గడు నశక్యం బగు శో

భనము సమక్షంబున నహి

గనియెం దామసుఁడు రోషకలితుం డయ్యున్

టీక:- ఘన = గొప్పదైన; సంసార = సంసారపు; ఆహతులు = భారము పడినవారు; అగు = ఐన; జనులు = ప్రజలు; ఆకాంక్షింపన్ = కోరుకొనుట కైనన్; కడు = మిక్కలి; అశక్యంబు = అసాధ్యము; అగు = ఐన; శోభనము = మేలు; సమక్షంబునన్ = కంటి కెదురుగా; అహి = ఈ సర్పము; కనియెన్ = పొందెను; తామసుడు = తమోగుణాన్వితుడు; రోష = కోపము; కలితుండు = కలవాడు; అయ్యున్ = అయినప్పటికి.

భావము:- నీ సాన్నిధ్యమే పరమ శుభం; అతి భారమైన సంసారం వలన మిక్కిలిగా కూరుకుపోయిన వారికి, కోరడానికి కూడ సాధ్యం కానిది. ఎంత అదృష్టవంతుడో? అట్టి భాగ్యాన్ని ఈ కాళియుడు ఇలా క్రోధం రోషంతో నిండిన వాడైనప్పటికి, పొందాడు.

10.1-681-వ.

దేవా! సకలపురుషాంతర్యామిరూపత్వంబు వలనఁ బరమపురుషుండ వయ్యు, నపరిచ్ఛిన్నత్వంబు వలన మహాత్ముండ వయ్యు, నాకాశాది భూతసమాశ్రయ త్వంబువలన భూతావాసుండవయ్యును, భూతమయ త్వంబు వలన భూతశబ్ద వాచ్యుండవయ్యుఁ, గారణాతీతత్వంబు వలనఁ బరమాత్ముండ వయ్యును, జ్ఞాన విజ్ఞాన పరిపూర్ణత్వంబు గలిగి

నిర్గుణత్వ నిర్వికారత్వంబు వలన బ్రహ్మంబ వయ్యుఁను, బ్రకృతిప్రవర్త కత్వంబువలన ననంతశక్తిపై యప్రాకృతుండవయ్యుఁ గాలచక్రప్రవర్త కత్వంబువలనఁ గాలుండవయ్యుఁ, గాలశక్తి సమాశ్రయత్వంబు వలన గాలనాభుండవయ్యు, సృష్టి జీవన సంహారాది దర్శిత్వంబు వలనం గాలావయవసాక్షి వయ్యు నొప్పు నీకు నమస్కరించెదము; మఱియును.

టీక:- దేవా = భగవంతుడా; సకల = సమస్తమైన; పురుష = జీవులయొక్క; అంతర్యామి = లోపల వర్తించునట్టి; రూపత్వంబు = రూపము కలవాడవు; వలన = అగుట వలన; పరమపురుషుండవు = పరమపురుషుడవు {పురుషుడు – వ్యుత్పత్తి. పురీ శరీరేశేత ఇతి పురుషః, సకల జీవశరీరముల యందు వసించువాడు పురుషుడు}; అయ్యున్ = అయినప్పటికి; అపరిచ్ఛిన్నత్వంబు = అంఖడ స్వభావము {అపరిచ్ఛిన్నము – దేశ కాల వస్తువుల చేత విభాగింపబడనిది}; వలన = వలన; మహాత్మ్ముండవు = మహాత్మ్ముడవు {మహాత్మ్ముడు – మహత్తత్వ అవ్యక్తములను మీరిన గొప్పరూపము కల వాడు}; అయ్యున్ = అయినప్పటికి; ఆకాశ = ఆకాశము; ఆది = మొదలగు; భూత = పంచభూతములకు {భూత – భూమి నీరు అగ్ని వాయువు ఆకాశము అనెడి పంచ భూతములు ఆ భూతజన్యములైన జీవులు}; సమ = చక్కటి; ఆశ్రయత్వంబు = అండగా ఉండు తత్వము; వలన = వలన; భూత = సమస్త భూతములకు; ఆవాసుండవు = నివాసమైనవాడవు; అయ్యును = అయినప్పటికి; భూత = సమస్త భూతముల; మయత్వంబు = నిండి ఉండు తత్వము; వలన = వలన; భూత = భూతము అనెడి; శబ్ద = నామము చేత; వాచ్యుండవు = పలుకబడువాడవు; అయ్యున్ = అయినప్పటికి; కారణ = మూల ప్రకృతి {మూలప్రకృతి – సర్వకారణములకు కారణ మైనది}; అతీతత్వంబు = మీరిన లక్షణము; వలన = వలన; పరమాత్మ్ముండవు = పరమాత్మ్ముడవు; అయ్యును = అయినప్పటికి; జ్ఞాన = అపరోక్షజ్ఞానము నందు; విజ్ఞాన = పరోక్షజ్ఞానము నందు {పరోక్షజ్ఞానము – ప్రపంచ కల్పనాది రూపము కలది};

పరిపూర్ణత్వంబు = సంపూర్ణభావము; కలిగి = ఉండి; నిర్గుణత్వ = త్రిగుణాతీత స్వభావము {నిర్గుణత్వము - శాంతరూపైన సత్వగుణము ఘోరరూపైన రజోగుణము మూఢరూపైన తమోగుణము ఐన త్రిగుణములు లేకపోవుట, మూటికి అతీతముగ వుండుట}; నిర్వికారత్వంబు = షడ్భావవికారాతీతత్వము {నిర్వికారత్వము - షడ్విధ వికారములు లేకపోవుట (1గర్భములో ఉండుట 2పుట్టుట 3పెరుగుట 4ముదియుట 5కృశించుట 6చనిపోవుట)}; వలన = వలన; బ్రహ్మంబవు = పరబ్రహ్మవు {పరబ్రహ్మ - అఖండ పరిపూర్ణ సచ్చిదానంద పరబ్రహ్మ (శో. బహిర్బ్రహ్మ వృద్దై బృహతేర్ధాతోః అర్థానుగమాత్ దేశతః కాలతః వస్తుతః అపరిచ్ఛిన్నం యద్వస్తు తద్బ్రహ్మేతి భాష్యం)}; అయ్యును = అయినప్పటికి; ప్రకృతి = నీ అవ్యక్త నామ శక్తియొక్క; ప్రవర్తకత్వంబు = సర్వ వ్యాపార ప్రవర్తకము {సర్వ వ్యాపార ప్రవర్తకము - సమస్తమైన పంచవ్యాపారముల (1సృష్టి 2స్థితి 3లయ 4తిరోధాన 5అనుగ్రహములు) యందు విచిత్రముగ వ్యాపించ గలుగుట}; వలనన్ = వలన; అనంతశక్తివి = అంతులేని శక్తి కలవాడవు {అనంత శక్తి - 1సర్వజ్ఞత్వ 2సర్వేశ్వరత్వ 3సర్వభోక్తృత్వ 4సర్వపాలకత్వాది సామర్థ్యములు కలిగ ఉండుట}; ఐ = అయ్యి; అప్రాకృతుండవు = ప్రకృతికి అతీతుడవు; అయ్యున్ = అయినప్పటికి; కాలచక్ర = కాలావయవములను {కాలచక్రము - అఖండమై నిమేష ఘటిక దిన మాస సంవత్సరాది కాలావయవము లనెడి భేదములచే చక్ర భ్రమణ యుక్తమైన కాలము}; ప్రవర్తకత్వంబు = నడిపించెడివాడవు; వలన = అగుట వలన; కాలుండవు = అఖండకాలస్వరూపుడవు; అయ్యున్ = అయినప్పటికి; కాల = కాలము అనెడి; శక్తి = శక్తికి (సృష్టిస్థితిలయాదులకు); సమ = మేలైన; ఆశ్రయత్వంబు = ఆశ్రయభూతుడగుట; వలన = వలన; కాలనాభుండవు = కాలము స్వాధీనముగ కలవాడువు; అయ్యున్ = అయినప్పటికి; సృష్టి = సృష్టి; జీవన = స్థితి; సంహార = లయ; ఆది = మొదలగునవానిని; దర్శిత్వంబు = చూపువాడవు; వలన = అగుట వలన; కాల = కాలముయొక్క; అవయవ = భాగములకు (నిమేష సంవత్సరాదులు); సాక్షివి = సాక్షివి {సాక్షి - కాల వస్తు స్థితి స్వభావముల ప్రభావములకు లోనుగాక చూచు

వాడు}; అయ్యున్ = అయ్యి; ఒప్పు = ఉండునట్టి; నీ = నీ; కున్ = కు; నమస్కరించెదము = మ్రొక్కెదము; మఱియును = ఇంకను.

భావము:- ఓ కృష్ణ దేవుడా! నీవు అందరిలోను నిండి ఉండేవాడవు, కనుక జీవుడనే పురుషుడవు. అంతే కాక, అందరిలోని అంతర్యామివి, కనుక పరమ పురుషుడవు. విడివిడిగా కాకుండా అందరిలోను నిండి ఉండేవాడవు, కనుక మహాత్ముడవు. ఆకాశం మొదలైన పంచభూతాలకు ఆశ్రయుడవు గనుక, నీవు భూత వాసుడవు. సమస్తభూతాలు నీలో ఉన్నాయి గనుక, నీవు భూతమయుడవు. నీకు కారణం ఏమి లేదు కనుక నీవు పరమాత్మవు. పరిపూర్ణమైన జ్ఞానం విజ్ఞానం కల వాడవు కనుకను, గుణాలు ఆటంకాలు మార్పులు లేనివాడవు కనుకను, బ్రహ్మమువవు. ఈ ప్రకృతిని ప్రవర్తింప జేసేవాడవు నీవే కనుక, అనంతశక్తి స్వరూపుడవు. ఆ ప్రకృతి అంటని వాడవు. కాలచక్రాన్ని నడుపుతుంటావు కనుక, కాలస్వరూపుడువు. కాలం యొక్క శక్తిని ఆశ్రయించి ఉన్నావు కనుక, కాలనాభుడవు. సృష్టిలోని జీవులు జన్మించటం మరణించటం చూస్తూ ఉంటావు కనుక, నీవు సర్వసాక్షివి. అటువంటి దేవా? నీకు నమస్కరిస్తున్నాము.

10.1-682-సీ.

విశ్వంబు నీవయ్యి విశ్వంబుఁ జూచుచు-
    విశ్వంబుఁ జేయుచు విశ్వమునకు
హేతువవై పంచభూతమాత్రేంద్రియ-
    ములకు మనః ప్రాణ బుద్ధి చిత్త
ముల కెల్ల నాత్మవై మొనసి గుణంబుల-
    నావృత మగుచు నిజాంశభూత
మగు నాత్మచయమున కనుభూతి చేయుచు-
    మూఢహంకృతులచే ముసుఁగుబడక

10.1-682.1-తే.

సెలి ననంతుఁడవై దర్శనీయరుచివి
గాక సూక్ష్ముఁడవై నిర్వికారమహిమఁ
దనరి కూటస్థుఁడన సమస్తంబు సెలుఁగు
నీకు మ్రొక్కెద మాలింపు నిర్మలాత్మ!

టీక:- విశ్వంబు = జగత్తు; నీవ = నీవే; ఐ = అయ్యి; విశ్వంబున్ = జగత్తును; చూచుచున్ = సాక్షిపై చూచుచు; విశ్వంబున్ = జగత్తును; చేయుచున్ = సృష్టించుచు; విశ్వమున్ = జగత్తున; కున్ = కు; హేతువవు = కారణభూతుడవు; పంచభూత = పంచమహాభూతములకు {పంచమహాభూతములు - 1 భూమి 2 నీరు 3 అగ్ని 4 వాయువు 5 ఆకాశము}; మాత్ర = పంచతన్మాత్రలకు {మాత్రలు, పంచ తన్మాత్రలు - 1 శబ్దము 2 స్పర్శము 3 రూపము 4 రసము 5 గంధము}; ఇంద్రియముల్ = జ్ఞానకర్మేంద్రియముల {దశేంద్రియములు - జ్ఞానేంద్రియములు ఐదు (కన్ను ముక్కు చెవులు నాలుక చర్మములు) కర్మేంద్రియములు ఐదు (కాళ్ళు చేతులు నోరు గుదము గుహ్యములు)}; కున్ = కు; మనః = మనస్సునకు {మనస్సు - సంకల్ప రూపము}; ప్రాణ = దశవాయువులకు {ప్రాణములు, దశవాయువులు - పంచవాయువులు ఐదు (ప్రాణ అపాన వ్యాన ఉదాన సమానములు) పంచ ఉపవాయువులు ఐదు (నాగ కూర్మ కృకర దేవదత్త ధనంజయములు)}; బుద్ధి = బుద్ధి {బుద్ధి - నిశ్చయము రూపము}; చిత్తముల = చిత్తముల {చిత్తము - సంశయ రూపము}; కిన్ = కి; ఎల్లన్ = సమస్తమునకు; ఆత్మవు = స్వరూపుడవు; ఐ = అయ్యి; మొనసి = పూని; గుణంబులన్ = త్రిగుణములచేత; ఆవృతము = కప్పబడినవాడవు; అగుచున్ = అగుచు; నిజ = నీయొక్క; అంశ = అంశములో; భూతము = ఐనవవి; అగు = అయిన; ఆత్మచయమున = సర్వజీవజాలముల; కున్ = కు; అనుభూతి = జీవన్మరణా ద్యను భవములు; చేయుచున్ = కలుగజేయుచు; మూడహంకృతుల = త్రిగుణాత్మకహంకృతులు {త్రిగుణాత్మకహంకృతులు - రాజసాహంకృతి

తామసాహంకృతి సాత్వికాహంకృతి}; చేన్ = వలన; ముసుగుబడకన్ = కమ్ముకొనబడకుండగ.

నెఱిన్ = పరిపూర్ణత్వముచేత; అనంతుడవు = అంతము లేనివాడవు {అనంతుడు – దేశ కాల వస్తు విభాగము లేనివాడు, అంతము లేనివాడు}; ఐ = అయ్యి; దర్శనీయ = చూడదగిన; రుచివి = తగినవాడవు {రుచి – ప్రకాశము, దృశ్యప్రపంచ రూపమైన ఇదంవృత్తి}; కాక = కాకుండగ; సూక్ష్ముడవు = సూక్ష్మత్వము కలవాడవు; ఐ = అయ్యి; నిర్వికార = షడ్వికార శూన్యత్వ; మహిమన్ = మహత్యముచేత; తనరి = ఒప్పి; కూటస్థుడు = కూటస్థుడు {కూటస్థుడు – కూటస్థము (ఎల్లకాలము ఒకే విధముగా నుండెడి తత్వము) కలవాడు, పంచమహాభూతముల సమూహమున ఉండువాడు, క్షేత్రజ్ఞుడు}; అనన్ = అనబడుతు; సమస్తంబున్ = సమస్తమును {సమస్తము – ద్రష్ట దృక్ దృశ్య మయమైన సమస్తము}; ఎఱుగు = తెలిసి యుండెడి; నీ = నీ; కున్ = కు; మ్రొక్కెదన్ = నమస్కరించెదను; ఆలింపుము = వినుము {పంచమలములు – 1ఆణవము 2కార్మికము 3మాయికము 4మాయేయము 5తిరోధా నము }; నిర్మలాత్మా = కృష్ణా {నిర్మలాత్మ – పంచమలములు లేని పరబ్రహ్మ స్వరూపుడు, విష్ణువు}.

భావము:- ఈ సమస్త విశ్వము నీవే; ఈ విశ్వంగా ఉండి దాన్ని చూస్తున్న వాడవు కూడ నీవే. దీన్ని నిర్మిస్తూ ఉండేది నీవే. ఈ విశ్వానికి మూలకారణం నీవే. పంచతన్మాత్రలు, పంచేంద్రియాలు, మనస్సు, ప్రాణం, బుద్ధి, చిత్తం అన్నీ కూడ నీవే. ఈ గుణాలచేత ఆవరింపబడి ఉన్నవాడవు నీవే. నీలో కొంత భాగమై, నీ అంశలై ఇన్ని ఆత్మలు వర్తిస్తు ఉంటే, వాటికి అనుభూతి కలిగించే మొత్తంగా నీవే ఉన్నావు. త్రిగుణాలైన సత్వరజస్తమాల రూపంలో పనిచేసే మూడు అహంకారాలుచేత కప్పబడకుండా ఉంటావు. అంతులేని ప్రకాశం కలిగి ఉంటావు. గమనించడానికి శక్యంకాని సూక్ష్మ రూపుడవు అయ్యి ఉంటావు. మార్పులన్నవి లేకుండా ఉండి,

అన్నిటిలోను దాగి ఉంటావు కనుక, సమస్తము ఎరుగుదువు. అటువంటి నీకు నిర్మలాత్ముడా! మేము నమస్కరిస్తున్నాము.

10.1-683-వ.

మఱియుఁ గలండు లేఁడు; సర్వంబు సెఱుంగు; నించుక సెఱుంగు బద్ధుండు; విముక్తుం డొకం; డనేకుఁడు నను నివి మొదలుగాఁ గల వాదంబులు మాయ వలన ననురోధింపుదురు గావున నానావాదా నురోధకుండ వయ్యి, నభిధా నాభిధేయ శక్తిభేదంబుల వలన బహు ప్రభావప్రతీతుండ వయ్యుఁ, జక్షురాది రూపంబుల వలనఁ బ్రమాణ రూపకుండ వయ్యి, నిరపేక్షజ్ఞానంబు గలిమిం గవి వయ్యి, వేదమయ నిశ్వాసత్వంబువలన శాస్త్రయోని వయ్యి, సంకర్షణ వాసుదేవ ప్రద్యుమ్నా నిరుద్ధ రూపంబుల వలనఁ జతుర్మూర్తి వయ్యి, భక్తజన పాలకుండ వయ్యి, నంతఃకరణ ప్రకాశత్వంబు గలిగి సేవకజన ఫలప్రదానంబు కొఱకు గుణాచ్ఛాదకుండ వయ్యుఁ, జిత్తాదివర్తనంబులఁ గానందగిన గుణంబులకు సాక్షి పై యొరుల కెఱుంగరామి నగోచరుండ వయ్యుఁ, దర్కింప రాని సెంపు వలన నవ్యాహతవిహారుండ వయ్యి, సకలకార్య హేతువయ్యి, నంతఃకరణప్రవర్తకత్వంబు వలన హృషీకేశుండవయ్యును, సాధనవశంబు గాని యాత్మారామత్వంబు వలన మునివయ్యి, స్థూల సూక్ష్మగతుల సెఱుంగు చు సెందుం జెందక నీవు విశ్వంబుగాకయు విశ్వంబు నీ వయ్యును, విశ్వ భావాభావ సందర్శనంబు చేయుచు విద్యావిద్యలకు హేతువైన నీకుం బ్రణా మంబులాచరించెదము; అవధరింపుము.

టీక:- మఱియున్ = అంతేకాక; కలండు = దేవు డున్నాడు {కలండు - దేవుడు త్రికాలములు భూత భవిష్యత్ వర్తమానము లందు ఉన్నాడు}; లేడు = దేవుడు లేడు {లేడు - దేవుడు త్రికాలములు భూత భవిష్యత్ వర్తమానము లందు లేడు}; సర్వంబుసెఱుంగున్ = దేముడు సర్వజ్ఞుడు {సర్వంబు సెఱుగు - సృష్టి స్థితి లయ తిరోధానానుగ్రహము లనెడి పంచకృత్యములు మొదలైనవానిని అన్నిటిని దేముడు ఎరుగును}; ఇంచుకసెఱుంగును = దేముడు కొంత మాత్రమే తెలిసిన వాడు; బద్ధుండు = మాయకు లోబడువాడు {బద్ధుండు - ప్రకృతి పాశములచేత కట్టుబడువాడు, మాయకు లోబడువాడు}; విముక్తుండు = ముక్తిపొందినవాడు {విముక్తుడు - ప్రకృతి పాశములనుండి విముక్తి పొందినవాడు}; ఒకండు = అన్యరహితుడు; అనేకుండును = సర్వ దేవతా రూపకుడు {అనేకుడు - శ్రు. ఏకోదేవా బహుధానివిష్టః, ఒక్కడుగాను అనేకులుగాను ఉన్నవాడు దేవుడు}; అను = అనెడి; ఇవి = ఇవి; మొదలుగాగల = మొదలైన; వాదంబులు = మతములు, ప్రసంగములు; మాయ = భ్రమ; వలనన్ = వలన; అనురోధింపుదురు = జరిపెదరు; కావున = అందుచేత; నానా = అనేక విధములైన; వాదా = ప్రసంగములకు; అనురోధకుండవు = అనుకూలుడవు; అయ్యున్ = అయినప్పటికి; అభిదాన = పేర్లయొక్క; అభిధేయ = పేర్లుగల వస్తువులయొక్క; శక్తి = వస్తు గుణముల; భేదంబుల = ఎక్కువతక్కుల; వలన = చేత; బహు = అనేకవిధములైన {బహు ప్రభావ ప్రతీతుడు - క. నానా దేహోపాధుల, నానాత్వ భ్రాంతినొంది నానీదనుచున్, నానాభిమానములచే, నానావిభవంబులాయె నారాయణుఁడే (రామస్తవరాజము)}; ప్రభావ = సర్వజ్ఞత్వాది మహిమలచేత; ప్రతీతుండవు = ప్రసిద్ధుడవు; అయ్యున్ = అయినప్పటికి; చక్షున్ = కన్ను; ఆది = మొదలైన; రూపంబుల = అవయవములచేత; ప్రమాణ = నిశ్చయింపబడిన; రూపకుండవు = రూపము కలవాడవు; అయ్యున్ = అయినప్పటికి; నిరపేక్ష = సాధానానంతరాపేక్ష లేని; జ్ఞానంబున్ = విజ్ఞానమును; కలిమిన్ = కలిగుం డుటచేత; కవివి = స్వయంప్రకాశుడవు; అయ్యున్ = అయినప్పటికి; వేదమయ = వేదస్వరూపమైన; నిశ్వాసత్వంబు = నిశ్వాస కలిగి యుండుట; వలనన్ = చేత; శాస్త్ర = శాస్త్రములకు;

యోనివి = జన్మస్థాన మైనవాడవు; అయ్యున్ = అయినప్పటికి; సంకర్షణ = అహంకారమున కధిదేవత; వాసుదేవ = బుద్ధి కధిదేవత; ప్రద్యుమ్న = మనస్సున కధిదేవత; అనిరుద్ధ = చిత్తమున కధిదేవత; రూపంబుల = వ్యూహ రూపములు కలవాడవు; వలన = అగుట వలన; చతుః = నాలుగు విధములైన; మూర్తివి = వ్యూహములు కలవాడవు; అయ్యున్ = అయినప్పటికి; భక్త = అనన్య భక్తి గల; జన = వారిని; పాలకుండవు = ఏలువాడవు; అయ్యున్ = అయినప్పటికి; అంతఃకరణ = మనసులోపల {అంతఃకరణము - మనోబుద్ధి చిత్తాహంకారములకు మూలమైన ప్రధానము}; ప్రకాశత్వంబున్ = తెలియబడుట {ప్రకాశత్వము - శబ్ద స్పర్శాది వ్యాపారములందు ప్రవర్తించునట్లు చేయుట}; కలిగి = కలవాడపై; సేవకజన = భక్తులకు; ఫల = ధర్మార్థ కామ మోక్ష ఫలములు; ప్రదానంబు = ఇచ్చుట; కొఱకున్ = కోసము; గుణ = త్రిగుణములచేత; ఆచ్ఛాదకుండవు = ఆవరింపబడినవాడవు; అయ్యున్ = అయినప్పటికి; చిత్తాది = చిత్తము మున్నగువాని {చిత్తాది వర్తనములు- 1చిత్తము 2అహంకారము 3మనస్సు 4బుద్ధి రూపములైన చతురంతఃకరణముల చలన కర్తవ్య సంకల్ప నిశ్చయ వ్యాపారములు నిర్వహించునవి}; వర్తనంబులు = వ్యాపారములచేత; కానందగిన = తెలిసికొనదగిన; గుణంబులన్ = ఆ త్రిగుణముల; కున్ = కు; సాక్షివి = ఎడమగా నుండి చూచువాడవు; ఐ = అయ్యి; ఒరులకు = బ్రహ్మజ్ఞానులకంటె నితరుల; కున్ = కు; ఎఱుంగరామిన్ = తెలిసికొనశక్యము గానిచేత; అగోచరుం డవు = కంటికి కనబడనివాడవు; అయ్యున్ = అయినప్పటికి; తర్కింపరాని = ఇట్టిదట్టిదని చెప్ప వీలుకాని; పెంపు = మహిమ; వలనన్ = వలన; అవ్యాహత = ఊహింపరాని; విహారుండవు = మహిమలు గలవాడవు; అయ్యున్ = అయినప్పటికి; సకలకార్య = సకల కార్యములకు {సకల కార్యములు - అవ్యక్తము మహత్తత్వము అహంకారము పంచతన్మాత్రలు పంచభూతము అనెడి చతుర్దశ కార్యములు}; హేతువు = మూలకారణభూతుడవు, ఉత్పత్తిస్థాన మైనవాడవు; అయ్యున్ = అయినప్పటికి; అంతఃకరణ = చతురంతఃకరణములను {చతురంతఃకరణములు - 1చిత్తము 2అహంకారము 3బుద్ధి 4మనస్సులు}; ప్రవర్తకత్వంబు = నడపువాడవు;

వలన = అగుట వలన; హృషీకేశుండవు = హృషీకేశుడవు {హృషీకేశుడు - చతుర్దశేంద్రియములకు (దశేంద్రియములు చతురంతఃకరణములుకు) నియామకుడు}; అయ్యును = అయినప్పటికి; సాధన = యోగాది సాధనలచే నైనను; వశంబుగాని = స్వాధీనముకాని, అందని; ఆత్మారామత్వంబు = ఆత్మారాముడవు {ఆత్మారామత్వము - తన యందు తానే క్రీడించుట కలిగి యుండుట}; వలన = అగుట వలన; మునివి = మౌనశీలివి; అయ్యున్ = అయినప్పటికి; స్థూల = ఆదిభౌతికము; సూక్ష్మ = ఆధ్యాత్మికము; గతులన్ = మార్గము లందును; ఎఱుంగుచున్ = తెలిసికొనుచు; ఎందున్ = దేని యందును; చెందక = అంటక, వస్త్వంతర సంబంధము లేక; నీవు = నీవు; విశ్వంబున్ = ప్రపంచ స్వరూపుడవు; కాకయున్ = కాకపోయినను; విశ్వంబు = ప్రపంచ స్వరూపము; నీవ = నీవే; అయ్యును = అయినప్పటికి; విశ్వ = ప్రపంచము {విశ్వభావాభావసందర్శనము - భగవంతుడు ప్రపంచోత్పత్తికి ముందు లయము తరువాత నుండువాడు కనుక ఉండుట లేకపోవుటలు రెండు చూచును}; భావ = కలిమి, సృష్టితరువాత; అభావ = లేమి, లయముతరువాత; సందర్శనము = చూచుట; చేయుచున్ = చేస్తు; విద్య = ఆత్మజ్ఞానము; అవిద్యల = ఆత్మజ్ఞాన రాహిత్యమున; కున్ = కు; హేతువు = కారణభూతము; ఐన = అయినట్టి; నీ = నీ; కున్ = కు; ప్రణామంబులు = నమస్కారములు; ఆచరించెదము = చేసెదము; అవధరింపుము = చిత్తగింపుము.

<u>భావము:-</u> దేవుడు ఉన్నాడనీ, లేడనీ వాదిస్తు ఉంటారు. దేవుడికి అన్నీ తెలుసుననీ, జీవుడికి కొంచమే తెలుసుననీ అంటారు. జీవుడు ఒకప్పుడు సంసారబంధంలో ఇరుక్కున్నాడనీ పిమ్మట మోక్షం పొందాడనీ అంటారు. దేవుడు ఒకడే అనీ, అనేక రూపాలలో ఉన్నాడనీ అంటారు. ఇలాంటి వాదాలన్నీ మాయ వలన కలుగుతూ ఉంటాయి. అనేక వాదాల చిక్కులుగా తెలియ బడువాడవు నీవే. నీవు అనేక పేర్లు రూపాలు శక్తుల తారతమ్యములతో నానావిధ మహిమల చేత తెలియబడుతూ ఉంటావు. కన్నులు మొదలైన ఇంద్రియాలచే గ్రహించ వీలగు రూపంగాను గమనింపబడతు, ఆ గమనింపులుగా కూడ ఉంటావు. నీ యందలి

జ్ఞానానికి ఆధారాలు కాని సంకేతాలు కాని అవసరం లేదు. సమస్తాన్ని కల్పిస్తూ కవిపై ప్రవర్తిల్లుతావు. నీ నిశ్వాసమే వేదం కనుక, శాస్త్రం అనే సమస్తము నీనుండే తెలుసుకోబడుతూ ఉంటాయి. ఆ శాస్త్రాలకి ఉత్పత్తి స్థానంగా ఉంటావు కనుక, "సంకర్షణుడు", "వాసుదేవుడు", "ప్రద్యుమ్నుడు", "అనిరుద్ధుడు"అనే "చతుర్వ్యూహ మూర్తి"గా తెలియబడతావు. భక్తి కలిగిన వాళ్ళని నీవే సాకుతూ ఉంటావు. అందరి హృదయాలలో సర్వం తెలిసి ఉండి, వారి భక్తికి తగిన ఫలాలను అందేటట్లు చేస్తావు. అందుచేత గుణాలచేత ఆవరింపబడిన వాడివిగా కనబడతావు. చిత్తం మొదలైన వాని వర్తనలచేత తెలియదగిన గుణాలకి గోచరిస్తున్నట్లే ఉంటావు. కాని ఇతరులకు గోచరించకుండా సాక్షిగా వాళ్ళలోనే ఉంటావు. తర్కానికి అతీతమైన వాడవై, ఇట్టిదట్టిదని నిరూపించడానికి రాని విహారం కల వాడవు. సృష్టిలోని సమస్తమైన కార్యాలకి మూలకారణం నీవే. అంతఃకరణానికి విషయ గ్రహణ శక్తి కలుగ చేస్తావు కనుక, సర్వ ఇంద్రియాలకు అధిపతివి (హృషీకములకు ఈశుడు). తన యందు తానే క్రీడించు శక్తి కలవాడవు కనుక సాధనకు లొంగే వాడివి కాదు. మునిపై మౌనంగా అందరిలోను ఉంటావు. స్థూలమైన వానిలో స్థూలుడుగా, సూక్ష్మమైన వానిలో సూక్ష్ముడుగా తెలియబడుతూ ఉంటావు. కాని రెంటికి నీవు అంటనివాడవు కనుక ప్రపంచానికి అతీతమైనవాడవు, నీవు ప్రపంచ స్వరూపుడవై ఉంటావు. లోకముయొక్క కలిమి లేములను సాక్షివై చూస్తూ ఉంటావు. విద్యకు అవిద్యకు సర్వానికి కారణభూతుడవు, కర్తవు నీవే. అటువంటి నీకు నమస్కరిస్తున్నాము. అవధరింపుము.

10.1-684-క.

లోక జనిస్థితిలయములు

గైకొని చేయుదువు త్రిగుణకలితుఁడవై కా

లాకారమున నమోఘ

శ్రీకలితుఁడ వగుచు నిచ్చ జెందక యీశా!

టీక:- లోక = జగత్తునకు; జని = బ్రహ్మరూపమున సృష్టి; స్థితి = విష్ణురూపమున పాలన; లయ ములు = శివరూపమున లయము; కైకొని = స్వీకరించి; చేయుదువు = నీవే ఆచరించెదవు; త్రిగుణ = మూడుగుణములుతోడ {త్రిగుణములు - 1శాంతవృత్తిగల సత్వగుణము 2ఘోరవృత్తిగల రజో గుణము 3మూఢవృత్తిగల తమోగుణము అనెడి మూడుగుణములు}; కలితుండవు = కూడుకొన్న వాడవు; ఐ = అయ్యి; కాల = కాలముయొక్క {కాలము - నిమేష ప్రళయాది రూపములు కలది. సర్వము కలిగించెడిది}; ఆకారమునన్ = స్వరూపముతో; అమోఘ = వ్యర్థముకాని. తిరుగులేని; శ్రీ = షడ్గుణై శ్వర్యములు; కలితుడవు = కలవాడవు; అగుచున్ = అగుచు; ఇచ్ఛన్ = అపేక్షను; చెందక = పొందక; ఈశా = కృష్ణా {ఈశుడు - బ్రహ్మాదులను సృష్ట్యాది కార్యము లందు నియమించు వాడు, విష్ణువు}.

భావము:- పరమేశ్వరా! నీవు తిరుగులేని అష్టైశ్వర్యాలూ కలవాడవు. కాల స్వరూపుడవు. త్రిగుణాలను అవలంబించిన వాడవు. అయినట్టి నీవు ఎట్టి అపేక్ష పొందక, ఈ లోకాలను అన్నిటినీ పుట్టిస్తూ, నిలబెట్టుతూ, నశింపచేస్తూ ఉంటావు.

10.1-685-క.

ఈ శాంతులు గాని తనువు

లీశా! యీ మూఢజాతు లీ సజ్ఞాతుల్

యీశాంత తనువులందుఁ బ్ర

కాశింతువు ధర్మహితముగా సుజనులలోన్.

టీక:- ఈ = ఈ కనబడుచున్న; శాంతలుగాని = శాంతాది సద్గుణములు లేని; తనువులు = దేహధారి జీవులు; ఈశా = సర్వభోక్త, కృష్ణా; ఈ = ఈ కనబడుచున్న; మూఢ = నీ స్వరూప జ్ఞానములేని; జాతులు = జన్మలు; ఈ = ఈ కనబడుచున్న; సజ్ఞాతుల్ = నీ స్వరూపజ్ఞాన మున్నవి; ఈశాంత = ఈశ్వరుడే తుదిగా గల; తనువులు = దేహధారి

జీవులు; అందున్ = అందు; ప్రకాశింతువు = వెలిగెదవు; ధర్మ = వర్ణాచారములకు; హితముగా = మేలు కలుగుటకు; సుజనుల = సజ్జనుల; లోన్ = అందు.

భావము:- ఈశ్వరా! నీవు శాంతి లేని వారిలోను, మూఢులైన వారి లోను, జ్ఞానులైన వారిలోను, ఈశ్వరుడే తుదగా జీవించే వారి లోను అందరిలోను ప్రకాశిస్తుంటావు. కాని ధర్మానికి మేలు చేయటం కోసం మంచి వాళ్ళలో తరచుగా ప్రకాశిస్తావు.

10.1-686-ఉ.

నేరము లెన్న నెక్కడివి? నేము దలంచు తలంపు లోపలన్
నేరుపు లున్నవే? సుతుల నేరముఁ దండ్రులు ద్రోచిపుచ్చరే?
నేరము చేయువారి ధరణీపతు లొక్కకమాటు గావరే?
నేరము గల్గు మద్విభుని నే డిటఁ గావఁగదే కృపానిధీ!

టీక:- నేరములు = తప్పులు (శిక్షించదగినవి); ఎన్నన్ = తరచి చూసినచో; ఎక్కడివి = ఎక్కడ ఉన్నవి; నేము = మేము; తలంచు = తలచెడి; తలంపులు = ఆలోచనలు; అందులోన్ = అన్నిటిలోని; నేరుపులు = చతురత్వములు, నేర్పులు; ఉన్నవే = ఉన్నాయా, లేవు; సుతుల = కొడుకుల; నేరమున్ = తప్పును; తండ్రులు = తండ్రులు; త్రోసిపుచ్చరే = విడిచిపెట్టరా, విడిచెదరు; నేరము = తప్పు; చేయు = చేసెడి; వారిన్ = వారిని; ధరణీపతులు = రాజులు; ఒక్కొక్క = ఒక్కొక్క; మాటు = సారి; కావరే = క్షమించరా; నేరము = తప్పు; కల్గు = చేసినట్టి; మత్ = మాయొక్క; విభుని = భర్తను; నేడు = ఇవాళ; ఇటన్ = ఇక్కడ; కావగదే = కాపాడుము; కృపానిధీ = దయాసాగరా, కృష్ణా.

భావము:- దయాసాగరా! కృష్ణా! మేము చేసే ఆలోచనలలో నేర్పులన్నవి లేవు కదా! నీ సన్నిధిలో నేరాలు అంటూ ఏముంటాయి? పిల్లలు తప్పులు చేస్తే తండ్రులు క్షమించరా! రాజులు కూడ ఒక్కొక్కసారి నేరంచేసేవారిని కూడ క్షమిస్తుంటారు కదా!

నేరం చేసిన మా భర్త కాళియుడుని క్షమించు. నీవు కరుణకు పుట్టిల్లు వంటివాడవు కదా! కాపాడు తండ్రీ!

10.1-687-శా.

బాలుం డీతఁడు మంచివాఁ డనుచుఁ జెప్పన్ రాము క్రూరుండు దు
శ్శీలుండౌ నవు నైన నేము సుభగశ్రీఁ బాసి వైధవ్య దు
ష్టాలంకారముఁ బొంద నోడెద మనాథాలాప మాలింపవే?
చాలున్ నీ పద తాండవంబు; పతిభిక్షం బెట్టి రక్షింపవే?

టీక:- బాలుండు = అమాయకుడు; ఈతడు = ఇతను; మంచివాడు = యోగ్యుడు; అనుచున్ = అని; చెప్పన్ = చెప్పుటకు; రాము = వచ్చిన వారము కాము; క్రూరుండు = చెడ్డమనసు కలవాడు; దుశ్శీలుండున్ = చెడు నడవడిక గలవాడు; ఔనవున్ = అవును; ఐనన్ = అయినప్పటికి; నేము = మేము; సుభగ = అయిదవతనమను; శ్రీన్ = సంపదను; పాసి = తొలగి; వైధవ్య = వైధవ్యము అనెడి; దుష్ట = చెడ్డ; అలంకారమున్ = అలంకారమును; పొందన్ = పొందుటకు; ఓడెదము = భయపడు చున్నాము; అనాథ = నీవు తప్ప దిక్కులేనివారి; ఆలాపమున్ = వేడ్కొనుటను; ఆలింపవే = వినుము; చాలున్ = ఇక చాలును; నీ = నీయొక్క; పద = అడుగుల; తాండవంబు = లయబద్ధ ప్రక్షేపములు; పతిభిక్షన్ = భర్త అనెడి భిక్షను; పెట్టి = అనుగ్రహించి; రక్షింపవే = కాపాడుము.

భావము:- ఈ కాళీయుడు అమాయకుడు, మంచివాడు అనడం లేదు. నిజమే! ఇతడు క్రూరుడు, దుష్టుడు. అయినా మేము సౌభాగ్యాన్ని పోగొట్టుకొని అసహ్య రూపాలతో ఉండే వైధవ్యం పొందలేము. మేము అనాథలము. మా దీనాలాపాలను మన్నించు. ఇక నీ పాదతాడనాలు చాలించు. పతిభిక్ష పెట్టి మమ్ము పాలించు!

10.1-688-ఉ.

ఆకుల మయ్యె భోగ మిదె యాదల లన్నియు వ్రస్సెఁ బ్రాణముల్
రాకలఁ బోకలం బొలిసె రాయిడి పెట్టక మా నిజేశుపై
నీ కరుణాకటాక్షములు నిల్పఁగదే తగ నో! సమస్త లో
కైకశరణ్య! యో! యభయకారణ! యో! కమలామనోహరా!

టీక:- ఆకులము = నలగినది; అయ్యెన్ = అయినది; భోగము = ఇతని దేహము; ఇదె = ఇదిగో; ఔదలలు = పడగలు; అన్నియున్ = సర్వము; వ్రస్సెన్ = చిట్లెను; ప్రాణముల్ = పంచప్రాణవాయువులు; రాకలన్ = ఉచ్ఛ్వాసములు; పోకలన్ = నిశ్వాసములు; పొలిసె = క్షీణించెను; రాయిడి = బాధలు; పెట్టక = పెట్టకుండ; మా = మాయొక్క; నిజేశు = భర్త; పైన్ = మీద; నీ = నీయొక్క; కరుణా = దయ కలగిన; కటాక్షములున్ = కడగంటి చూపులను; నిల్పగదే = ఉంచుము; తగన్ = నిండుగా; ఓ = ఓ; సమస్త లోకైకశరణ్య = కృష్ణా {సమస్త లోకైక శరణ్యుడు - సమస్తమైన చతుర్దశ భువనములకు ఒక్కడే ఐన రక్షకుడు, విష్ణువు}; ఓ = ఓ; అభయకారణ = కృష్ణా {అభయ కారణుడు - భక్తులకు భయము లేకుండ చేయుటకు హేతువు ఐనవాడు, విష్ణువు}; ఓ = ఓ; కమలామనోహరా = కృష్ణా {కమలా మనోహరుడు - కమల (లక్ష్మీదేవికి) మనోహరుడు (భర్త), విష్ణువు}.

భావము:- అన్ని లోకాలలోను శరణు ఇవ్వగల ఒకే ఒక్క ప్రభువా! ఓ అభయమును ఇచ్చే దేవా! ఓ లక్ష్మీపతీ! ఇతని దేహమంతా నలిగి చితికిపోయింది. తలలు పగిలిపోయాయి. ప్రాణాలు వస్తున్నాయా, పోతున్నాయా అన్నట్లు ఉన్నాడు. ఇంకా బాధపెట్టకుండా, మా భర్త మీద నీ దయ గల చూపులు ప్రసరించి రక్షించు.

10.1-689-ఆ. *

మమ్ముఁ బెండ్లి చేయు మా ప్రాణవల్లభు
ప్రాణమిచ్చి కావు భక్తవరద!
నీవు చేయు పెండ్లి నిత్యంబు భద్రంబు
పిన్ననాటి పెండ్లి పెండ్లి కాదు.

టీక:- మమ్మున్ = మమ్ములను; పెండ్లిచేయుము = పెళ్ళిచేయుము, కూర్చుము; మా = మాయొక్క; ప్రాణవల్లభు = భర్తయొక్క; ప్రాణమున్ = ప్రాణమును; ఇచ్చి = ఇచ్చి; కావు = కాపాడుము; భక్తవరద = కృష్ణా {భక్తవరదుడు - భక్తుల కోరికలు తీర్చువాడు, విష్ణువు}; నీవు = నీవు; చేయు = చేసెడి; పెండ్లి = పెళ్ళి, శుభము; నిత్యంబు = శాశ్వతమైనది; భద్రంబు = మేలైనది; పిన్ననాటి = మా చిన్నప్పటి; పెండ్లి = పెళ్ళి; పెళ్ళి = పెళ్ళి అని చెప్పదగినది; కాదు = కాదు.

భావము:- భక్తులకు వరాలిచ్చే మహానుభావ! శ్రీకృష్ణ! మా ప్రాణప్రియుడైన కాళీయుడి ప్రాణాలు ప్రసాదించి, అతనితో మాకు కల్యాణం చేయించు. చిన్నప్పుడు జరిగిన మా పెళ్ళి కల్యాణం కాదు. ఇప్పుడు నీవు మాకు చేసేదే కల్యాణం శాశ్వతంగా ఉండేది, క్షేమకరమైనది.

10.1-690-ఇం.

నీయాన; యెవ్వారిని నిగ్రహింపం
డా యుగ్ర పాపాకృతి నందడింకన్;
నీ యాజ్ఞలో నుండెడు నేఁటఁగోలెన్
మా యాకు ప్రాణంబులు మాకు నీవే."

టీక:- నీ = నీమీద; ఆన = ఒట్టు; ఎవ్వారిని = ఎవరిని; నిగ్రహింపడు = బాధింపడు; ఆ = మునుపటి; ఉగ్ర = భయంకరమైన; పాప = పాపరూపమైన; ఆకృతిన్

= ఆకారమును; అందడు = చెందడు; ఇంకన్ = ఇకపైన; నీ = నీవు పెట్టెడి; ఆజ్ఞన్ = ఆజ్ఞకు; లోన్ = లోబడి; ఉండెడున్ = ఉండగలడు; నేట = ఇవాల్టి; కోలెన్ = నుంచి; మా = మాయొక్క; ఈశు = భర్త; ప్రాణంబులున్ = ప్రాణములను; మా = మా; కున్ = కు; ఈవే = ఇమ్ము.

భావము:- నీ మీద ఒట్టు; ఈ కాళియుడు ఇంకెవ్వరిని బాధపెట్టడు; ఇంకెప్పటికి భయంకరమైన పాపిష్టి రూపమెత్తడు; ఇవేళ్టి నుంచి నువ్వు చెప్పినట్లే నడచుకుంటాడు; మా భర్త ప్రాణాలను మాకు ప్రసాదించవయ్యా స్వామీ!."

10.1-691-వ.

అని యిట్లు తమ పెనిమిటి బ్రతుకుఁ గోరెడి భుజగసతుల యందు శరణాగత వత్సలుండైన పుండరీకాక్షుండు కరుణించి, చరణఘట్ట నంబుచాలించి, తలం గిన, నెట్టకేలకుఁ బ్రాణేంద్రియముల మరలం బడసి, చిదిసి నలఁగిన తలలు సవరించుకొని, వగర్చుచు భుజగపతి జలజనయనునికి నంజలిచేసి మెల్లన నిట్లనియె.

టీక:- అని = అని; ఇట్లు = ఇలా; తమ = వారియొక్క; పెనిమిటి = భర్త; బ్రతుకున్ = జీవించి ఉండుటను; కోరెడి = వేడుకొనెడి; భుజగ = సర్ప; సతుల = స్త్రీల; అందున్ = ఎడల; శరణాగత వత్సలుండు = శరణు ఛొచ్చినవారి ఎడల అనుగ్రహము కలవాడు; ఐన = అయిట్టి; పుండరీకాక్షుండు = కృష్ణుడు; కరుణించి = దయచూపి; చరణ = పాదముల; ఘట్టనంబు = తాకిడిని, తన్నులను; చాలించి = ఆపి; తలంగినన్ = ఇవతలకు రాగా; ఎట్టకేలకున్ = బహు ప్రయాసముతో; ప్రాణ = ప్రాణములను; ఇంద్రియములన్ = ఇంద్రియములను; మరలన్ = మళ్ళీ; పడసి = వశములోనికి పొంది; చిదిసి = చితికిపోయి; నలగిన = నలగిపోయిన; తలలున్ = పడగలను; సవరించుకొని = చక్కజేసుకొని; వగపు = విచారము; కదురన్ = కలుగగా; భుజగపతి = సర్పరాజు, కాళియుడు; జలజనయనుని = పద్మాక్షుని, కృష్ణుని;

కిన్ = కి; అంజలి = నమస్కారము; చేసి = చేసి; మెల్లన = మెల్లిగా; ఇట్లు = ఇలా; అనియె = పలికెను.

భావము:- ఇలా తమ భర్త జీవించటాన్ని కోరుకుంటున్న కాళియుని భార్యలైన నాగకాంతలను, శరణు జొచ్చినవారిని కాపాడే వాడైన శ్రీకృష్ణుడు కరుణించాడు. తన కాలితాపులు ఆపుచేసి పక్కకి తప్పుకొన్నాడు. నాగరాజు తన ప్రాణాలు చిట్టచివరకు దక్కించుకొన్నాడు. నలిగి చితికిన తన తలలను సవరించుకొన్నాడు. ఆయసంతో వగరుస్తూ కృష్ణుడికి తలవంచి నమస్కారం చేసి నెమ్మదిగా ఇలా అన్నాడు.

కాళిందుని విన్నపము

10.1-692-చ.

"మలఁకలు మా ప్రచారములు మా ముఖముల్ విషవహ్ని ఘోరముల్;
ఖలులము; రోషజాతులము; గర్వుల; మే మొక మంచివారమే?
నళినదళాక్ష! ప్రాణులకు సైజగుణంబులు మాన నేర్చునే?
పెలయవె? మా వికారములు వింతలె? మే లొనరించి తీశ్వరా!

టీక:- మలకలు = వంకర లైనవి; మా = మాయొక్క; ప్రచారములు = సంచారములు, నడకలు; మా = మాయొక్క; ముఖములు = మోములు; విష = విషము అనెడి; అగ్ని = అగ్నితో; ఘోరముల్ = భయంకరమైనవి; ఖలులము = దుష్టులము; రోష = కోపముతోనే; జాతులము = పుట్టినవారము; గర్వులము = అహంకారము కలవారము; మేమున్ = మేము; ఒక = కొంచమైనా; మంచివారమే = మంచివాళ్ళమా, కాదు; నళినదళాక్ష = కృష్ణా {నళినదళాక్షుడు - నళిన (తామర) దళ (రేకులవంటి) అక్షుడు (కన్నులు కలవాడు), కృష్ణుడు}; ప్రాణుల్ = జంతువుల; కున్ = కు; సైజ = స్వభావమువలన కలిగిన; గుణంబులు = లక్షణములు; మానన్ = పోవుట; నేర్చునే = సాధ్యమా, కాదు; పెలయవె = ప్రసిద్ధములు కావా, అవును; మా = మాయొక్క;

వికారములు = దుష్టచేష్టలు; వింతలె = విచిత్రమైనవా, కాదు; మేలు = మంచి; ఒనరించితి = చేసితివి; ఈశ్వరా = కృష్ణా.

భావము:- "కమలలాంటి కన్నులున్న శ్రీకృష్ణా! పరమేశ్వరా! మావి వంకరటింకర వర్తనలు, నడకలు. మా నోర్లు విషాగ్నులతో ఘోరమైనవి. మేము దుష్టులము, పొగరుబోతులము. మా జాతే రోషపు జాతి. ఇంకా మేం మంచివారిలా ఎలా ఉండగలము. ఈ సృష్టిలోని జీవులు తమ సహజగుణాలు మార్చుకోలేవు కదా. అవి స్థిరంగా ఉండిపోతాయి కదా. మేం వికృత చేష్టలు చేయటం వింతేమి కాదు గదా. అయినా ఇవాళ నాకు చాలా ఉపకారం చేసావు.

10.1-693-సీ.

వివిధ భావాకార వీర్యబీజాశయ-
జవయోనియుతముగా జగము లెల్ల
నీవ చేసితి మున్న; నే మా జగంబులో-
సహజకోపనులము సర్పములము;
దుర్వారమైన నీ తోరంపు మాయ నే-
మెఱిఁగి దాఁటెడు పని కెంతవార;
మంతకుఁ గారణ మఖిలేశ్వరుండవు-
సర్వజ్ఞుఁడవు నీవు జలజనయన!

10.1-693.1-తే.

మనిచె దేనిని మన్నించి మనుపు నన్ను
నిగ్రహించెద వేనిని నిగ్రహింపు;
మింక సర్వేశ! మాయిమ్ము లెందుఁ గలవు
చిత్తమందున్న క్రమమునఁ జేయఁదగును.

టీక:- వివిధ = నానావిధములైన; భావ = జననాది వికారములు; ఆకార = ఆకృతులు; వీర్య = శక్తులు; బీజ = మూలలక్షణములు; ఆశయ = అభిప్రాయములు; జవ = వేగములు; యోని = జన్మస్థానములు; యూతముగా = కూడుకొన్నవి; కాన్ = అయిన; జగములు = భువనములు; ఎల్లన్ = సమస్తమును; నీవ = నీవే; చేసితి = సృష్టించితివి; మున్న = ముందుగనే; నేము = మేము; ఆ = ఆ; జగంబు = విశ్వము; లోన్ = అందు; సహజకోపనులము = కోపముతోడనేపుట్టినవారము {సహజ కోపనులము - సహ (కూడా) జ (పుట్టిన) కోపనులము (కోపము కలవారము), పాములము}; సర్పము లము = పాములము, ప్రాకులాడువారము; దుర్వారము = దాటరానిది; ఐన = అయిన; నీ = నీయొక్క; తోరంపు = మిక్కిలి అధికమైన; మాయన్ = మాయను; నేము = మేము; ఎఱిగి = తెలిసికొని; దాటెడు = దాటుటను; పని = చేయుట; కిన్ = కు; ఎంతవారము = అశక్తులము; అంత = సమస్తమున; కున్ = కు; కారణము = కారణభూతుడవు; అఖిలేశ్వరుండవు = సర్వనియామకుడవు; సర్వజ్ఞుడవు = అన్ని తెలిసిన వాడవు; నీవు = నీవు; జలజనయన = పద్మాక్ష, కృష్ణా.

మనిచెదు = కాపాడెడివాడవు; ఏనినిన్ = అయినచో; మన్నించి = ఆదరించి; మనుపు = కాపాడుము; నన్నున్ = నన్ను; నిగ్రహించెదవు = శిక్షించెడివాడవు; ఏనినిన్ = అయినచో; నిగ్రహింపుము = శిక్షింపుము; ఇంక = ఇక; సర్వేశా = కృష్ణా {సర్వేశుడు - పంచకృత్యములను (సృష్టి స్థితి లయ తిరోధానానుగ్రహములను) నియమించు ప్రభువు, విష్ణువు}; మా = మాకు; ఇమ్ములు = ఇష్టాలు; ఎందు = ఎక్కడ; కలవు = ఉన్నాయి; చిత్తము = నీ మనసు; అందున్ = లో; ఉన్న = ఉన్నట్టి; క్రమమునన్ = ప్రకారముగా; చేయదగును = చేయుము.

భావము:- పద్మాక్షా! శ్రీకృష్ణా! ఈ సృష్టి అంతటికి నువ్వే కారణభూతుడవు, సర్వేశ్వరుడవు. సమస్తము తెలిసిన వాడవు. పూర్వం నువ్వే ఈ లోకాలన్నిటిని వివిధ స్వభావాలు, రూపాలు, వీర్యములు, వీర్యాతిశయాలు, జననస్థానాలతో కూడినవిగా సృష్టించావు. మేం ఆ సృష్టిలో సహజంగా కోపస్వభావం కలిగిన పాములం. అద్భుత

మైన నీ మాయ దాటరానిది. ఆ మాయని తెలుసుకొని దాటాలంటే మా వల్ల కాదు. కనుక పరమేశ్వరా! నన్ను క్షమించదలచుకొంటే క్షమించి పాలించు. శిక్షించదలచుకొంటే శిక్షించు. ఇంకా మా ఇష్టాలు ఎక్కడున్నాయి. నీ ఇష్ట ప్రకారమే చెయ్యి.

10.1-694-క.

నా పుణ్య మేమి చెప్పుదు?

నీ పాదరజంబుఁ గంటి నేఁ; సనకాదుల్

నీ పాదరజముఁ గోరుదు

రే పదమం దున్ననైన నిఁక మేలు హరీ!"

టీక:- నా = నాయొక్క; పుణ్యము = అదృష్టము; ఏమి = ఏమని; చెప్పుదు = చెప్పగలను; నీ = నీయొక్క; పాద = కాలి; రజంబున్ = దుమ్మును; కంటిన్ = పొందితిని; నేన్ = నేను; సనకాదుల్ = పరమ ఋషులు {సనకాదులు - సనకుడు సనందనుడు సనత్కుమారుడు సనత్సుజాతుడు}; నీ = నీయొక్క; పాద = పాద; రజమున్ = ధూళిని; కోరుదురు = అపేక్షింతురు; ఏ = ఏ; పదము = స్థానము; అందున్ = లో; ఉన్ననైనన్ = ఉండినను; ఇకన్ = ఇకమీద; మేలు = మంచిదే; హరీ = కృష్ణా.

భావము:- శ్రీహరీ! సనకసనందాది దివ్యమునులు కూడ నీ పాద ధూళినే కావాలని కోరుకుంటారు. అలాంటి నీ పాదధూళి నేను పొందగలిగాను. నా పుణ్యం ఎంత గొప్పదో కదా? ఇంక నేను ఏ స్థితిలో ఉన్నా సరే నాకు శోభనమే."

కాళిందుని శాసించుట

10.1-695-వ.

అని విన్నవించిన కాళియు పలుకులు విన నవధరించి

కారుణ్యమానసుం డైన సర్వేశ్వరుం డతని కిట్లనియె

టీక:- అని = అని; విన్నవించినన్ = మనవి చేసుకొన్న; కాళియు = కాళియుని యొక్క; పలుకులు = మాటలు; వినన్ = అంగీకరించుటకు; అవధరించి = గ్రహించి; కారుణ్య = దయ గల; మానసుండు = మనసు గలవాడు; ఐన = అయిన; సర్వేశ్వ రుండు = కృష్ణుడు; అతని; కిన్ = కి; ఇట్లు = ఈ విధముగ; అనియె = పలికెను.

భావము:- ఈ విధంగా మనవి చేసుకొన్న కాళియుడి మాటలు విని మన్నించ దలచుకొన్న దయాస్వభావి, సర్వేశ్వరుడు అయిన కృష్ణుడు అతనిని ఇలా ఆజ్ఞాపిం చాడు.

10.1-696-క.

“గోవర్గముతో మనుజులు

ద్రావుదు రీ మడుఁగు నీరుఁ; దగ దిం దుండన్;

నీవును నీ బాంధవులును

నీ వనితలు సుతులుఁ జనుఁడు నేఁ డంబుధికిన్.

టీక:- గో = ఆవుల; వర్గము = సమూహము; తోన్ = తోపాటు; మనుజులు = మానవులు; త్రావుదురు = తాగెదరు; ఈ = ఈ; మడుగు = మడుగులోని; నీరున్ = నీటిని; తగదు = యుక్తము కాదు; ఇందున్ = ఈ మడుగు నందు; ఉండన్ = ఉండుట; నీవును = నీవు; నీ = నీయొక్క; బాంధవులును = చుట్టాలు; నీ = నీయొక్క;

వనితలు = స్త్రీలు; సుతులు = పిల్లలు; చనుడు = వెళ్ళండి; నేడు = ఇవాళ; అంబుధి = సముద్రమున {అంబుధి - అందు (నీటికి) నిధి, కడలి}; కిన్ = కు.

భావము:- "కాళియుడా! ఈ మడుగులోని నీటిని గోవులతో పాటు మనుషులు కూడా తాగుతారు. కనుక, ఇంక నువ్వు ఇక్కడ ఉండ కూడదు. నువ్వు, నీ పెళ్ళం పిల్లలు, బంధువులు అందరితో కలిసి ఇవాళే సముద్రం లోకి వెళ్ళిపోండి.

10.1-697-క.

నిను నే శాసించిన కథ
మనమునఁ జింతించి రేపుమాపును గీర్తిం
చిన మనుజులు నీ భయమును
వినుమెన్నఁడు బొంద రెందు విషవిజయముతోన్.

టీక:- నినున్ = నిన్ను; నే = నేను; శాసించిన = శిక్షించిన; కథ = వృత్తాంతము; మనమునన్ = మనసు నందు; చింతించి = విచారించుకొని; రేపుమాపు = ప్రతిదినము; కీర్తించిన = స్తుతించునట్టి; మనుజులు = మానవులు; నీ = నీ వలన; భయమును = భీతిని; వినుము = వినుము; ఎన్నడున్ = ఎప్పుడును; పొందరు = పొందరు; ఎందున్ = ఎక్కడను; విష = విషమును; విజయము = జయించుట; తోన్ = తోటి.

భావము:- నిన్ను నేను శిక్షించిన ఈ కథను మనస్సులో స్మరించి, ప్రతిరోజు పఠించే మనుషులు విషాన్ని జయించి సురక్షితంగా ఉంటారు. వారు ఎవ్వరు ఎప్పుడు ఎక్కడ ఇకపై మీ పాముల గురించి భయం పొందరు.

10.1-698-మ.

ఇది మొద లెవ్వరైన నరు లీ యమునాతటినీ హ్రదంబులో

వదలక తోఁగి నన్ను నుపవాసముతోడఁ దలంచి కొల్చుచుం

గదలక దేవతాదులకుఁ గా జలతర్పణ మాచరించినన్

సదమలచిత్తులై దురితసంఘముఁ బాయుదు రా క్షణంబునన్.

టీక:- ఇది = ఇప్పటి; మొదలు = నుంచి; ఎవ్వరు = ఎవరు; ఐనన్ = అయినను; నరులు = మానవులు; ఈ = ఈయొక్క; యమునాతటిన్ = యమునానది వద్ద; ఈ = ఈయొక్క; హ్రదంబు = మడుగు; లోన్ = అందు; వదలక = పూని; తోఁగి = స్నానముచేసి; నన్నున్ = నన్ను; ఉపవాసము = నిరాహారము; తోడన్ = తోటి; తలంచి = ధ్యానించి; కొల్చుచున్ = సేవించుచు; కదలక = స్థిరముగా; దేవతలు = దేవతలు; ఆదుల = మున్నగువారి; కున్ = కు; కాన్ = అగునట్లు; జలతర్పణము = నీటిని తృప్తికై సమర్పించుట; ఆచరించినన్ = చేసినచో; సత్ = మిక్కలి; అమల = నిర్మలమైన; చిత్తులు = మనసులు కలవారు; ఐ = అయ్యి; దురిత = పాపముల; సంఘమున్ = సముదాయమును; పాయుదురు = వదలివేసెదరు; ఆ = ఆ; క్షణంబునన్ = క్షణమునందే.

భావము:- ఇప్పటి నుంచి ఈ యమునా నది మడుగులో స్నానంచేసి, ఉపవాసం ఉండి, నన్ను పూజించి, దేవతలు మొదలైన వారికి జలతర్పణాలు వదలిన వారెవరైనా ఆ క్షణంలోనే నిర్మలమైన మనస్సు కల వారు అవుతారు. వారి పాపాలన్నీ తత్క్షణమే తొలగి పోతాయి.

10.1-699-ఆ.

గరుడభీతి రమణకద్వీప మొల్ల కీ
మడువుఁ జొచ్చి తీవు; మత్పదాబ్జ
లాంఛనములు నీ తలను నుంటఁ జూచి యా
పక్షిరాజు నిన్నుఁ బట్ట డింక."

టీక:-గరుడ = గరుత్మంతుని వలన; భీతిన్ = భయముచేత; రమణక = రమణకము అనెడి; ద్వీపమున్ = ద్వీపమున ఉండుటకు; ఒల్లక = అంగీకరింపక; ఈ = ఈయొక్క; మడువున్ = మడుగును; ఛొచ్చితివి = ప్రవేశించితివి; ఈవు = నీవు; మత్ = నాయొక్క; పద = పాదము లనెడి; అబ్జ = పద్మముల; లాంఛనములు = గుర్తులు; నీ = నీయొక్క; తలనున్ = పడగలపైన; ఉంటన్ = ఉండుటను; చూచి = చూసి; ఆ = ఆ ప్రసిద్ధుడైన; పక్షిరాజు = గరుత్మంతుడు; నిన్నున్ = నిన్ను; పట్టడు = పట్టుకొనడు; ఇంక = ఇకపైన.

భావము:- ఇంతకు ముందు గరుత్మంతుని వలన భయంతో రమణకద్వీపాన్ని వదలిపెట్టి ఈ మడుగులో చేరావు. కాని నా పాదాల గుర్తులు నీ పడగలమీద ఉండటం చూసి, ఇకపై పక్షిరాజైన గరుత్మంతుడు నిన్ను పట్టుకొనడు."

10.1-700-వ.

అని యిట్లు విచిత్రవిహారుండైన గోపాలకృష్ణకుమారుం డానతిచ్చిన, నియ్య కొని, చయ్యన నయ్యహీంద్రుండు తొయ్యలులుం దానును నెయ్యంబున నయ్యీశ్వరునకు నవ్యదివ్యాంబరాభరణ రత్నమాలికాను లేపనంబులు సమ ర్పించి, తేఁటితండంబులకు దండ యగు నీలోత్ప లంబుల దండ యిచ్చి, పుత్ర మిత్ర కళత్ర సమేతుండై, బహువారంబులు కైవారంబుచేసి, వలగొని, మ్రొక్కి లేచి, వీడ్కొని రత్నాకరద్వీపంబు నకుం జనియె; నిట్లు.

టీక:- అని = అని; ఇట్లు = ఈ విధముగ; విచిత్ర = ఆశ్చర్యకరమైన; విహారుండు = వర్తన కలవాడు; ఐన = అయిన; గోపాల = గోపాలుడైన; కృష్ణకుమారుండు = బాలకృష్ణుడు; ఆనతిచ్చినన్ = సెలవియ్యగా, చెప్పగా; ఇయ్యకొని = అంగీకరించి; చయ్యన = శీఘ్రమే; ఆ = ఆయొక్క; అహి = సర్ప; ఇంద్రుడు = శ్రేష్ఠుడు; తొయ్యలులున్ = భార్యలు; తానును = అతను; సెయ్యంబునన్ = భక్తితో; ఆ = ఆ ప్రసిద్ధుడైన; ఈశ్వరున్ = కృష్ణున; కున్ = కు; నవ్య = సరికొత్త; దివ్య = భవ్యమైన; అంబర = బట్టలు; ఆభరణ = భూషణములు; రత్నమాలిక = రత్నాలహారములు; అనులేపంబులు = మేని పూతము; సమర్పించి = చక్కగా నిచ్చి; తేటి = తుమ్మెదల; తండంబుల్ = బారుల; కున్ = కు; దండ = ఆవాసము; అగు = ఐన; నీలోత్పలంబుల = నల్లకలువల; దండ = దండను; ఇచ్చి = ఇచ్చి; పుత్ర = కొడుకులతోను; మిత్ర = స్నేహితులతోను; కళత్ర = భార్యలతోను; సమేతుండు = కూడినవాడు; ఐ = అయ్యి; బహు = అనేక; వారంబులు = మార్లు; కైవారంబులు = నమస్కారములు; చేసి = చేసి; వలగొని = ప్రదక్షిణలుచేసి; మ్రొక్కి = వంగి నమస్కరించి; లేచి = లేచి; వీడ్కొని = సెలవు తీసుకొని; రత్నాకర = కడలిలోని {రత్నాకరము - రత్నములు ఉండు స్థానము, సముద్రము}; ద్వీపంబున్ = ద్వీపమున; కున్ = కు; చనియె = వెళ్ళిపోయెను.

భావము:- ఈ విధంగా విచిత్రమైన నడవడికలు కలిగిన గోపాలుడైన బాలకృష్ణుడు కాళియుడిని ఆజ్ఞాపించేడు. ఆ నాగరాజు వెంటనే అంగీకరించాడు. తన భార్యలతో కలిసి అతను కృష్ణుడికి సరికొత్త దివ్యవస్త్రాలు, ఆభరణాలు, రత్నహారాలు, సుగంధ మైపూతలు సమర్పించాడు. ఇంకా తియ్యటితేనెలు వెల్లివిరిసే నల్లకలువల దండ సమర్పించాడు. పెళ్ళంపిల్లలు స్నేహితులు అందరితో కలిసి అనేకమార్లు ఆ నందనందనునికి వందనాలు చేసాడు, ప్రదక్షిణలు చేసి, మొక్కాడు. సెలవుతీసుకొని సముద్రంలోని ఒక ద్వీపానికి వెళ్ళిపోయాడు.

10.1-701-క.

వారిజలోచనుఁ డెవ్వరు

వారింపఁగలేని ఫణినివాసత్వంబున్

వారించిన యమున సుధా

వారిం బొలుపారె నెల్లవారికిఁ బ్రియమై."

టీక:- వారిజలోచనుడు = పద్మాక్షుడు, కృష్ణుడు; ఎవ్వరున్ = ఎవరుకూడ; వారింపగలేని = అడ్డుకొనలేని; ఫణిన్ = కాళియసర్పముయొక్క; నివాసత్వంబున్ = ఉనికిని; వారించినన్ = పోగొట్టగా; యమున = యమునానది; సుధా = అమృతపు; వారిన్ = నీటిని; పొలుపారెన్ = ఒప్పి ఉండెను; ఎల్లవారి = లోకు లందర; కిన్ = కి; ప్రియము = ఇష్టమైనది; అయ్యె = అయ్యె.

భావము:- కమలలాంటి కన్నులున్న కన్నయ్య ఎవరికి వారింప శక్యంకాని కాళియుడనే సర్పం నివాసాన్ని తొలగించగానే యమునానది అమృతం వంటి నీళ్ళతో అందరికి ప్రీతిపాత్రమై విలసిల్లింది."

కాళియుని పూర్వకథ

10.1-702-వ.

అనిన విని "మునీంద్రా! యేమి కారణంబునఁ గాళియుండు భుజగనివాసం బైన రమణకద్వీపంబు విడిచె? నతం డొక్కరుండును గరుడున కేమి తప్పుఁ దలంచె?" నని నరవరుం డడిగిన మునివరుం డిట్లనియె.

టీక:- అనినన్ = అని చెప్పగా; విని = వినినవాడై; ముని = మునులలో; ఇంద్రా = శ్రేష్ఠుడా; యేమి = ఏ; కారణంబునన్ = నిమిత్తమై; కాళియుండు = కాళియసర్పరాజు; భుజగ = పాములకు; నివాసంబు = ఉనికిపట్టు; ఐన = అయిన; రమణక = రమణక మనెడి; ద్వీపంబు = ద్వీపమును {ద్వీపము - సప్తద్వీపములలోనిది}; విడిచెన్ = వదలిపెట్టెను; అతండు = అతను; ఒక్కరుండును = ఒక్కడు; గరుడున్ = గరుత్మంతుని; కిన్ = కి; ఏమి = ఏమి; తప్పు = అపకారము; తలంచెను = తలపెట్టెను; అని = అని; నరవరుండు = రాజు, పరీక్షిత్తు; అడిగినన్ = అడుగగా; ముని = మునులలో; వరుండు = ఉత్తముడు; ఇట్లు = ఈ విధముగ; అనియె = పలికెను;

భావము:- అలా శుకముని చెప్పగానే పరీక్షిన్మహారాజు ఇలా అడిగాడు. “మునీంద్రా! పాములకు నివాసమైన రమణకద్వీపాన్ని కాళీయుడు ఎందుకు వదలిపెట్టాడు? అతడొక్కడూ గరుత్మంతునికి ఏమి అపచారం చేసాడు.” అప్పుడు శుకయోగి ఇలా అన్నాడు.

10.1-703-సీ.

"సర్వభీరువులైన జనులెల్ల నెలనెల-
సరసభక్ష్యములు వృక్షముల మొదల
సర్పంబులకుఁ బెట్ట, సర్పంబులును మును-
సర్పాంతకుఁడు దమ్ముఁ జంప కుండఁ
బ్రతిమాసమును దమ భాగ భక్ష్యంబు లా-
పక్షి రాజున కిచ్చి బ్రతుకు చుండ,
విషవీర్యదుర్మదావిష్టుఁడై కాళియుఁ-
డహికులాంతకుని పా లపహరించి

10.1-703.1-తే.

యీక తనపాలి బలి భాగ మెల్లఁ దినిన
విని ఖగేంద్రుఁడు కోపించి "వీని తలలు
చీఁలి చెండాడి భోగంబు చించిపైచి
ప్రాణములఁ బాపి వచ్చెదఁ బట్టి"యనుచు.

టీక:- సర్ప = పాములవలన; భీరువులు = భయపడువారు; ఐన = అయిన; జనులు = ప్రజలు; ఎల్లన్ = అందరు; నెలనెల = ప్రతిమాసమునందు; సరస = రసవంతములైన; భక్ష్యములు = భోజన పదార్థములు; వృక్షముల = చెట్ల; మొదలన్ = మొదళ్ళవద్ద; సర్పంబుల్ = పాముల; కున్ = కోసము; పెట్టన్ = పెడుతుండగా; సర్పంబులును = పాములు; మును = పూర్వము; సర్పాంతకుడు = గరుత్మంతుడు {సర్పాంతకుడు - పాములకు యముని వంటి వాడు, గరుత్మంతుడు}; తమ్మున్ = వాటిని; చంపకుండన్ = చంపకుండ ఉండుటకు; ప్రతి = ప్రతి ఒక్క; మాసమునన్ = నెలయందు; తమ = వాటి పాలునుండి; భాగ = ఒకవంతు; భక్ష్యంబుల్ = తినుబండారములను; ఆ = ఆ ప్రసిద్ధుడైన; పక్షి రాజున్ = గరుడుని; కిన్ = కు; ఇచ్చి = సమర్పించి; బ్రతుకుచుండన్ = జీవించుచుండగా; విష = తన విషపు; వీర్య = అధిక ప్రభావము వలన; దుఃర్ = చెడ్డ; మద = గర్వము; ఆవిష్టుడు = ఆవేశించినవాడు; ఐ = అయ్యి; కాళియుడు = కాళియుడు; అహికులాంతకుని = గరుత్మంతుని {అహికులాంతకుడు - అహి (సర్పముల) కుల (సమూహమునకు) అంతకుడు (యమునివంటివాడు), గరుడుడు}; పాలున్ = వంతు, భాగమును; అపహరించి = దొంగిలించి.

ఈకన్ = ఈయకపోవుటచేత; తన = అతనియొక్క; పాలి = వంతునకువచ్చిన; భాగము = ఆహార భాగమును; ఎల్లను = అంతటిని; తినిన = భక్షించగా; విని = తెలిసికొని; ఖగేంద్రుడు = గరుత్మంతుడు {ఖగేంద్రుడు - ఖగము (పక్షి)లందు ఇంద్రుడు (శ్రేష్ఠుడు), గరుడుడు}; కోపించి = ఆగ్రహము పొందినవాడై; వీని = ఇతని; తలలు

= పడగలను; చీఱి = చీల్చేసి; చెండాడి = ఎగురగొట్టి; భోగంబున్ = దేహమును; చించిప్రైచి = ముక్కలుచేసి; ప్రాణములన్ పాపి = చంపేసి; వచ్చెదన్ = వెనుకకు వచ్చెదను; పట్టి = పట్టుకొని; అనుచు = అని భావించుచు.

భావము:- "ప్రజలు అందరూ పూర్వం పాములు అంటే ఉన్న భయంతో నెల నెలా మధురమైన పదార్థాలను పాములకు నైవేద్యాలుగా చెట్ల మొదట్లో పెట్టి వెళ్ళేవారు. గరుత్మంతుడు తమను చంపకుండా ఉండటానికి, తమ భాగాలకు వచ్చిన పదార్థాలలో కొంత ప్రతీ మాసం ఖగరాజుకు కానుకగా సమర్పించేవారు. అలా సర్పరాజులు ధైర్యంగా బ్రతుకుతూ ఉండేవారు. కాళీయుడు మాత్రం ఒకసారి తన విషం చాలా గొప్పదని దురహంకారంతో మదించిపోయి, గరుత్మంతుని భాగం ఎగగొట్టి అంతా తానే తినేసాడు. ఇది విన్న గరుత్మంతుడు కోపించి "వీడి తలలు చీల్చి చెండాడి పడగలు చించి ప్రాణాలు తీసి వస్తాను." అంటూ బయలుదేరాడు.

10.1-704-క.

అక్షీణ కనకసన్నిభ

పక్షయుగోద్భూత ఘోర పవమాన మహా

విక్షేప కంపితానే

కక్షోణిధరేంద్రుఁ డగుచు గరుడుఁడు వచ్చెన్.

టీక:- అక్షీణ = పెద్దపైన {అక్షీణము - క్షీణము (తక్కువ) కానిది, పెద్దది}; కనక = బంగారము; సన్నిభ = వంటి; పక్ష = రెక్కల; యుగ = జంటచేత; ఉద్భూత = పుట్టిన; ఘోర = భయంకరమైన; పవమాన = గాలియొక్క; మహా = అధికమైన; విక్షేప = వీచుటచేత, ఎగపుచేత; కంపిత = చలించిపోయెడి; అనేక = పెక్కులైన; క్షోణిధర = పర్వత; ఇంద్రుడు = శ్రేష్ఠములు గలవాడు; అగుచున్ = ఔతూ; గరుడుడు = గరుత్మతుడు; వచ్చెన్ = వచ్చెను.

భావము:- బంగారురంగులో మెరిసిపోతూ ఉన్న గరుత్మంతుని పెద్ద పెద్ద రెక్కలనుండి పుట్టిన బ్రహ్మాండమైన వాయువు మహాఘోరమై ఎన్నో పర్వతాలనే కంపింప జేసింది. అంతటి మహావేగంతో గరుత్మంతుడు కాళీయుడి మీదకు వచ్చాడు.

10.1-705-ఉ.

వచ్చిన సర్వవైరిఁ గని వ్రాలక లేచి మహాఫణావళుల్
విచ్చి దృగంచలంబుల నవీనవిషాగ్నికణంబు లొల్కఁగా
నుచ్చలదుగ్రజిహ్వాలు మహోద్ధతిఁ ద్రిప్పుచు నూర్పు లందుఁ గా
ర్చిచ్చెగయంగఁ బాఱి కఱచెన్ విహగేంద్రు నహీంద్రుఁ డుగ్రతన్.

టీక:- వచ్చినన్ = అలారాగా; సర్వవైరిన్ = గరుడుని; కని = చూసి; వ్రాలక = వెనుదీయకుండగ; లేచి = పైకిలేచి; మహా = గొప్ప; ఫణా = పడగల; ఆవళుల్ = సమూహమును; విచ్చి = విప్పదీసుకొని; దృక్ = కళ్ళ; అంచలంబుల్ = కొనలనుండి; నవీన = సరికొత్త; విష = విషము అనెడి; అగ్ని = నిప్పు; కణంబుల్ = రవ్వలు; ఒల్కగన్ = రాలగా; ఉత్ = మిక్కిలిగా; చలత్ = ఆడుతున్న; ఉగ్ర = భయంకరమైన; జిహ్వాలు = నాలుకలు; మహా = మిక్కుటమైన; ఉద్ధతిన్ = గర్వముతో; త్రిప్పుచున్ = తిప్పుతూ; ఊర్పులు = శ్వాసముల; అందున్ = లోనుండి; కార్చిచ్చు = దావాగ్ని; ఎగయన్ = చెలరేగునట్లుగా; పాఱి = పరుగెట్టుకు వెళ్ళి; కఱచెన్ = కాటువేసెను; విహగేంద్రున్ = గరుడుని {విహగేంద్రుడు - విహగము (పక్షి)లందు ఇంద్రుడు (శ్రేష్ఠుడు), గరుడుడు}; అహి = సర్పములలో; ఇంద్రుడు = గొప్పవాడు; ఉగ్రతన్ = భీకరముగా.

భావము:- అలా వస్తున్న గరుత్మంతుడిని చూసి కాళీయుడు పడగలు వంచుకుని పారిపోలేదు. కాళీయుడు తన బ్రహ్మాండమైన పడగ విప్పి కళ్ళ నుండి విషాగ్ని కణాలు రాలుస్తూ, నాలుకలు సాచి, మహా వేగంతో తల తిప్పుతూ, ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో నుండి జ్వాలలు ప్రసరింప జేస్తూ, ముందుకు దూకి గరుత్మంతుడిని కాటువేశాడు.

10.1-706-క.

కఱచిన భుజగము రదములు

విఱుగఁగ వదనముల విషము పెడలఁగ శిరముల్

పఱియలుగ నడిచె గరుడుఁడు

తఱిమి కనకరుచులు గలుగు తన డాఱెక్కన్.

టీక:- కఱచినన్ = కాటువేయగా; భుజగము = పాము; రదములు = కోరలు; విఱుగగన్ = ముక్కలుకాగా; వదనములన్ = నోళ్ళనుండి; విషమున్ = విషము; పెడలగ = పడగా; శిరముల్ = పడగలు; పఱియలుగన్ = బద్దలుకాగ; అడిచెన్ = కొట్టెను; గరుడుడు = గరుత్మంతుడు; తఱిమి = తరుముతూ; కనక = బంగారు; రుచులు = ఛాయలు; కలుగు = కలిగిన; తన = అతనియొక్క; డాన్ = డాపలి, ఎడమ; ఱెక్కన్ = రెక్కతోటి.

భావము:- కాళీయుడు అలా కాటు వేయగానే గరుత్మంతుడు విజృంభించాడు కాళీయుడిని తరుముకుంటూ వెళ్ళి బంగారు రంగులు చిమ్ముతున్న తన ఎడమ రెక్కతో ఒక దెబ్బ కొట్టాడు. ఆ దెబ్బకు కాళీయుని కోరలు విరిగిపోయాయి. నోటి వెంట రక్తం క్రక్కుకున్నాడు. తలలు చితికి చీలికలై పోయాయి.

10.1-707-వ.

ఇట్లహికులారాతి చేత ప్రేటుపడి వెఱచి పఱతెంచి కాళియుం డీ గభీరంబైన మడుఁగుఁ జొచ్చె; మఱియు నొక్కవిశేషంబు గలదు.

టీక:- ఇట్లు = ఇలా; అహికులారాతి = గరుడుని {అహి కులారాతి - సర్పవంశమునకు శత్రువు, గరుడుడు}; చేతన్ = వలన; ప్రేటుపడి = దెబ్బతిని; వెఱచి = భయపడి; పఱతెంచి = పారిపోయి; కాళియుండు = కాళీయుడు; ఈ = ఈయొక్క;

గభీరమ్మైన = మిక్కిలి లోతైన; మడుగున్ = మడుగును; చొచ్చెన్ = చేరెను; మఱియున్ = ఇంక; ఒక్క = ఒక; విశేషంబు = ప్రత్యేక కారణము; కలదు = ఉన్నది.

భావము:- ఇలా గరుత్మంతుడి చేత దెబ్బలు తిన్న కాళీయుడు భయపడి పారిపోయి ఈ లోతైన మడుగులో ప్రవేశించాడు. ఇక్కడ ఒక విశేషం కూడా ఉంది.

10.1-708-సీ.

మున్ను సౌభరి యను ముని యీ హ్రదంబునఁ-
దపము జేయుచు నుండ ధరణిలోన
నాఁకలిగొని పన్నగాంతకుఁ డొకనాఁడు-
చనుదెంచి యందుల జలచరేంద్రు
నొడిసి భక్షించిన నున్న మీనము లెల్ల-
ఖిన్నంబులై వగఁ గ్రిస్సి యున్నఁ
జూచి యా మునిరాజు శోకించి కోపించి-
గరుడుఁడు నేఁడాది గాఁగ నిందుఁ

10.1-708.1-తే.

జొచ్చి మీనంబులను మ్రింగఁజూచెనేనిఁ
జచ్చుఁగావుత మని యుగ్రశాప మిచ్చెఁ
గాళియుం డొక్కఁడా శాపకథ నెఱుంగు
నితర భుజగంబు లెవ్వియు నెఱుఁగ వధిప!

టీక:- మున్ను = పూర్వము; సౌభరి = సౌభరి; అను = అనెడి; ముని = ఋషి; ఈ = ఈయొక్క; హ్రదంబునన్ = మడుగునందు; తపమున్ = తపస్సు; చేయుచుండన్ = చేయుచుండగా; ధరణి = భూలోకము; లోనన్ = అందు; ఆకలిగొని = ఆకలేసి;

పన్నగాంతకుడు = గరుడుడు {పన్నగాంతకుడు - పన్నగము (పాము) లకు అంతకుడు (యముని వంటి వాడు), గరుడుడు}; ఒక = ఒకానొక; నాడున్ = దినమున; చనుదెంచి = వచ్చి; అందులన్ = దానిలో; జలచరేంద్రున్ = చేపలరాజును; ఒడిసి = ఒడుపుగాపట్టుకొని; భక్షించినన్ = తినివేయగా; ఉన్న = మిగిలిన; మీనములు = చేపలు; ఎల్లన్ = అన్ని; ఖిన్నంబులు = దుఃఖించుచున్నవి; ఐ = అయ్యి; వగన్ = విచారముతో; క్రిస్సి = చిన్నబోయి; ఉన్నన్ = ఉండగా; చూచి = కనుగొని; ఆ = ఆయొక్క; ముని = మునులలో; రాజు = శ్రేష్ఠుడు; శోకించి = బాధపడి; కోపించి = ఆగ్రహించి; గరుడుడు = గరుత్మంతుడు; నేడు = ఈదినము; ఆదిగాగాన్ = మొదలుకొని; ఇందున్ = దినిని; ఛొచ్చి = ప్రవేశించి.

మీనంబులను = చేపలను; మ్రింగన్ = తినవలెనని; చూచెనేని = యత్నించినచో; చచ్చుగావుతము = మరణించుగాక; అని = అని; ఉగ్ర = భయంకరమైన; శాపమున్ = శాపమును; ఇచ్చెన్ = పెట్టెను; కాళియుండు = కాళీయుడు; ఒక్కడు = ఒకడుమాత్రమే; ఆ = ఆ; శాప = శాపముయొక్క; కథన్ = వృత్తాంతమును; ఎఱుంగున్ = తెలిసి ఉండెను; ఇతర = అన్యములైన; భుజగంబులు = పాములు; ఎవ్వియున్ = ఏవికూడ; ఎఱుంగవు = ఎఱుగవు; అధిప = మహారాజ.

<u>భావము:-</u> పూర్వము సౌభరి అనే ముని ఈ మడుగులో తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. గరుత్మంతుడు ఒకనాడు ఆకలివేసి, ఈ మడుగు దగ్గరకు వచ్చాడు. ఇందులో ఉన్న చేపలరాజును పట్టుకుని చంపి తిన్నాడు. మిగిలిన చేపలన్నీ దుఃఖంతో ఉసూరుమంటూ ఏడుస్తూ ఉంటే, ఆ మహర్షి వాటి శోకం చూసి, చాలా బాధపడ్డాడు. అతడు కోపంతో “ఈ నాటి నుండి గరుత్మంతుడు వచ్చి ఇందులో ఉన్న చేపలను మ్రింగడానికి ప్రయత్నించా డంటే వెంటనే చచ్చిపోతాడు” అని భయంకర మైన శాపం ఇచ్చాడు. కాళీయుడు ఒక్కడికే ఈ శాపం గురించి తెలుసు. మిగిలిన పాములకు తెలియదు.

10.1-709-వ.

అది కారణంబుగాఁ గాళియుం డా మడుఁగు జొచ్చియున్న, గో మనుజ రక్షణా ర్థంబు కృష్ణుం డతని వెడలించె; నిట్లు దివ్య గంధాంబర సువర్ణ మణిగణ మాలి కాలంకృతుండయి, మడుఁగు వెడలివచ్చిన మాధవుం గని, ప్రాణలాభంబులం బొందిన యింద్రియం బులంబోలె, యశోదారోహిణీ సమేతలయిన గోపికలు ను, నంద సునందాదులయిన గోపకులును మూర్ఛలం బాసి, తేఱి తెప్పఱిలి, లేచి పరమానందంబులం బొందిరి; బలభద్రుండు తమ్ముని యాలింగ నంబుఁ జేసె; నప్పుడు.

టీక:- అది = దాని; కారణంబుగాన్ = నిమిత్తముచేత; కాళియుండు = కాళీయుడు; ఆ = ఆ ప్రసిద్ధమైన; మడుగున్ = మడుగును; ఛొచ్చి = చేరి; ఉన్నన్ = ఉండుట చేత; గో = గోవులను; మనుజ = మానవులను; రక్షణా = కాపాడుట; అర్థంబున్ = కోసము; కృష్ణుండు = కృష్ణుడు; అతనిన్ = అతనిని; వెడలించెన్ = వెడలగొట్టెను; ఇట్లు = ఈ విధముగ; దివ్య = బహుగొప్ప; గంధ = పరిమళ లేపనములు; అంబర = వస్త్రములు; సువర్ణ = బంగారపు; మణి = రత్నాల; గణ = సమూహముచేత; మాలిక = హారములచేతను; అలంకృతుండు = అలంకరింప బడినవాడు; అయి = ఐ; మడుగున్ = మడుగు నుండి; వెడలివచ్చిన = బయటకు వచ్చిన; మాధవున్ = కృష్ణుని; కని = చూసి; ప్రాణలాభంబులన్ = తిరిగి దక్కిన ప్రాణములు; పొందిన = పొందినట్టి; ఇంద్రియంబులున్ = ఇంద్రియముల; పోలెన్ = వలె; యశోదా = యశోదాదదేవి; రోహిణీ = రోహిణీదేవిలతో; సమేతలు = కూడినవారు; ఐన = అయిన; గోపికలును = గోపికాస్త్రీలు; నంద = నందుడు; సునంద = సునందుడు; ఆదులు = మొదలగువారు; అయిన = ఐన; గోపకులును = గొల్లలు; మూర్ఛలన్ = బాధా పరవశు లగుట; పాసి = తొలగి; తేఱి = తేరుకొని; తెప్పఱిల్లి =

స్తిమితపడి; లేచి = పైకిలేచి; పరమానందంబులన్ = మిక్కిలి సంతోషములను; పొందిరి = పొందిరి; బలభద్రుండు = బలరాముడు; తమ్మునిన్ = తమ్ముడిని; ఆలింగ నంబు = కౌగలించుకొనుట; చేసెన్ = చేసెను; అప్పుడు = ఆ సమయమునందు.

భావము:- అందుచేత, కాళీయుడు ఈ మడుగులో ప్రవేశించి ఉంటున్నాడు. కృష్ణుడు గోవులను గోపాలకులను రక్షించడానికి, అతనిని అక్కడ నుండి వెళ్ళగొట్టాడు. ఈ విధంగా దివ్యగంధాలు, వస్త్రాలు, మణిహారాలు అలంకరించుకుని మాధవుడు మడుగులో నుంచి బయటకు వచ్చాడు. అలా మడుగు నుండి వచ్చిన కృష్ణుని చూడగానే ఇంద్రియాలకు ప్రాణాలు వచ్చినట్లు ఆ బృందావనంలోని ప్రజలు అందరికీ ప్రాణాలు లేచి వచ్చాయి. యశోద రోహిణుల తోపాటు గోపికలు; నందుడు, సునందుడూ మొదలైన గోపకు లందరూ మూర్ఛల నుంచి తేరుకుని తెప్పరిల్లి లేచి పరమానందం పొందారు. బలరాముడు తమ్ముడిని కౌగలించుకున్నాడు.

10.1-710-క.

అంకెలు పైచె వృషభము ల

హంకారముతోడ; లేఁగ లట్టి ట్టులికెం;

బొంకముల నొప్పె ధేనువు;

లంకురితము లయ్యె దరువు లా హరిరాకన్.

టీక:- అంకెలు = గట్టి అరుపులు; పైచెన్ = అరచినవి; వృషభములు = ఎద్దులు; అహంకారము = గర్వము; తోడన్ = తోటి; లేగలు = దూడలు; అట్టిట్టు = అటునిటు; ఉలికెన్ = పరుగులు పెట్టినవి; పొంకములన్ = పొందికలతో; ఒప్పెన్ = చక్కగా ఉన్నవి; ధేనువులు = ఆవులు; అంకురితములు = చిగురించినవి; అయ్యెన్ = అయినవి; తరువులు = చెట్లు; ఆ = ఆ ప్రసిద్ధుడైన; హరి = కృష్ణుడు; రాకన్ = వచ్చుటచేత.

భావము:- కాళింది మడుగు నుండి కృష్ణుడు వెలికి వచ్చిన సంతోషంతో, ఆంబోతులు రంకెలు వేసాయి; లేగదూడలు ఆనందంతో అటూ ఇటూ గంతులు వేశాయి; ఆవులు పొంగిపోయాయి; చెట్లు చిగురించాయి.

10.1-711-క.

"నీ సుతుఁడహిచే విడివడె

నీ సురుచిర భాగ్యమహిమ నిశ్చల"మనుచున్

భూసురులు సతులుఁ దారును

భాసురవచనముల నందుఁ బలికి రిలేశా!

టీక:- నీ = నీయొక్క; సుతుడు = కొడుకు; అహి = పాము; చేన్ = చేతిలో నుండి; విడివడె = బయటపడెను; నీ = నీయొక్క; సు = మంచి; రుచిర = మేలైన; భాగ్య = అదృష్టముయొక్క; మహిమ = ప్రభావము; నిశ్చలము = చలనము లేనిది; అనుచున్ = అని; భూసురులు = బ్రాహ్మణులు {భూసురులు - భూమికి దేవతలు, బ్రాహ్మణులు}; సతులున్ = స్త్రీలు; తారును = వారు; భాసుర = ప్రసిద్ధములైన; వచనములన్ = మంచి మాటలతో; నందున్ = నందుని; పలికిరి = కీర్తించిరి; ఇలేశా = రాజా {ఇలేశుడు - ఇల (భూమి)కి ఈశుడు, రాజు}.

భావము:- "ఓ రాజా! బ్రాహ్మణులు తమ భార్యలతో కలసి నందుని ఉద్దేశించి నీ కొడుకు పాము నోటి నుండి బయటపడ్డాడు. నీది గొప్ప మహద్భాగ్యము. ఇక దానికి తిరుగు లేదు." అని అభినందించి ఆశీర్వదించారు .

10.1-712-శా.

"నిన్నా యుగ్ర భుజంగమంబు గఱవన్ నీ వాపదం బొందుచున్
న న్నేమంటి తనూజ! యోడవు గదా నా కూన! నా తండ్రి! రా
వన్నా"యంచు శిరంబు మూర్కొని నిజాంకాగ్రంబుపై నిల్పుచున్
గన్నీ రొల్కఁగఁ గౌగలించెఁ దనయున్ గారాముతోఁ దల్లి దాన్.

టీక:- నిన్నున్ = నిన్ను; ఆ = ఆయొక్క; ఉగ్ర = భయంకరమైన; భుజంగమంబు = పాము; కఱవన్ = కాటువేయగా; నీవున్ = నీవు; ఆపదన్ = ప్రమాదమును; పొందుచున్ = చెందుతు; నన్నున్ = నన్ను; ఏమి = ఏమి; అంటి = అడిగితివి; తనూజ = పుత్రుడా {తనూజుడు - తనువున జనించినవాడు, పుత్రుడు}; ఓడవు = భయపడలేదు; కదా = కదా; నా = నా; కూన = కొడుకా; నా = నా; తండ్రి = నాయనా; రావు = రమ్ము; అన్నా = అయ్యా; అంచున్ = అనుచు; శిరంబున్ = తలను; మూర్కొని = ముద్దాడి; నిజ = తన; అంకాగ్రంబు = ఒడి; పైన్ = మీద; నిల్పుచున్ = ఉంచుకొనుచు; కన్నీరు = కన్నీళ్ళు; ఒల్కగాన్ = కారుతుండగా; కౌగలించెన్ = ఆలింగనము చేసుకొనెను; తనయున్ = పుత్రుని; గారాము = గారాబము; తోన్ = తోటి; తల్లి = తల్లి; తాన్ = తాను.

భావము:- యశోద కృష్ణణ్ణి తన ఒడిలో కూర్చుండ పెట్టుకుని “నా తండ్రీ! నా బాబూ! నిన్ను ఆ భయంకరమైన పాము కరుస్తూ ఉంటే, ఆపదలో చిక్కుపడినప్పుడు నా కోసం ఏమని విలపించావు నాయనా! బెంబేలు పడలేదు కదా” అంటూ కన్నీళ్ళతో గట్టిగా కౌగలించుకుని గారాబం చేసింది.

ఉపాఖ్యానంత ప్రార్థన

12-53-మాలి. *

జగదవనవిహారీ! శత్రులోకప్రహారీ!

సుగుణవనవిహారీ! సుందరీమానహారీ!

విగతకలుషపోషీ! వీరవర్యాభిలాషీ!

స్వగురుహృదయతోషీ! సర్వదాసత్యభాషీ!

టీక:- జగదవనవిహారీ = శ్రీరామా {జగదవనవిహారుడు - జగత్తును అవన (రక్షించుట)కై విహరించువాడు, రాముడు}; శత్రులోకప్రహారీ = శ్రీరామా {శత్రులోక ప్రహారుడు - శత్రువుల సమూహ మును సంహరించువాడు, రాముడు}; సుగుణవన విహారీ = శ్రీరామా {సుగుణవనవిహారుడు – సుగు ణములు అనెడి వనమున విహరిం చువాడు, రాముడు}; సుందరీమానహారీ = శ్రీరామా {సుందరీ మానహారుడు - అందగత్తెల అభిమానమును హరించువాడు, రాముడు}; విగతకలుషపోషీ = శ్రీరామా {విగతకలుషపోషుడు - విగతకలుష (కళంకరహితులను) పోషించువాడు, రాముడు}; వీరవర్యాభిలాషీ = శ్రీరామా {వీరవర్యాభిలాషుడు - వీరవర్యులచేత అభి లషింపదగినవాడు, రాముడు}; స్వగురుహృదయతోషీ = శ్రీరామా {స్వగురుహృదయ తోషుడు - తన గురువునకు సంతోషము కలిగించువాడు, రాముడు}; సర్వదాసత్య భాషీ = శ్రీరామా {సర్వదాసత్యభాషి - ఎల్లప్పుడు సత్యమే పలుకు వాడు, రాముడు}.

భావము:- శ్రీరామా! లోకరక్షణకై విహరించేవాడా! శత్రువులను ప్రహరించేవాడ! సుగుణాలవనంలో విహరించేవాడా! అందగత్తెల అభిమానాన్ని దోచుకొనేవాడా! కళంకరహితులను పోషించేవాడా! వీరవరులచేత అభిలషింపబడేవాడా! స్వీయ గురువు యొక్క మనస్సుకు సంతోషం కలిగించిన వాడా! ఎల్లప్పుడు సత్యమే పలికేవాడా! నీకు నమస్కారం.

12-54-గ.

ఇది శ్రీపరమేశ్వరకరుణాకలిత కవితా విచిత్ర కేసనమంత్రిపుత్ర సహజ పాండిత్య పోతనామాత్య ప్రియశిష్య వెలిగందల నారయ నామధేయ ప్రణీతంబైన శ్రీ మహా భాగవతంబను మహాపురాణంబు దశమ స్కంధ పూర్వభాగ అంతర్గత ధేనుకాసుర వధ మఱియు కాళియమర్దన అను కథలు కల శ్రీకృష్ణ లీలలు- 4వ అను ఉపాఖ్యానంబు సుసంపూర్ణం.



టీక:- ఇది = ఇది; శ్రీ = శోభనుడైన; పరమేశ్వర = భగవంతుని; కరుణా = దయచేత; కలిత = లభించిన; కవితా = కవిత్వము చెప్పుటలో; విచిత్ర = విచిత్రమైన నేర్పుగలవాడు; కేసనమంత్రి = కేసనమంత్రి యొక్క; పుత్ర = పుత్రుడు; సహజ = సహజసిద్ధముగనే; పాండిత్య = పాండిత్యము అబ్బిన వాడు; పోతన = పోతన యనెడి; అమాత్య = అమాత్యుడు యొక్క; ప్రియ = ఇష్ట; శిష్య = శిష్యుడు; వెలిగందల = వెలిగందల; నారాయ = నారాయ అను; నామధేయ = పేరుగలవానిచే; ప్రణీతంబు = సంస్కరింపబడినది; ఐన = అయినట్టి; శ్రీ = శుభకరమైన; మహాభాగవతంబు = మహాభాగవతము; అను = అనెడి; మహా = గొప్ప; పురాణంబున్ = పురాణము; దశమ స్కంధ = పదవ స్కంధ; అంతర్గత = లోపలి; ధేనుకాసురవధ = ధేనుకాసురవధ; మఱియు = ఇంకను; కాళియమర్దనం = కాళియమర్దనము; అను = అనెడి; కథలు = వృత్తాంతములు; కల= కలిగిన; శ్రీకృష్ణలీలలు- 4 = శ్రీకృష్ణలీలలు- 4 ; అను = అనెడి; ఉపాఖ్యానంబు = ఉపాఖ్యానము; సుసంపూర్ణము = పూర్తి ఐనది.

భావము:- ఇది శ్రీ పరమేశ్వరకరుణచేత సంప్రాప్తించిన కవిత్వ వైచిత్రి కల కేసనమంత్రి పుత్రుడు; సహజ పాండిత్యుడైన పోతనామాత్యుని ప్రియశిష్యుడు అయిన వెలిగందల నారాయణ పేరుగలవాని చేత లిఖించబడిన శ్రీమహాభాగవతం అనే మహా పురాదశమస్కంధ పూర్వభాగము నందలి ధేనుకాసురవధ, కాళియమర్దన అనెడి కథలు కలిగిన శ్రీకృష్ణలీలలు-4 అను ఉపాఖ్యానము పూర్తి ఐనది

సర్వం శ్రీకృష్ణార్పణ మస్తు !!

ఓం నమో భగవతే వాసుదేవాయ !!

ఓం! ఓం ! ఓం !

ఓం ! శాంతిః ! శాంతిః ! శాంతిః !

సర్వే జనా స్సుఖినో భవతు !!